

APTEL/26/A4813

# శ్రీ వార్త

జాతీయ తెలుగు దినపత్రిక

కొత్త ఆలోచన.. కొత్త వార్త




సంపుటి : 01 సంచిక :78 ఎడిటర్.: కూరేటి సతీష్ పేజీలు : 08, వెల రూ. 2రూ/ శుక్రవారం - 25 - సెప్టెంబర్ - 2026

Published From : Circulated at Srikakulam,VishakaPatanam,Vijayanagaram, East Godavari, West Godavari, Krishna, Guntur, Prakasam, Nellore, Chittoor,, Kadapa, Anantapuram, Hyderabad

## వరంగల్, ఆదిలాబాద్ ఎయిర్‌పోర్టులకు పేర్లు ఖరారు


2లో

- వరంగల్ విమానాశ్రయానికి 'రాణి రుద్రమ'.. ఆదిలాబాద్‌కు 'కొమరం భీం' పేర్లు!
- ప్రభుత్వ నిర్ణయానికి త్వరలో కేబినెట్ ఆమోదముద్ర
- ఎయిర్‌పోర్టుల డిజైన్లపై సీఎం రేవంత్ రెడ్డి అసంతృప్తి

# ఫార్మా నుంచి ఫిన్‌టెక్ వరకు.. ఢిల్లీలో నారా లోకేశ్ పెట్టుబడుల వేట

### ఏపీలో పెట్టుబడుల కోసం ఢిల్లీలో మంత్రి లోకేశ్ వరుస సమావేశాలు

- ★ కాకినాడలో గ్రీన్ అమ్మోనియా కేంద్రం ఏర్పాటుకు యూరాకు ఆహ్వానం
- ★ విశాఖలో టెక్నాలజీ, ఇంజనీరింగ్ సెంటర్ల ఏర్పాటుకు సిస్కో, శావ్‌లకు విజ్ఞప్తి
- ★ తిరుపతిలో ఎలక్ట్రానిక్ కాంపోనెంట్స్ తయారీ పార్క్ ఏర్పాటు చేయాలని వివోకు సూచన
- ★ వైద్య పరికరాలు, ఆగ్రో కెమికల్ యూనిట్ల ఏర్పాటుకు అబాట్, గోద్రేజ్‌లకు ప్రతిపాదనలు



అమరావతి: ఆంధ్రప్రదేశ్‌ను పారిశ్రామికంగా, ఆర్థికంగా బలోపేతం చేసే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం దూకుడు పెంచింది. రాష్ట్రానికి భారీ పెట్టుబడులను ఆకర్షించేందుకు రాష్ట్ర ఐటీ, ఎలక్ట్రానిక్స్, విద్యాశాఖల మంత్రి నారా లోకేశ్ ఢిల్లీలో పర్యటిస్తున్నారు. ఈ పర్యటనలో భాగంగా ఆయన వ్యవసాయం, ఆగ్రో కెమికల్స్, ఐటీ, ఫార్మా, ఎలక్ట్రానిక్స్, మౌలిక సదుపాయాల రంగాలకు చెందిన పలు దిగ్గజ సంస్థల ప్రతినిధులతో వరుస సమావేశాలు నిర్వహిస్తున్నారు. రాష్ట్రంలో పెట్టుబడులకు మిగతా 2 లో


2లో

## కాకినాడ జిల్లాలో కుండపోత వర్షాలు.. అధికారులకు పవన్ కల్యాణ్ కీలక ఆదేశాలు

- కాకినాడ జిల్లాలో భారీ వర్షాలపై కలెక్టర్‌తో ఫోన్‌లో సమీక్షించిన పవన్ కల్యాణ్
- వర్షాలు తగ్గే వరకు యంత్రాంగం అత్యంత అప్రమత్తంగా ఉండాలని ఆదేశం
- జిల్లాలో 1,885 హెక్టార్లలో పంట నష్టం జరిగినట్లు ప్రాథమిక అంచనా
- పిఠాపురం సుద్దగడ్డ వాగు, ఉప్పాడ తీర ప్రాంత పరిస్థితిపై ప్రత్యేకంగా ఆరా
- నష్టపోయిన వారికి తక్షణం పరిహారం అందించేలా చర్యలు తీసుకోవాలని సూచన

## ఉపాధ్యాయులపై దాడి చేసిన వారితో జగన్.. మీరెవరి వైపు?: లోకేశ్


2లో

- టీచర్లపై దాడి చేసిన వారు జగన్‌తో ఉన్నారన్న లోకేశ్
- నిందితుల ఫొటోలను సోషల్ మీడియాలో విడుదల చేసిన మంత్రి
- పలువురు రౌడీషీటర్ల పేర్లు బహిర్గతం
- తాను టీచర్ల వైపు, జగన్ రౌడీల వైపు అని వ్యాఖ్య

## విశాఖను ముంచెత్తిన భారీ వర్షం.. 24 సెం.మీ. వర్షపాతం


2లో

- కళింగపట్నం వద్ద తీరందాటిన వాయుగుండం
- ఉత్తరాంధ్ర జిల్లాల్లో దంచికొడుతున్న వర్షాలు
- విశాఖలో ప్రధాన రహదారుల జలమయం

# విద్యుత్ ఉత్పత్తి చేసే విధంగా అవసరమైన చర్యలు తీసుకోవాలి

### రాష్ట్రంలో ప్రస్తుత అవసరాలకు తగినట్లు విద్యుత్ కొనుగోలు చేయాలి

- పిట్ హెడ్ (బొగ్గు గనుల పైనే విద్యుత్ కేంద్ర నిర్మాణం) కాకుండా, యాదాద్రి థర్మల్ కేంద్రాన్ని ఎందుకు దూరంగా నిర్మించారు
- సింగరేణిలో ఇప్పటికే 14 బొగ్గు బ్లాకులు మూతపడ్డాయి
- రాష్ట్రంలో ప్రస్తుతం నెలకొన్న విద్యుత్ అవసరాల దృష్ట్యా మహానది కోల్ ఫీల్డ్స్, కోల్ ఇండియా నుంచి బొగ్గు కొనుగోలుకు చర్యలు ప్రారంభించాలి
- యాదాద్రి థర్మల్ విద్యుత్ కేంద్రంలో ఉత్పత్తికి అవసరమైన జీ-9 గ్రేడ్ బొగ్గు విషయంలో తక్షణమే కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి తో చర్చించాలి



దసరా లోపు యాదాద్రి థర్మల్ విద్యుత్ కేంద్రం పూర్తిస్థాయిలో విద్యుత్ ఉత్పత్తి చేసే విధంగా అవసరమైన చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశించారు. యాదాద్రి థర్మల్ విద్యుత్ కేంద్రంలో ఉత్పత్తికి అవసరమైన జీ-9 గ్రేడ్ బొగ్గు విషయంలో తక్షణమే కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి తో చర్చించాలని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క కి సూచించారు. విద్యుత్ శాఖపై ముఖ్యమంత్రి ఉప ముఖ్యమంత్రి తో కలిసి ఎంసీఆర్ హెచ్‌ఆర్‌డీ బోధి పెవిలియన్‌లో ఉన్నతస్థాయి సమావేశంలో సమీక్షించారు. యాదాద్రి థర్మల్ కేంద్రంలో పూర్తి స్థాయి మిగతా 2 లో

# భారీ వర్షాలు.. జిల్లాల కలెక్టర్లకు కీలక ఆదేశాలు జారీ చేసిన చంద్రబాబు

### డిసెంబరు 7-9 తేదీల్లో గ్లోబల్ సమిట్‌కు ప్రచారం

- వర్షాలు తగ్గుముఖం పట్టేంత వరకు ఏ అధికారి కూడా అశ్రద్ధ వహించకూడదన్న చంద్రబాబు
- లోతట్టు ప్రాంత ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించాలని ఆదేశం
- ఆహారం, మంచినీరు, వైద్య సదుపాయాలు అందుబాటులో ఉంచాలన్న సీఎం



అమరావతి: ఏపీలో తీవ్ర వాయుగుండం కారణంగా భారీ వర్షాల నేపథ్యంలో ముఖ్యమంత్రి చంద్రబాబు అధికార యంత్రాంగాన్ని అప్రమత్తం చేశారు. వరద ప్రభావిత జిల్లాల కలెక్టర్లు, ఉన్నతాధికారులతో ఆయన అత్యవసర మిగతా 2 లో


2లో

## పక్క రాష్ట్ర సీఎం చంద్రబాబు నీటిని తీసుకువెళ్తుంటే... రేవంత్‌రెడ్డి సొంత జిల్లాను ఎండబెడుతున్నారు

- "ఆంధ్రాలో గ్రాఫ్‌పోలేదే లేదు. తెలంగాణలో మాత్రమే ఉంది
- ఎల్‌నినో వల్ల కాదు... కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యంతోనే రాష్ట్రంలో కరవు
- కాంగ్రెస్ వైఫల్యంతోనే రాష్ట్రంలో కరవు
- కాంగ్రెస్ ప్రభుత్వం 30 శాతం కమీషన్లు తీసుకొంటూ, కమీషన్ మేనేజ్‌మెంట్‌లో ఆరితేరింది

## 2047 నాటికి తెలంగాణను 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దడమే లక్ష్యం


2లో

- గ్లోబల్ సమిట్‌పై అంతర్జాతీయ రోడ్‌షోలు
- డిసెంబరు 7-9 తేదీల్లో గ్లోబల్ సమిట్‌కు ప్రచారం
- సదస్సు నిర్వహణ పర్యవేక్షణకు దాదాపు 10 ప్రత్యేక అధికారుల కమిటీలను ఏర్పాటు చేశాం
- సమిట్‌పై ప్రపంచవ్యాప్తంగా ప్రచారం చేసేందుకు డిజిటల్, సోషల్ మీడియా వేదికలను పూర్తిస్థాయిలో యోగించుకోవాలి


2లో

## స్థానిక సంస్థల ఎన్నికలు.. అభ్యర్థుల ఎంపికపై జగన్ కీలక సూచనలు

స్థానిక సంస్థల ఎన్నికలకు పార్టీ శ్రేణులు పూర్తిగా సిద్ధం కావాలన్న జగన్

ఎన్నికలపై పార్టీ రీజనల్ కో-ఆర్డినేటర్లతో ఉన్నత స్థాయి సమీక్షా సమావేశం

ప్రజాదరణ కలిగిన మంచి అభ్యర్థులను గుర్తించాలని ఆదేశం

## బెంగాల్‌పై గౌతమ్ అదానీ వరాల జల్లు.. లక్ష కోట్ల రూపాయల భారీ పెట్టుబడులు

### బెంగాల్‌ను తమ కర్మభూమిగా భావిస్తున్నట్టు అదానీ వ్యాఖ్య

- 2035 నాటికి వివిధ రంగాల్లో ఈ పెట్టుబడులు పెట్టనున్నట్టు అదానీ వెల్లడి
- కోల్‌కతా సమీపంలో రూ. 4,000 కోట్లతో 'అదానీ ఆరోగ్య మందిర్' ఆసుపత్రికి శంకుస్థాపన
- ఆసుపత్రిలో 50% పడకలు పేదలకు కేటాయించి ఉచిత వైద్యం అందిస్తామని హామీ




ఢిల్లీ: ప్రముఖ పారిశ్రామిక దిగ్గజం అదానీ గ్రూప్ పశ్చిమ బెంగాల్ రాష్ట్రంలో భారీ పెట్టుబడులు పెట్టేందుకు ముందుకొచ్చింది. 2035 నాటికి రాష్ట్రంలో లక్ష కోట్ల రూపాయలకు పైగా పెట్టుబడులు పెట్టనున్నట్టు అదానీ గ్రూప్ ఛైర్మన్ గౌతమ్ అదానీ గురువారం ప్రకటించారు. ప్రధానంగా మౌలిక వసతుల మిగతా 2 లో

## బెంగాల్‌పై గౌతమ్ అదానీ వరాల జల్లు..
# లక్ష కోట్ల రూపాయల భారీ పెట్టుబడులు

ఢిల్లీ: ప్రముఖ పారిశ్రామిక దిగ్గజం అదానీ గ్రూప్ పశ్చిమ బెంగాల్ రాష్ట్రంలో భారీ పెట్టుబడులు పెట్టేందుకు ముందుకొచ్చింది. 2035 నాటికి రాష్ట్రంలో లక్ష కోట్ల రూపాయలకు పైగా పెట్టుబడులు పెట్టనున్నట్టు అదానీ గ్రూప్ ఛైర్మన్ గౌతమ్ అదానీ గురువారం ప్రకటించారు. ప్రధానంగా మౌలిక వసతుల కల్పనే లక్ష్యంగా ఈ పెట్టుబడులు ఉంటాయని ఆయన స్పష్టం చేశారు. కోల్‌కతా సమీపంలోని న్యూ టౌన్‌లో 2,000 పడకల సామర్థ్యంతో నిర్మించ తలపెట్టిన 'అదానీ ఆరోగ్య మందిర్' ఆసుపత్రి శంకుస్థాపన కార్యక్రమంలో గౌతమ్ అదానీ ఈ కీలక ప్రకటన చేశారు. ఈ కార్యక్రమానికి పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి సువేందు అధికారి హాజరయ్యారు. రాష్ట్రంలో అదానీ గ్రూప్ పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు రావడంపై ఆయన హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా గౌతమ్ అదానీ మాట్లాడుతూ.. పశ్చిమ బెంగాల్‌ను తూర్పు భారతదేశంలో తమ 'కర్మభూమి'గా అభివర్ణించారు. ఈ రాష్ట్రాన్ని కేవలం ఒక పెట్టుబడి కేంద్రంగానే కాకుండా, తాము సేవ చేయాలనుకుంటున్న, భాగం కావాలనుకుంటున్న ప్రదేశంగా చూస్తున్నామని అన్నారు. పోర్టులు, లాజిస్టిక్స్, విద్యుదుత్పత్తి, పంపిణీ, జాతీయ రహదారులు, రోడ్లు, వంతెనల నిర్మాణం, డేటా సెంటర్ల ఏర్పాటు వంటి కీలక రంగాల్లో ఈ లక్ష కోట్ల రూపాయల పెట్టుబడులు పెట్టనున్నట్టు వివరించారు. ఇక 'అదానీ ఆరోగ్య మందిర్' ఆసుపత్రి ప్రాజెక్టు కోసం సుమారు రూ. 4,000 కోట్లు వెచ్చించనున్నారు. ఇది పూర్తిగా లాభాపేక్ష లేని సంస్థగా పనిచేస్తుందని అదానీ స్పష్టం చేశారు. ఆసుపత్రిలోని మొత్తం 2,000 పడకల్లో 50 శాతం, అంటే 1,000 పడకలను ఆర్థికంగా వెనుకబడిన వర్గాల (ఈడబ్ల్యూఎస్) కోసం కేటాయిస్తామని, వారికి పూర్తిగా ఉచితంగా వైద్య సేవలు అందిస్తామని హామీ ఇచ్చారు. భవిష్యత్తులో ఇదే ప్రాంగణంలో ఒక మెడికల్ కాలేజీ, రీసెర్చ్ సెంటర్‌ను కూడా ఏర్పాటు చేయాలనే ప్రణాళిక ఉందని ఆయన వెల్లడించారు. ఈ నిర్ణయం రాష్ట్ర ఆరోగ్య రంగంలో కీలక ముందడుగుగా భావిస్తున్నారు.

## అభివృద్ధి ఒక మానవ హక్కు..
## సమ్మిళిత అభివృద్ధికి కట్టుబడి ఉన్నాం: ఐరాసలో భారత్

ఢిల్లీ: అభివృద్ధి అనేది ప్రతి మనిషికి ఉన్న విడదీయరాని మానవ హక్కు అని, దాన్ని సాధించేందుకు తాము కట్టుబడి ఉన్నామని ఐక్యరాజ్యసమితి (ఐరాస) వేదికగా భారత్ మరోసారి స్పష్టం చేసింది. సమ్మిళిత అభివృద్ధి, అంతర్జాతీయ సహకారం, బహుపాక్షిక సంస్కరణల పట్ల తమ నిబద్ధతను పునరుద్ఘాటించింది. ఈ మేరకు 'అభివృద్ధి హక్కుపై ఒప్పందాన్ని' వీలైనంత త్వరగా ఆమోదించాలని భారత్ మద్దతు తెలిపింది. ఐరాస సర్వప్రతినిధి సభలో 'అభివృద్ధి హక్కు ప్రకటన' 40వ వార్షికోత్సవం సందర్భంగా జరిగిన ఉన్నత స్థాయి సమావేశంలో భారత విదేశాంగ శాఖ కార్యదర్శి (పశ్చిమ దేశాలు) సిబి జార్జ్ ఈ వ్యాఖ్యలు చేశారు. ఆయన భారత జాతీయ ప్రకటనను వినిపిస్తూ, దేశం వైఖరిని స్పష్టం చేశారు. ఈ విషయాన్ని విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి రణ్‌ధీర్ జైస్వాల్ సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ 'ఎక్స్' ద్వారా ధ్రువీకరించారు. ఐక్యరాజ్యసమితి ప్రకారం.. ఈ అభివృద్ధి హక్కు అనేది ప్రతి వ్యక్తి, ప్రజలందరూ ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక, రాజకీయ అభివృద్ధిలో పాలుపంచుకోవడానికి, తోడ్పడటానికి, ఆ ఫలాలను ఆస్వాదించడానికి అధికారం కల్పిస్తుంది. దీని ద్వారానే అన్ని మానవ హక్కులు, ప్రాథమిక స్వేచ్ఛలు పూర్తిగా సాకారం అవుతాయి. గత 40 ఏళ్లలో ఈ ప్రకటన స్ఫూర్తితో ప్రపంచవ్యాప్తంగా సుస్థిర అభివృద్ధి, పేదరిక నిర్మూలన, విద్య, ఆరోగ్య సంరక్షణ వంటి రంగాలలో గణనీయమైన పురోగతి నమోదైంది. కోట్లాది మంది ప్రజలు తీవ్ర పేదరికం నుంచి బయటపడ్డారు. అయినప్పటికీ, ఈ అభివృద్ధిలో చాలా అసమానతలు ఉన్నాయని, పురోగతి అందరికీ సమానంగా చేరలేదని ఐక్యరాజ్యసమితి ఒక ప్రకటనలో పేర్కొంది. అనేక దేశాలు తమ అభివృద్ధికి ఆటంకంగా ఉన్న వ్యవస్థాగత అడ్డంకులను, నిధుల కొరతను ఎదుర్కొంటున్నాయని తెలిపింది. ఈ నేపథ్యంలో 40వ వార్షికోత్సవం ప్రస్తుత ప్రపంచ సవాళ్లను ఎదుర్కోవడానికి, అందరికీ మరింత సమ్మిళిత, సమానమైన భవిష్యత్తును అందించడానికి ఒక ముఖ్యమైన అవకాశమని ఐరాస అభిప్రాయపడింది.

# భారీ వర్షాలు.. జిల్లాల కలెక్టర్లకు కీలక ఆదేశాలు జారీ చేసిన చంద్రబాబు

అమరావతి: ఏపీలో తీవ్ర వాయుగుండం కారణంగా భారీ వర్షాల నేపథ్యంలో ముఖ్యమంత్రి చంద్రబాబు అధికార యంత్రాంగాన్ని అప్రమత్తం చేశారు. వరద ప్రభావిత జిల్లాల కలెక్టర్లు, ఉన్నతాధికారులతో ఆయన అత్యవసర టెలీకాన్ఫరెన్స్ నిర్వహించి సహాయక చర్యలు, ముందస్తు ప్రాణ నష్ట నివారణ చర్యలపై స్పష్టమైన దిశానిర్దేశం చేశారు. వాతావరణం పూర్తిగా అనుకూలించి వర్షాలు తగ్గుముఖం పట్టే వరకు ఏ ఒక్క అధికారి కూడా అశ్రద్ధ వహించకూడదని సూచించారు. జలాశయాలు, నదుల్లో పెరుగుతున్న నీటిమట్టాలను, ఇన్-ఫ్లోలను ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ లోతట్టు ప్రాంత ప్రజలను ముందుగానే పునరావాస కేంద్రాలకు తరలించాలని స్పష్టం చేశారు. ఎక్కడా ప్రాణ, ఆస్తి నష్టం సంభవించకుండా ముందస్తు ప్రణాళికతో వ్యవహరించాల్సిన బాధ్యత అధికారులదేనని తేల్చి చెప్పారు. వరద ముంపునకు గురైన బాధితులకు నాణ్యమైన ఆహారం, మంచినీరు, అత్యవసర వైద్య సదుపాయాలు మరియు మందులు నిరంతరం అందుబాటులో ఉంచాలన్నారు. ఈదురు గాలుల వల్ల చెట్లు, విద్యుత్ స్తంభాలు నేలకొరిగితే తక్షణమే పునరుద్ధరణ పనులు చేపట్టి విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగకుండా చూడాలని ఆదేశించారు. అంతేకాకుండా, వర్షాలు తగ్గిన వెంటనే పంట నష్టంపై కచ్చితమైన అంచనాలు రూపొందించి నష్టపోయిన ప్రతి రైతుకూ ప్రభుత్వం అండగా నిలుస్తుందనే నమ్మకం కలిగించాలని కలెక్టర్లకు తేల్చి చెప్పారు.

## విశాఖను ముంచెత్తిన భారీ వర్షం.. 24 సెం.మీ. వర్షపాతం

అమరావతి: బంగాళాఖాతంలో ఏర్పడిన తీవ్ర వాయుగుండం కళింగపట్నం వద్ద తీరం దాటింది. దాని ప్రభావంతో ఉత్తరాంధ్ర జిల్లాల్లో కుండపోత వర్షాలు కురుస్తున్నాయి. ఈ వేకువజాము నుంచి పడుతున్న వర్షాలకు విశాఖపట్నం నగరం జలదిగ్బంధంలో చిక్కుకోగా, రికార్డు స్థాయిలో 24 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. విశాఖ ఎయిర్‌పోర్టు రన్‌వే పరిసరాల్లో 18 సెం.మీ, కాకినాడ, విజయనగరంలో 13 సెం.మీ, కళింగపట్నం, తునిల్లో 5 సెం.మీ మేర వర్షపాతం రికార్డయింది. విశాఖలోని ప్రధాన రహదారులు జలమయం కావడంతో ట్రాఫిక్ తీవ్రంగా స్తంభించింది. డ్రైనేజీలు పొంగిపొర్లి లోతట్టు ప్రాంతాలు నీటమునిగాయి. వాయుగుండం తీరం దాటినప్పటికీ భూభాగంపై ప్రభావం కొనసాగుతుండటంతో రాగల కొన్ని గంటల్లో ఉత్తరాంధ్రలో మరింత భారీ వర్షాలు కురిసే అవకాశముందని వాతావరణ శాఖ హెచ్చరించింది. జీవీఎంసీ, విపత్తు నిర్వహణ బృందాలు సహాయక చర్యలు చేపడుతుండగా, ప్రజలు అత్యవసరమైతే తప్ప బయటకు రావద్దని అధికారులు సూచించారు.

## వరంగల్, ఆదిలాబాద్ ఎయిర్‌పోర్టులకు పేర్లు ఖరారు

హైదరాబాద్: వరంగల్‌లోని మామునూరు, ఆదిలాబాద్ విమానాశ్రయాలకు రాష్ట్ర ప్రభుత్వం పేర్లు ఖరారు చేసింది. మామునూరు ఎయిర్‌పోర్టుకు కాకతీయ రాణి రుద్రమదేవి పేరు, ఆదిలాబాద్ ఎయిర్‌పోర్టుకు ఆదివాసీ యోధుడు కొమురం భీం పేరు పెట్టాలని ప్రాథమికంగా నిర్ణయించింది. ఈ మేరకు ఫైలును కేబినెట్ సమావేశం ముందుకు తీసుకెళ్లేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇటీవల జరిగిన ఉన్నతస్థాయి సమీక్ష సమావేశంలో ఈ పేర్లపై చర్చ జరిగింది. ఆంధ్రప్రదేశ్‌లో కొత్త విమానాశ్రయాలకు స్వాతంత్ర్య సమరయోధుల పేర్లు పెట్టిన తరహాలోనే, తెలంగాణ చారిత్రక వైభవాన్ని, వీరుల పోరాట స్ఫూర్తిని ప్రపంచానికి చాటిచెప్పేలా ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. కేబినెట్ ఆమోదం పొందిన వెంటనే, ఈ పేర్లను ఖరారు చేయాలని కోరుతూ కేంద్ర ప్రభుత్వానికి అధికారికంగా లేఖ పంపనున్నారు. కేంద్రం నుంచి గ్రీన్ సిగ్నల్ రాగానే గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేస్తారు. అయితే, మామునూరు ఎయిర్‌పోర్టుకు సమ్మక్క-సారలమ్మ పేరు కూడా పరిశీలనలో ఉందని, దీనిపై త్వరలోనే స్పష్టత రానుందని అధికార వర్గాలు చెబుతున్నాయి.

డిజైన్లపై సీఎం అసంతృప్తి

ఇదే సమీక్షలో విమానాశ్రయాల డిజైన్లపై సీఎం రేవంత్ రెడ్డి తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసినట్లు సమాచారం. అధికారులు చూపిన డిజైన్లను చూసి "ఇవి ఎయిర్‌పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఏఏఐ) డిజైన్లా? లేక ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ)తో చేసినవా?" అని ప్రశ్నించినట్లు తెలిసింది. విమానాశ్రయాల నిర్మాణం అద్భుతంగా, తెలంగాణ చరిత్ర, సంస్కృతి ఉట్టిపడేలా ఉండాలని ఆయన స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. సీఎం సూచనల మేరకు అధికారులు ఇప్పుడు కొత్త డిజైన్లను సిద్ధం చేసే పనిలో పడ్డారు. త్వరలోనే తుది డిజైన్లను మళ్లీ సీఎంకు సమర్పించనున్నారు.

## ఉపాధ్యాయులపై దాడి చేసిన వారితో జగన్..
# మీరెవరి వైపు?: లోకేశ్




అమరావతి: వైసీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి, రౌడీషీటర్లకు మధ్య సంబంధాలు ఉన్నాయంటూ రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ సంచలన ఆరోపణలు చేశారు. సోమవారం విజయవాడలోని శాప్ కార్యాలయం వద్ద ఉపాధ్యాయులపై దాడికి పాల్పడిన పలువురు రౌడీషీటర్లు జగన్‌తో కలిసి ఉన్న ఫొటోలను ఆయన బుధవారం రాత్రి తన 'ఎక్స్' ఖాతాలో విడుదల చేశారు. వైసీపీ నిర్వహించిన ఆందోళన సందర్భంగా చోటుచేసుకున్న హింసకు సంబంధించిన వీడియోలను కూడా ఆయన ఈ సందర్భంగా పంచుకున్నారు. పణుగంటి చైతన్య, ఎస్. సందీప్, ఆవుటు శ్రీనివాసరెడ్డి, బంకా అరుణ్ సహా పలువురి పేర్లను లోకేశ్ ప్రస్తావించారు. దాడికి పాల్పడిన వారు జగన్‌తో కలిసి ఉన్న చిత్రాలను ఆయన సాక్ష్యాలుగా పోస్ట్ చేశారు. జగన్ రౌడీషీటర్ల పక్షాన నిలవగా, తాను మాత్రం ఉపాధ్యాయులు, క్రీడాకారుల పక్షాన నిలబడ్డానని లోకేశ్ స్పష్టం చేశారు. ఉపాధ్యాయుల వైపు ఉండాలో, రౌడీల వైపు ఉండాలో ప్రజలే తేల్చుకోవాలని ఆయన పేర్కొన్నారు.

# కాకినాడ జిల్లాలో కుండపోత వర్షాలు.. అధికారులకు పవన్ కల్యాణ్ కీలక ఆదేశాలు

అమరావతి: తీవ్ర వాయుగుండం ప్రభావంతో కాకినాడ జిల్లావ్యాప్తంగా కురుస్తున్న అత్యంత భారీ వర్షాల నేపథ్యంలో, అధికార యంత్రాంగం మరో రెండు రోజుల పాటు అత్యంత అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, పంచాయతీరాజ్ శాఖ మంత్రి పవన్ కల్యాణ్ ఆదేశించారు. వర్షాలు పూర్తిగా తగ్గుముఖం పట్టేవరకు క్షేత్రస్థాయిలో నిరంతర పర్యవేక్షణ కొనసాగించాలని స్పష్టం చేశారు. భారీ వర్షాల కారణంగా జిల్లాలో నెలకొన్న పరిస్థితులపై ఆయన జిల్లా కలెక్టర్ హరేందర్ ప్రసాద్‌తో ఫోన్‌లో మాట్లాడి సమీక్ష నిర్వహించారు.గత రెండు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలు, లోతట్టు ప్రాంతాల పరిస్థితి, జలాశయాల్లో నీటి మట్టాలు, విద్యుత్, తాగునీటి సరఫరా, పంట నష్టం, మత్స్యకారుల భద్రత వంటి పలు కీలక అంశాలపై పవన్ కల్యాణ్ వివరాలు అడిగి తెలుసుకున్నారు. గడిచిన రెండు రోజుల్లో జిల్లావ్యాప్తంగా సగటున 117.6 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైందని, 15 ప్రాంతాల్లో రహదారులపై చెట్లు కూలగా వాటిని తక్షణం తొలగించామని కలెక్టర్ వివరించారు. ప్రాథమిక అంచనాల ప్రకారం జిల్లాలో సుమారు 1,885 హెక్టార్లలో పంట నష్టం వాటిల్లిందని పవన్ కల్యాణ్ దృష్టికి తీసుకెళ్లారు. ప్రత్యేక కంట్రోల్ రూమ్ ద్వారా పరిస్థితిని 24 గంటలూ సమీక్షిస్తున్నామని, ప్రస్తుతం అంతా అదుపులోనే ఉందని తెలిపారు. ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ మాట్లాడుతూ, వరద ముప్పు, సహాయక చర్యలపై అధికారులకు పలు కీలక సూచనలు, ఆదేశాలు జారీ చేశారు. "జిల్లాలో ఇంకా భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని, ఆకస్మిక వరదల ముప్పు పొంచి ఉందని హెచ్చరికలు వస్తున్నాయి. ఈ నేపథ్యంలో లోతట్టు ప్రాంతాలు, ముంపునకు గురయ్యే గ్రామాలు, కాలనీలపై నిరంతరం దృష్టి సారించాలి. అవసరమైన చోట తక్షణమే పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేసి, ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలి" అని స్పష్టం చేశారు. పారిశుద్ధ్య నిర్వహణకు ఆటంకం కలగకుండా, లోతట్టు ప్రాంతాల్లో నీరు నిలిచిపోకుండా పంపుల సహాయంతో ఎప్పటికప్పుడు డీ-వాటరింగ్ చేయాలని ఆదేశించారు. ఈదురు గాలులకు కూలిన చెట్లను వెంటనే తొలగించి, రవాణా వ్యవస్థను పునరుద్ధరించాలన్నారు. విద్యుత్, తాగునీటి సరఫరాలో అంతరాయాలు ఏర్పడితే ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులను తక్షణం పరిష్కరించాలని సూచించారు. ఏలేరు, తాండవ, పంపా, సుబ్బారెడ్డి సాగర్ జలాశయాల్లో నీటి మట్టాలను నిరంతరం గమనిస్తూ, అవసరమైతే దిగువ ప్రాంతాల ప్రజలను ముందస్తుగా హెచ్చరించాలని చెప్పారు. వర్షాలు తగ్గిన వెంటనే క్షేత్రస్థాయిలో పర్యటించి పంట నష్టాన్ని కచ్చితంగా అంచనా వేయాలని, ఆ నివేదికను ప్రభుత్వానికి పంపి రైతులకు వెంటనే పరిహారం అందేలా చర్యలు తీసుకోవాలని పవన్ కల్యాణ్ ఆదేశించారు. ఆస్తి నష్టం జరిగిన బాధితులకు కూడా తక్షణ సహాయం అందించే ఏర్పాట్లు చేయాలన్నారు. తన నియోజకవర్గమైన పిఠాపురం పరిధిలోని సుద్దగడ్డ వాగు ముంపు ప్రాంతాల పరిస్థితిపై ఎప్పటికప్పుడు తనకు నివేదించాలని కోరారు. సముద్రం అల్లకల్లోలంగా ఉన్నందున, ఉప్పాడ తీర ప్రాంతంలో పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. వాయుగుండం ప్రభావం పూర్తిగా తొలగిపోయే వరకు మత్స్యకారులెవరూ సముద్రంలోకి వేటకు వెళ్లకుండా కఠినమైన హెచ్చరికలు అమలు చేయాలన్నారు. జిల్లాలో పరిస్థితి తిరిగి సాధారణ స్థితికి వచ్చేంత వరకు యంత్రాంగం ప్రతి క్షణం అప్రమత్తంగా ఉండి ప్రజలకు అండగా నిలవాలని పవన్ కల్యాణ్ దిశానిర్దేశం చేశారు.

## 2047 నాటికి తెలంగాణను
## 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దడమే లక్ష్యం

హైదరాబాద్: డిసెంబరు 7-9 తేదీల్లో నిర్వహించనున్న గ్లోబల్ సమిట్‌కు ప్రచారం కోసం తెలంగాణకు పెట్టుబడులు వచ్చే అవకాశం ఉన్న దేశాల్లో అంతర్జాతీయ రోడ్‌షోలు నిర్వహించేందుకు ప్రణాళిక సిద్ధం చేయాలని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అధికారులను ఆదేశించారు. ఏ దేశంలో ఏ రంగం నుంచి పెట్టుబడులు రావడానికి అవకాశాలున్నాయో అధ్యయనం చేసి, దానికనుగుణంగా రోడ్‌షోల నిర్వహణకు ప్రణాళికలు రూపొందించాలని సూచించారు. సచివాలయంలో గ్లోబల్ సమిట్ సన్నాహక సమావేశంలో మంత్రులు శ్రీధర్‌బాబు, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, అజారుద్దీన్, అడ్లూరి లక్ష్మణ్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు సహా పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా భట్టి మాట్లాడుతూ... "ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత నిర్వహిస్తున్న రెండో ప్రపంచస్థాయి సదస్సు ఇది. దీని ద్వారా రాష్ట్ర సమగ్ర అభివృద్ధికి బలమైన పునాదులు వేయాలి. 2047 నాటికి తెలంగాణను 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నాం. సదస్సు నిర్వహణ పర్యవేక్షణకు దాదాపు 10 ప్రత్యేక అధికారుల కమిటీలను ఏర్పాటు చేశాం. ప్రతి కమిటీకి ఒక సీనియర్ అధికారి నేతృత్వం వహిస్తారు. సమిట్‌పై ప్రపంచవ్యాప్తంగా ప్రచారం చేసేందుకు డిజిటల్, సోషల్ మీడియా వేదికలను పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలి. వార్‌రూం ద్వారా రోజూ సాయంత్రం పనుల పురోగతిని తనిఖీ చేయాలి" అని సూచించారు. బతుకమ్మ పండగ ప్రాశస్త్యం, తెలంగాణ సంప్రదాయాలు, ఇక్కడి ప్రత్యేక వంటకాలు తెలియజేసేలా ఏర్పాట్లు ఉండాలని మంత్రి శ్రీధర్‌బాబు సూచించారు. తెలంగాణ సాంస్కృతిక వైభవాన్ని ప్రదర్శించడానికి ఇదొక అద్భుత అవకాశమని పేర్కొన్నారు.

## పక్క రాష్ట్ర సీఎం చంద్రబాబు
# నీటిని తీసుకువెళ్తుంటే...
## రేవంత్‌రెడ్డి సొంత జిల్లాను ఎండబెడుతున్నారు

హైదరాబాద్: కాంగ్రెస్ ప్రభుత్వం 30 శాతం కమీషన్లు తీసుకొంటూ, కమీషన్ మేనేజ్‌మెంట్‌లో ఆరితేరిందని... వాటర్ మేనేజ్‌మెంట్‌లో విఫలమైందని భారాస శాసనసభాపక్ష ఉపనేత హరీశ్‌రావు ఆరోపించారు. ఎల్‌నినో వల్ల కాదు... కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యంతోనే రాష్ట్రంలో కరవు పరిస్థితులు ఏర్పడ్డాయని పేర్కొన్నారు. నాగర్‌కర్నూల్ జిల్లాకు వచ్చిన హరీశ్‌రావు భారాస జిల్లా కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. "ఆంధ్రాలో క్రాప్‌హాలిడే లేదు. తెలంగాణలో మాత్రమే ఉంది. శ్రీశైలంలో 96 టీఎంసీల నీరు ఉంది. కల్వకుర్తి లిఫ్ట్ ఇరిగేషన్‌లో రోజుకు 4 వేల క్యూసెక్కుల నీటిని తీసుకునే అవకాశం ఉన్నా.. 3 మోటార్లతో రోజుకు 8 గంటలే నడుపుతున్నారు. దీంతో 800 క్యూసెక్కుల నీరు మాత్రమే వినియోగించుకునే పరిస్థితి ఏర్పడింది. పక్క రాష్ట్ర సీఎం చంద్రబాబు 800 కి.మీ. దూరాన ఉన్న కుప్పానికి నీటిని తీసుకువెళ్తుంటే... రేవంత్‌రెడ్డి సొంత జిల్లాను ఎండబెడుతున్నారు. 365 రోజులూ దేవాదుల మోటార్లు నడిపేలా భారాస ప్రభుత్వం సమ్మక్క బ్యారేజీని కట్టింది. అక్కడా రోజుకు 8 గంటలే నీటిని ఎత్తిపోస్తున్నారు.

నల్గొండను ముంచింది ఉత్తమ్‌కుమారే..

నల్గొండను ముంచి ఆంధ్రాకు మూడో పంట కోసం పులిచింతల కట్టింది ఉత్తమ్‌కుమార్‌రెడ్డే. కృష్ణా నీటిలో 34 శాతం వాటా వినియోగించుకునే అవకాశం ఉన్నా పూర్తిస్థాయిలో వాడుకోవడం లేదు. నాగార్జునసాగర్ ఎడమ కాలువకు క్రాప్ హాలిడే ఎందుకు ఇచ్చారు? నల్గొండ, ఖమ్మం, పాలమూరు జిల్లాలకు అన్యాయం చేస్తున్నారు. ఏడాదికి 7 లక్షల ఎకరాల కొత్త ఆయకట్టుకు నీరిస్తామని అసెంబ్లీలో చెప్పి...ఇప్పటికి 2 లక్షల ఎకరాలకైనా ఇచ్చారా? పాలమూరు ఎత్తిపోతల పథకంలో భారాస ప్రభుత్వం రూ.30 వేల కోట్లు ఖర్చుచేసి నార్లాపూర్, ఏదుల, కర్వెన, వట్టెం రిజర్వాయర్లను కట్టింది. ప్యాకేజీ-3లో సున్నపుతండా నుంచి తెల్లరాళ్లపల్లి వరకు ఉండే కాలువలో మిగిలిన 33 లక్షల క్యూబిక్ మీటర్ల పనిని కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిచేయలేదు. దీంతో రిజర్వాయర్లలో నీటిని నింపే పరిస్థితి లేకపోయింది" అని హరీశ్‌రావు వివరించారు. మాజీ మంత్రులు నిరంజన్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, లక్ష్మారెడ్డి, మాజీ ఎమ్మెల్యే జనార్దన్‌రెడ్డి, ప్రవీణ్‌కుమార్, ఎర్రోళ్ల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# విద్యుత్ ఉత్పత్తి చేసే విధంగా అవసరమైన చర్యలు తీసుకోవాలి

హైదరాబాద్: దసరా లోపు యాదాద్రి థర్మల్ విద్యుత్ కేంద్రం పూర్తిస్థాయిలో విద్యుత్ ఉత్పత్తి చేసే విధంగా అవసరమైన చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశించారు. యాదాద్రి థర్మల్ విద్యుత్ కేంద్రంలో ఉత్పత్తికి అవసరమైన జీ-9 గ్రేడ్ బొగ్గు విషయంలో తక్షణమే కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి తో చర్చించాలని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క కి సూచించారు. విద్యుత్ శాఖపై ముఖ్యమంత్రి ఉప ముఖ్యమంత్రి తో కలిసి ఎంసీఆర్ హెచ్ఆర్‌డీ బోధి పెవిలియన్‌లో ఉన్నతస్థాయి సమావేశంలో సమీక్షించారు. యాదాద్రి థర్మల్ కేంద్రంలో పూర్తి స్థాయి విద్యుత్ ఉత్పత్తి చేయకపోవడంపై ఈ సందర్భంగా అధికారులను ప్రశ్నించారు. యాదాద్రి థర్మల్ విద్యుత్ కేంద్రంలో ఉత్పత్తికి జీ-9 గ్రేడ్ బొగ్గు అవసరమని అధికారులు వివరించారు. సింగరేణిలో జీ 9 గ్రేడ్ బొగ్గు ఉత్పత్తి చేసే బ్లాకులు లేవని, సమీప భవిష్యత్తులోనూ సింగరేణి నుంచి జీ 9 బొగ్గు ఉత్పత్తి అయ్యే అవకాశం లేదని అధికారులు తెలిపారు. జీ- 9 గ్రేడ్ బొగ్గు లభ్యత లేనప్పుడు ఆ సాంకేతికతపై ఆధారపడిన యాదాద్రి థర్మల్ విద్యుత్ కేంద్రం ఎలా నిర్మించారని ముఖ్యమంత్రి , డిప్యూటీ సీఎం గారు అధికారులను ప్రశ్నించారు. పిట్ హెడ్ (బొగ్గు గనుల పైనే విద్యుత్ కేంద్ర నిర్మాణం) కాకుండా, యాదాద్రి థర్మల్ కేంద్రాన్ని ఎందుకు దూరంగా నిర్మించారని అడిగారు. ఈ కేంద్రానికి బొగ్గు సరఫరా చేయడం వల్ల రాష్ట్రంపై పడే అదనపు భారం ఎంత అని అధికారులను ప్రశ్నించారు. అప్పట్లో రాజకీయ కారణాలతోనే పిట్ హెడ్‌పై కాకుండా యాదాద్రి థర్మల్ విద్యుత్ కేంద్రం దూరంగా నిర్మించారని అధికారులు తెలిపారు. యాదాద్రికి బొగ్గు సరఫరాతో తెలంగాణ రాష్ట్రంపై రూ. 40 వేల కోట్ల అదనపు భారం పడుతోందని చెప్పారు. సింగరేణి నుంచి జీ-9 గ్రేడ్ బొగ్గుకు ఉన్న అవకాశాలపై ముఖ్యమంత్రి గారు ఆరా తీశారు. గత ప్రభుత్వం బొగ్గు బ్లాకుల వేలంలో పాల్గొనకపోవడంతో జీ-9 గ్రేడ్ బొగ్గును సింగరేణి నుంచి సరఫరా చేయలేదని అధికారులు వివరణ ఇచ్చారు. సింగరేణిలో ఇప్పటికే 14 బొగ్గు బ్లాకులు మూతపడ్డాయని సమావేశంలో అధికారులు తెలిపారు. రాష్ట్రంలో ప్రస్తుతం నెలకొన్న విద్యుత్ అవసరాల దృష్ట్యా మహానది కోల్ ఫీల్డ్స్, కోల్ ఇండియా నుంచి బొగ్గు కొనుగోలుకు చర్యలు ప్రారంభించాలని ముఖ్యమంత్రి గారు, ఉప ముఖ్యమంత్రి గారు అధికారులను ఆదేశించారు. ఎత్తిపోతల పథకాల పంపులకు విద్యుత్ సరఫరాకు ఎలాంటి ఆటంకం లేకుండా చూడాలని సమావేశంలో ముఖ్యమంత్రి అధికారులకు చెప్పారు. అన్ని థర్మల్ విద్యుత్ ఉత్పత్తి కేంద్రాలు పూర్తి సామర్థ్యంతో ఉత్పత్తి చేసేలా చూడాలని అధికారులను ఆదేశించారు. రాష్ట్రంలో ప్రస్తుత అవసరాలకు తగినట్లు విద్యుత్ కొనుగోలు చేయాలని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో ఎంపీ వేం నరేందర్ రెడ్డి గారు, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, సీఎం సలహాదారు కె. రామకృష్ణారావు గారితో పాటు ఇంధన శాఖ అన్ని విభాగాల ఉన్నతాధికారులు, సింగరేణి కాలరీస్ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## స్థానిక సంస్థల ఎన్నికలు.. అభ్యర్థుల ఎంపికపై జగన్ కీలక సూచనలు

అమరావతి: ఆంధ్రప్రదేశ్‌లో రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలకు వైసీపీ శ్రేణులు పూర్తిస్థాయిలో సమాయత్తం కావాలని ఆ పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి జగన్ పిలుపునిచ్చారు. తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో వైసీపీ రీజనల్ కో-ఆర్డినేటర్లతో నిర్వహించిన ఉన్నత స్థాయి సమీక్షా సమావేశంలో ఆయన రాబోయే ఎన్నికల కార్యాచరణపై విస్తృతంగా చర్చించి నేతలకు దిశానిర్దేశం చేశారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేయడానికి వీలైనంత త్వరగా ప్రజాదరణ కలిగిన మంచి అభ్యర్థులను గుర్తించాలని స్పష్టం చేశారు. అభ్యర్థుల ఎంపిక ప్రక్రియ ఏకపక్షంగా కాకుండా పార్టీలోని ప్రతి ఒక్కరి అభిప్రాయాలను సేకరించి, పలు దఫాలుగా విస్తృత చర్చలు జరిపిన తర్వాతే తుది జాబితాను ఖరారు చేయాలని ఆదేశించారు. ఇప్పుడు ఎంపిక చేసే అభ్యర్థులు రాబోయే సాధారణ ఎన్నికలకు బలమైన పునాదిగా నిలుస్తారని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు రెండున్నరేళ్ల పాలనలో ప్రభుత్వం అన్ని రంగాల్లోనూ విఫలమైందని జగన్ ఆరోపించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న విధానాల వల్ల ప్రజలకు జరుగుతున్న కష్టాలు, మోసాలను ప్రతి గడప వద్దకూ వెళ్లి వివరించాలని కేడర్‌కు సూచించారు. వైసీపీ హయాంలో అందించిన సంక్షేమాన్ని ప్రజలకు గుర్తు చేస్తూనే, ప్రస్తుత ప్రభుత్వ వైఫల్యాలను బలంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని కోరారు. స్థానిక ఎన్నికల్లో గెలిచేందుకు ప్రభుత్వం అధికార బలంతో పాటు పోలీసు వ్యవస్థను ఉపయోగిస్తూ అనేక అడ్డదారులు తొక్కుతుందని జగన్ తీవ్ర ఆరోపణలు చేశారు. ఎలాంటి కుట్రలు ఎదురైనా తట్టుకునేలా పార్టీ శ్రేణులు ముందస్తుగా సిద్ధంగా ఉండాలని, రీజినల్ కో-ఆర్డినేటర్లు ప్రత్యామ్నాయ ప్రణాళికలు కూడా సిద్ధం చేసుకోవాలని పిలుపునిచ్చారు.

# ఫార్మా నుంచి ఫిన్‌టెక్ వరకు.. ఢిల్లీలో నారా లోకేశ్ పెట్టుబడుల వేట



అమరావతి: ఆంధ్రప్రదేశ్‌ను పారిశ్రామికంగా, ఆర్థికంగా బలోపేతం చేసే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం దూకుడు పెంచింది. రాష్ట్రానికి భారీ పెట్టుబడులను ఆకర్షించేందుకు రాష్ట్ర ఐటీ, ఎలక్ట్రానిక్స్, విద్యాశాఖల మంత్రి నారా లోకేశ్ ఢిల్లీలో పర్యటిస్తున్నారు. ఈ పర్యటనలో భాగంగా ఆయన వ్యవసాయం, ఆగ్రో కెమికల్స్, ఐటీ, ఫార్మా, ఎలక్ట్రానిక్స్, మౌలిక సదుపాయాల రంగాలకు చెందిన పలు దిగ్గజ సంస్థల ప్రతినిధులతో వరుస సమావేశాలు నిర్వహిస్తున్నారు. రాష్ట్రంలో పెట్టుబడులకు ఉన్న అవకాశాలను వివరిస్తూ, ఏపీలో తమ కార్యకలాపాలను విస్తరించాల్సిందిగా వారిని ఆహ్వానిస్తున్నారు. కాకినాడలో గ్రీన్ అమ్మోనియా కేంద్రం: యారాకు లోకేశ్ ఆహ్వానం

పర్యటనలో భాగంగా, నార్వేకు చెందిన ప్రముఖ ఎరువులు, అమ్మోనియా తయారీ సంస్థ యారా ఇంటర్నేషనల్ పబ్లిక్ ఎఫైర్స్ హెడ్ వైశాలి చోప్రాతో మంత్రి లోకేశ్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కాకినాడలో గ్రీన్-అమ్మోనియా తయారీ, ఎగుమతి కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని లోకేశ్ ఆహ్వానించారు. ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ మార్కెట్ అవసరాలను తీర్చడానికి ప్రత్యేక ఎరువుల మిశ్రమం, సూక్ష్మపోషకాల ప్లాంట్‌ను ఏర్పాటు చేసే అవకాశాలను పరిశీలించాలని సూచించారు. అంతేకాకుండా, ఆచార్య ఎన్.జి. రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం సహకారంతో పంట-పోషణ సాంకేతికత, డిజిటల్ వ్యవసాయ కేంద్రాన్ని నెలకొల్పాలని కోరారు. దీనిపై వైశాలి చోప్రా స్పందిస్తూ, యారా ఇండియా ఇప్పటికే 17 రాష్ట్రాల్లో 1500 అవుట్‌లెట్ల ద్వారా 5.5 మిలియన్ల రైతులకు డిజిటల్‌గా సేవలు అందిస్తోందని తెలిపారు. యూపీలోని బాబ్రాలా కాంప్లెక్స్ ద్వారా ఏటా 1.6 మిలియన్ టన్నుల యూరియా, 0.66 మిలియన్ టన్నుల అమ్మోనియా ఉత్పత్తి చేస్తున్నామని వివరించారు. ఏపీ ప్రభుత్వ ప్రతిపాదనలపై తమ సంస్థ ఉన్నతస్థాయి బృందంతో చర్చిస్తామని హామీ ఇచ్చారు.

గోద్రెజ్ ఆగ్రో కెమికల్ యూనిట్‌కు ఏపీ అనువైనది

ప్రముఖ పారిశ్రామిక సంస్థ గోద్రెజ్ గ్రూప్ ప్రెసిడెంట్ రాకేశ్ స్వామితోనూ మంత్రి లోకేశ్ భేటీ అయ్యారు. గోద్రెజ్ అనుబంధ సంస్థ అజ్‌టెక్ లైఫ్‌సైన్సెస్ ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్‌లో ఒక ఆగ్రో కెమికల్ యూనిట్‌ను ఏర్పాటు చేయాలని ఈ సందర్భంగా లోకేశ్ కోరారు. రెడీ టు ఈట్ పాల ఉత్పత్తుల ప్రాసెసింగ్ ప్లాంట్లు, ఆయిల్ పామ్ ప్రాసెసింగ్, సమాధాన్ కేంద్రాలను విస్తరించాలని సూచించారు.

దీనికి రాకేశ్ స్వామి స్పందిస్తూ, గోద్రెజ్ ఆగ్రోవెట్ ఇప్పటికే భారతదేశంలో అతిపెద్ద ఆయిల్ పామ్ ప్రాసెసర్‌గా ఉందని గుర్తుచేశారు. గత ఏడాది నవంబర్‌లో ఏపీలో ఆయిల్ పామ్ ప్రాసెసింగ్, సమాధాన్ కేంద్రాల ఏర్పాటు కోసం రూ.70 కోట్లతో అవగాహన ఒప్పందం చేసుకున్నామని తెలిపారు. ద్వారకా తిరుమల మండలంలో రూ.210 కోట్ల పెట్టుబడితో మిఠాయి, కోకో బటర్ తయారీ యూనిట్‌ను కూడా ఏర్పాటు చేస్తున్నామని వివరించారు. ఏపీ ప్రభుత్వ తాజా ప్రతిపాదనలను కూడా పరిశీలిస్తామని స్వామి హామీ ఇచ్చారు.

ఏపీలో డిజిటల్ గవర్నెన్స్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్: శాప్ (ఎస్ఏపీ)తో భేటీ

జర్మనీకి చెందిన ప్రముఖ ఎంటర్‌ప్రైజ్ సాఫ్ట్‌వేర్ సంస్థ శాప్ (ఎస్ఏపీ) సీనియర్ వైస్ ప్రెసిడెంట్ లవ్‌నీష్ చనానాతో మంత్రి లోకేశ్ సమావేశమయ్యారు. ఆంధ్రప్రదేశ్‌లో స్మార్ట్ గవర్నెన్స్, చిన్న, మధ్య తరహా పరిశ్రమల (ఎంఎస్ఎంఈ) డిజిటలైజేషన్, నైపుణ్యాభివృద్ధి లక్ష్యంగా ఒక 'డిజిటల్ గవర్నెన్స్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్'ను ఏర్పాటు చేయాలని కోరారు. విద్యార్థులకు ఎస్ఏపీ నైపుణ్యాలు, సర్టిఫికేషన్ అందించేందుకు ఆంధ్రప్రదేశ్ టెక్నాలజీ సర్వీసెస్‌తో కలిసి పనిచేయాలని సూచించారు. దీనిపై చనానా స్పందిస్తూ, భారత్‌లో శాప్ ల్యాబ్స్ తమకు రెండవ అతిపెద్ద ఆర్‌డీ హబ్ అని, బెంగళూరులో 15 వేల సీట్లతో కొత్త క్యాంపస్ ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ప్రభుత్వ రంగ సంస్థలు, బ్యాంకులకు సాంకేతిక సేవలు అందిస్తున్నామని, ఏపీ ప్రభుత్వ ప్రతిపాదనలను పరిశీలిస్తామని చెప్పారు.

స్టార్టప్‌ల ప్రోత్సాహానికి భాగస్వాములు కండి: మాస్టర్‌కార్డ్‌కు లోకేశ్ విజ్ఞప్తి

గ్లోబల్ పేమెంట్స్ టెక్నాలజీ దిగ్గజం మాస్టర్‌కార్డ్ వైస్ ప్రెసిడెంట్ అభిషేక్ లాహిరితో మంత్రి లోకేశ్ భేటీ అయ్యారు. విశాఖపట్నంలో గ్లోబల్ కేపబిలిటీ సెంటర్ (జీసీసీ) లేదా టెక్నాలజీ సెంటర్ ఏర్పాటు చేయాలని కోరారు. స్టార్టప్‌లను ప్రోత్సహించేందుకు రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ (ఆర్‌టీఐహెచ్)లో ఫిన్‌టెక్ సలహాదారుగా చేరాలని ఆహ్వానించారు. ఇప్పటికే రాజమండ్రి, కోనసీమలో మాస్టర్‌కార్డ్ అమలు చేస్తున్న 'ప్రైస్‌లెస్ ఎక్స్‌పీరియన్స్' కార్యక్రమాన్ని ఇతర పర్యాటక ప్రాంతాలకు విస్తరించాలని సూచించారు. దీనికి అభిషేక్ లాహిరి స్పందిస్తూ, భారత్‌లో పూణేలో తమకు అతిపెద్ద టెక్ హబ్ ఉందని, ఏపీ టూరిజం అథారిటీతో ఇప్పటికే ఎంఓయూ ఉందని గుర్తుచేశారు. తాజా ప్రతిపాదనలను ఉన్నతస్థాయి బృందంతో చర్చిస్తామని తెలిపారు.

వైద్య పరికరాల తయారీ యూనిట్ ఏర్పాటు చేయండి: అబాట్‌కు ఆహ్వానం

అమెరికాకు చెందిన ప్రముఖ మెడికల్ డివైసెస్, ఫార్మా సంస్థ అబాట్ ఇండియా ఎండీ ఇస్తేయాక్ అంజాద్‌తో మంత్రి లోకేశ్ సమావేశమయ్యారు. ఏపీలోని మెడ్‌టెక్ జోన్ (ఏఎంటీజెడ్) లేదా ఎలక్ట్రానిక్స్ మ్యానుఫ్యాక్చరింగ్ క్లస్టర్ (ఈఎంసీ)లో వైద్య పరికరాలు లేదా డయాగ్నోస్టిక్స్ తయారీ యూనిట్‌ను ఏర్పాటు చేయాలని లోకేశ్ ఆహ్వానించారు. నక్కపల్లిలో రాబోయే బల్క్ డ్రగ్ పార్క్‌లో జెనరిక్ మందుల తయారీ కేంద్రాన్ని, విశాఖలో గ్లోబల్ కేపబిలిటీ సెంటర్ ఏర్పాటు అవకాశాలను పరిశీలించాలని కోరారు. దీనిపై అంజాద్ స్పందిస్తూ, భారత్‌లో తమకు గోవా, గుజరాత్‌లలో తయారీ కేంద్రాలున్నాయని, స్థానిక ఫార్మా సంస్థల్లో పెట్టుబడులకు ఆసక్తిగా ఉన్నామని చెప్పారు. ఏపీ ప్రభుత్వ ప్రతిపాదనలను పరిశీలిస్తామని హామీ ఇచ్చారు.

ఏపీలో ఇంజనీరింగ్ సెంటర్/జీసీసీ ఏర్పాటు చేయండి: సిస్కోతో లోకేశ్ భేటీ

గ్లోబల్ నెట్‌వర్కింగ్ దిగ్గజం సిస్కో సిస్టమ్స్ మేనేజింగ్ డైరెక్టర్ హరీష్ కృష్ణన్‌తో మంత్రి లోకేశ్ సమావేశమయ్యారు. ఏపీలో వేగంగా అభివృద్ధి చెందుతున్న డేటా సెంటర్ల డిమాండ్‌కు అనుగుణంగా సర్వర్లు, స్విచ్‌లు, రౌటర్ల తయారీ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. విశాఖపట్నంలో ఒక ఇంజనీరింగ్ సెంటర్ లేదా జీసీసీని ఏర్పాటు చేయాలని కోరారు. హరీశ్ కృష్ణన్ స్పందిస్తూ, ఏపీ ప్రభుత్వంతో తమకు ఇప్పటికే బలమైన అనుబంధం ఉందని గుర్తుచేశారు. 50 వేల మంది యువతకు నైపుణ్య శిక్షణ, విశాఖలో ఇన్నోవేషన్ సెంటర్, తిరుపతిలో సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ (సీఓఈ), ఏపీ ఫైబర్‌నెట్ ప్రాజెక్టుల్లో భాగస్వామ్యం వహించామని తెలిపారు. చెన్నైలోని తయారీ ప్లాంట్ ద్వారా 1 బిలియన్ డాలర్ల ఎగుమతులను లక్ష్యంగా పెట్టుకున్నామని, ఏపీ ప్రభుత్వ తాజా ప్రతిపాదనలను కూడా పరిశీలిస్తామని చెప్పారు.

వివో కాంపోనెంట్స్ తయారీ పార్క్ ఏర్పాటు చేయండి

చైనాకు చెందిన ప్రముఖ స్మార్ట్‌ఫోన్ల తయారీ సంస్థ వివో ఇండియా ప్రెసిడెంట్ అర్జిత్ సేన్‌తోనూ లోకేశ్ సమావేశమయ్యారు. ఎలక్ట్రానిక్స్ హబ్‌గా ఎదుగుతున్న తిరుపతిలో వివో మొబైల్స్ కాంపోనెంట్స్ తయారీ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని కోరారు. వివో సరఫరాదారుల కోసం ప్రత్యేకంగా ఒక 'కాంపోనెంట్స్ తయారీ పార్క్' అభివృద్ధి చేయాలని, దీనికోసం ప్రభుత్వంతో కలిసి 'సప్లై చైన్ సమావేశం' నిర్వహించాలని సూచించారు. అర్జిత్ సేన్ స్పందిస్తూ, దేశంలో విక్రయించే ఫోన్లలో 99% పైగా గ్రేటర్ నోయిడాలోనే తయారు చేస్తున్నామని తెలిపారు. ఏపీ ప్రభుత్వ ప్రతిపాదనలపై తమ ఉన్నతస్థాయి బృందంతో చర్చిస్తామని హామీ ఇచ్చారు. మొత్తం మీద, మంత్రి నారా లోకేశ్ ఢిల్లీ పర్యటన ఆంధ్రప్రదేశ్‌లో పెట్టుబడులను ఆకర్షించడం, పారిశ్రామిక ప్రగతికి బాటలు వేయడమే లక్ష్యంగా సాగింది. పలు దిగ్గజ సంస్థల నుంచి సానుకూల స్పందన రావడంతో, భవిష్యత్తులో ఈ ప్రతిపాదనలు కార్యరూపం దాల్చుతాయని ప్రభుత్వం ఆశాభావం వ్యక్తం చేస్తోంది.

## చింతలపూడి-రెచర్ల యు సీ జి ప్రాజెక్టులపై పర్యావరణ వేత్త ఆందోళన

**పవన్ కళ్యాణ్ కు విజ్ఞప్తి చేసిన బొలిశెట్టి సత్యనారాయణ**



CHINTALAPUDI COAL BLOCK OVER ERRAKALUVA RIVULET

ఏలూరు శ్రీ వార్త న్యూస్ చింతలపూడి-రెచర్ల ప్రాంతాల్లో ప్రతిపాదించిన అండర్ గ్రౌండ్ కోల్ గ్యాసిఫికేషన్ యు సీ జి ప్రాజెక్టుల నుంచి పశ్చిమ గోదావరి ప్రాంత ప్రజలు, ఎర్ర కాలువ, కొల్లేరు పర్యావరణాన్ని కాపాడాలని పర్యావరణ వేత్త బొలిశెట్టి సత్యనారాయణ రాష్ట్ర పర్యావరణ, అటవీ శాఖ మంత్రి పవన్ కళ్యాణ్ కు, కేంద్ర మంత్రి భూపేందర్ యాదవ్ కు సోషల్ మీడియా వేదికగా విజ్ఞప్తి చేశారు. ఏలూరు జిల్లాలోని చింతలపూడి, రెచర్ల బొగ్గు బ్లాకుల కోసం సుమారు 8,700 ఎకరాల సారవంతమైన వ్యవసాయ భూముల్లో యు సీ జి ప్రాజెక్టులు చేపట్టనుండటంపై స్థానికుల్లో తీవ్ర ఆందోళన నెలకొందని ఆయన తెలిపారు. ఐ ఎస్ ఆర్ ఓ ఉపగ్రహ చిత్రాలు, కేంద్ర భూగర్భ జల బోర్డు నివేదికలు, యు సీ జి టెండర్ పత్రాలను పరిశీలించానని పేర్కొన్నారు. ప్రధాన ఆందోళనలు:లి ప్రతిపాదిత బొగ్గు బ్లాకులు ఎర్ర కాలువ, దాని వాగులు, సహజ నీటి ప్రవాహ వ్యవస్థకు అతి సమీపంలో ఉన్నాయని, దీనివల్ల ఉపరితల, భూగర్భ జలాలు, సహజ డ్రైనేజీ వ్యవస్థపై తీవ్ర ప్రభావం పడుతుందని ఆయన హెచ్చరించారు. భీముడేలుగుట్ట, ఎర్రగుంటపల్లి అడవులు, పామాయిల్-కోకో తోటలు, వ్యవసాయ భూములు ప్రమాదంలో పడతాయన్నారు. ఎర్ర కాలువ వ్యవస్థకు కొల్లేరు రామ్సర్ తడినేలతో ఉన్న జలసంబంధం దృష్ట్యా కొల్లేరుపై సంచిత ప్రభావం పడుతుందన్నారు. ప్రభుత్వానికి 5 డిమాండ్లు: 1. చింతలపూడి-రెచర్ల యు సీ జి ప్రాజెక్టులను వెంటనే సమీక్షించాలి. 2. జలాలు, అడవులు, భూములు, జీవవైవిధ్యంపై స్వతంత్ర శాస్త్రీయ ప్రభావ అంచనా చేయాలి. 3. కొల్లేరుపై పడే ప్రభావాలను అధ్యయనం చేయాలి. 4. ప్రభావిత గ్రామాలతో పారదర్శకంగా ప్రజా సంప్రదింపులు జరపాలి. 5. భవిష్యత్తులో పర్యావరణ నష్టం జరిగితే భోపాల్ తరహాలో కాంట్రాక్టర్ తప్పించుకోకుండా నష్టపరిహార బాధ్యతను ముందే నిర్ధారించాలి, లేదా ప్రభుత్వమే బాధ్యత వహించాలి. "నేను అభివృద్ధికి వ్యతిరేకం కాదు, కానీ ప్రజల జీవనోపాధి, నీటి వనరులు, అడవులు, కొల్లేరును ప్రమాదంలోకి నెట్టే అభివృద్ధిపై సమగ్ర పరిశీలన అవసరం. ఎర్ర కాలువను కాపాడటం అంటే భావితరాల నీటి భద్రతను కాపాడటమే" అని సత్యనారాయణ పేర్కొన్నారు.



CHINTALAPUDI & RECHERLA COAL BLOCKS OVER ERRAKALUVA RIVULET

## ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో అన్ని రకాల వైద్య పరీక్షలు అందుబాటులో ఉంచాలి.



మచిలీపట్నం శ్రీవార్త న్యూస్ ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో అన్ని రకాల రక్త పరీక్షలు అందుబాటులో ఉండేలా చూడాలని ఎస్సీ,ఎస్టీ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు దేవరపల్లి సురేష్



బాబు కోరారు. గురువారం జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ పి ఎల్ దయాకర్ ను సురేష్ బాబు మర్యాదపూర్వకంగా కలిసి పలు అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా సురేష్ బాబు మాట్లాడుతూ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో కొన్నిచోట్ల పూర్తిస్థాయిలో రక్త పరీక్షలు అందుబాటులో లేకపోవడం వల్ల రోగులు ప్రైవేట్ ల్యాబ్ లలో వేలాది రూపాయలు ఖర్చుపెట్టి వైద్య పరీక్షలు చేయించుకోవాల్సి వస్తుందన్నారు. పి హెచ్ సి లలో అన్ని రకాల మందులు కూడా రోగులకు అందుబాటులో ఉండేలా చూడాలని డిఎం అండ్ హెచ్ఓ ను సురేష్ బాబు కోరారు. కృష్ణా జిల్లా డిఎం అండ్ ఎం హెచ్ ఓ గా బాధ్యతలు చేపట్టినప్పటి నుండీ ఎప్పటికప్పుడు క్షేత్రస్థాయిలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను సందర్శిస్తూ వైద్యులను, ఇతర సిబ్బందిని అప్రమత్తం చేస్తూ రోగులకు మెరుగైన వైద్య చికిత్సలు అందేలా కృషి చేస్తున్న జిల్లా వైద్యాధికారి డాక్టర్ దయాకర్ ను సురేష్ బాబు అభినందించారు.

## రికార్డు ధర పలికిన బందరు సాగరతీర గణపతి లడ్డూ

**రూ.25 లక్షలకు కైవసం చేసుకున్న ఎఫ్ సి ఎస్ అధినేత భవానీ శంకర్**



మచిలీపట్నం శ్రీవార్త న్యూస్ బందరు సాగర తీరంలో కొలువైన మహా గణపతి 630 కేజీల భారీ లడ్డూ ప్రసాదం వేలంలో రికార్డు ధర పలికింది. రూ.25 లక్షలకు ఈ లడ్డూను ఎఫ్ సిఎస్ ట్రేడింగ్ ప్రైవేట్ లిమిటెడ్ అధినేత భవానీ శంకర్ కైవసం చేసుకున్నారు. సాగర తీర మహా గణపతి ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ లడ్డూ వేలం పాట జూమ్ మీటింగ్ ద్వారా నిర్వహించడం విశేషం. దేశ విదేశాల్లో ఉన్న భక్తులు, దాతలు ఈ ఆన్ లైన్ వేలంలో ఉత్సాహంగా పాల్గొన్నారు. చివరకు తీవ్ర పోటీ



నడుమ రూ.25 లక్షలకు భవానీ శంకర్ సొంతం చేసుకున్నారు. లిభక్తి - సేవా సంప్రదాయం: రాష్ట్ర మంత్రి కొల్లు రవీంద్ర ఆధ్వర్యంలో సాగర తీరాన విజయ గణపతి ఉత్సవాలు ఘనంగా జరిగాయి.. ఈ ఏడాది 630 కేజీలతో భారీగా లడ్డూను తయారు చేయించారు. ఉత్సవ కమిటీ అభినందన: లడ్డూను కైవసం చేసుకున్న భవానీ శంకర్ ను సాగర తీర మహా గణపతి ఉత్సవ కమిటీ సభ్యులు ఘనంగా అభినందించారు. భక్తుడి ఔదార్యాన్ని, భక్తిశ్రద్ధలను కొనియాడారు. వేలం ద్వారా వచ్చిన నిధులను ఆలయ అభివృద్ధి, సేవా కార్యక్రమాలకు వినియోగిస్తామని కమిటీ ప్రతినిధులు తెలిపారు. బందరులో ఇప్పటివరకు జరిగిన గణపతి లడ్డూ వేలాల్లో ఇదే అత్యధిక ధరగా రికార్డు సృష్టించిందని స్థానికులు చెబుతున్నారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు చలమలశెట్టి నరసింహారావు, కోమరగిరి చంద్రశేఖర్, వేమూరి బాలు, ప్రసాద్, గౌరు వెంకటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

## భారీ వర్షాలు, బలమైన గాలులతో దెబ్బతిన్న చింతలపాడు గ్రామంలో జిల్లా కలెక్టర్ విస్తృత పర్యటన

దెబ్బతిన్న ప్రతి ఇంటినీ వెంటనే ఎన్యుమరేషన్ చేసి నష్టపరిహారం కోసం ప్రభుత్వానికి నివేదిక సమర్పించాలిలి

పూర్తిగా, పాక్షికంగా దెబ్బతిన్న గృహాల వివరాలను సమగ్రంగా సేకరించాలి

-- జిల్లా కలెక్టర్ డా.జి.లక్ష్మీశ,
శాసనసభ్యులు కొలికపూడి శ్రీనివాసరావు.




తిరువూరు శ్రీ వార్త న్యూస్ తిరువూరు మండలం చింతలపాడు గ్రామంలో ఇటీవల కురిసిన అధిక వర్షాలు, వీచిన బలమైన గాలుల కారణంగా దెబ్బతిన్న గృహాలను జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ, శాసనసభ్యులు కొలికపూడి శ్రీనివాసరావుతో కలిసి గురువారం క్షేత్రస్థాయిలో విస్తృతంగా పర్యటించి పరిశీలించారు. గ్రామంలోని పరిస్థితులను స్వయంగా పరిశీలించిన కలెక్టర్, భారీ వర్షాలు, గాలుల కారణంగా నష్టపోయిన కుటుంబాలను పరామర్శించి, వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా బాధితులతో



జిల్లా కలెక్టర్ స్వయంగా మాట్లాడి వారికి ధైర్యం చెప్పారు. బాధితులు ఎవరూ అధైర్యపడవద్దని, నష్టపోయిన ప్రతి కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉంటుందని తెలిపారు. చింతలపాడు గ్రామంలో సుమారు 70 గృహాలు పాక్షికంగా, పూర్తిగా దెబ్బతిన్నట్లు ప్రాథమికంగా గుర్తించినట్లు అధికారులు జిల్లా కలెక్టర్‌కు వివరించారు. గ్రామంలో దెబ్బతిన్న ప్రతి ఇంటిని వెంటనే ఎన్యుమరేషన్ చేసి, పూర్తిగా, పాక్షికంగా దెబ్బతిన్న గృహాల వివరాలను సమగ్రంగా నమోదు చేయాలని అధికారులను ఆదేశించారు. నష్టపోయిన గృహాల వివరాలతో సమగ్ర నివేదికను వెంటనే సిద్ధం చేసి ప్రభుత్వానికి సమర్పించాలని, అర్హులైన బాధితులకు నష్టపరిహారం అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. "వర్షాలు, గాలుల కారణంగా నష్టపోయిన ఒక్క బాధిత కుటుంబం కూడా నష్టపరిహారం విషయంలో మిగిలిపోకూడదు. ప్రతి ఇంటి నష్టాన్ని క్షేత్రస్థాయిలో పరిశీలించి, ప్రభుత్వానికి నివేదించాలి" అని జిల్లా కలెక్టర్ స్పష్టం చేశారు. అనంతరం గ్రామంలోని పునరావాస కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ పరిశీలించారు. అక్కడ ఆశ్రయం పొందుతున్న బాధితులతో నేరుగా మాట్లాడి వారికి అందుతున్న సౌకర్యాలు, ఆహారం, తాగునీరు తదితర అంశాలపై ఆరా తీశారు. వర్షాలు పూర్తిగా తగ్గే వరకు బాధితులు పునరావాస కేంద్రాల్లోనే ఉండాలని సూచించారు. పునరావాస కేంద్రాల్లో తాగునీరు, భోజనం, విద్యుత్, పారిశుద్ధ్యం, వైద్య సేవలు తదితర మౌలిక సదుపాయాలు నిరంతరం అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. పునరావాస కేంద్రాల్లో సిబ్బంది నిరంతరం అందుబాటులో ఉండాలని, బాధితులకు సమయానుకూలంగా భోజనం, తాగునీరు అందించాలని స్పష్టం చేశారు. భారీ వర్షాల నేపథ్యంలో గ్రామంలో అంటువ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున ముందస్తు చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ అధికారులను ఆదేశించారు. వర్షాలు తగ్గిన వెంటనే గ్రామంలోని అన్ని ప్రాంతాల్లో ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపట్టడంతోపాటు, బ్లీచింగ్ పౌడర్ చల్లించాలని సూచించారు. అవసరమైన ప్రాంతాల్లో మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేసి ప్రజల ఆరోగ్య పరిస్థితిని నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. ప్రత్యేకంగా డయేరియా, మలేరియా తదితర వ్యాధులు వ్యాప్తి చెందకుండా ముందస్తు వైద్య, పారిశుద్ధ్య చర్యలు చేపట్టాలని వైద్య, పంచాయతీ అధికారులకు సూచించారు. గ్రామంలోని వాటర్ ట్యాంకులను పూర్తిగా శుభ్రపరిచి, క్లోరినేషన్ చేయించాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. ప్రజలకు సురక్షితమైన తాగునీరు అందేలా సంబంధిత అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని తెలిపారు. ప్రజలు కనీసం వారం రోజుల పాటు కాచి చల్లార్చిన నీటినే తాగునీటిగా వినియోగించాలని జిల్లా కలెక్టర్ సూచించారు. నీటి ద్వారా వ్యాధులు వ్యాప్తి చెందకుండా ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని కోరారు. భారీ వర్షాల నేపథ్యంలో వాగులు, చెరువులు, నీటి ప్రవాహ ప్రాంతాల వద్దకు ప్రజలు వెళ్లకుండా అధికారులు నిరంతరం అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ సూచించారు. ప్రజలు అత్యవసర పరిస్థితుల్లో తప్ప బయటకు రావద్దని, ముఖ్యంగా వాగులు, చెరువులు మరియు నీటి ప్రవాహాల వైపు వెళ్లరాదని హెచ్చరించారు. పిల్లలు, వృద్ధులు, ఇతరులు ప్రమాదకర ప్రాంతాలకు వెళ్లకుండా కుటుంబ సభ్యులు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. జిల్లా కలెక్టర్ అనంతరం గ్రామంలోని ఎస్సీ, బీసీ కాలనీలలో పర్యటించి వర్షాలు, గాలుల కారణంగా దెబ్బతిన్న గృహాలను పరిశీలించారు. బాధిత కుటుంబాలతో మాట్లాడి వారి సమస్యలు, అవసరాలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం అన్ని విధాలుగా బాధితులకు అండగా ఉంటుందని, ఎవరూ అధైర్యపడాల్సిన అవసరం లేదని జిల్లా కలెక్టర్ వారికి భరోసా కల్పించారు. నష్టపోయిన ప్రతి కుటుంబానికి అర్హత మేరకు నష్టపరిహారం అందేలా ప్రభుత్వానికి నివేదిక సమర్పిస్తామని తెలిపారు. వర్షాల కారణంగా ఏర్పడిన పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని రెవెన్యూ, పంచాయతీరాజ్, వైద్య, విద్యుత్ తదితర శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. గ్రామంలో పరిస్థితులు పూర్తిగా సాధారణ స్థితికి వచ్చే వరకు అధికారులు క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉండాలని, ప్రజలకు అవసరమైన సేవలను ఎప్పటికప్పుడు అందించాలని సూచించారు. ఈ పర్యటనలో తిరువూరు ఆర్డీవో అరవ కుమార్, తహసిల్దార్ డి.చంద్రమౌళి, ఎంపీడీవో రవిబాబుతో పాటు రెవెన్యూ, పంచాయతీ, వైద్య, విద్యుత్, తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

## బుడమేరుపై ఆందోళన చెందాల్సిన అవసరం లేదు

**ఎలాంటి వదంతులను నమ్మవద్దు**

**క్షేత్రస్థాయిలో అధికారుల నిరంతర పర్యవేక్షణ ఉందిలి**

**ప్రజల భద్రతకు అధికార యంత్రాంగం అప్రమత్తం....జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ**



విజయవాడ శ్రీ వార్త న్యూస్ బుడమేరుకు సంబంధించి ప్రజలు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ తెలిపారు. బుడమేరు పరివాహక ప్రాంతంలో పరిస్థితిని క్షేత్రస్థాయిలో అధికారులు నిరంతరం పర్యవేక్షిస్తున్నారని, నీటి ప్రవాహం, నీటిమట్టం తదితర పరిస్థితులను ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ అవసరమైన చర్యలు చేపడుతున్నామని పేర్కొన్నారు. ప్రజలు సామాజిక మాధ్యమాలు, ఇతర మార్గాల్లోని నిర్ధారణ లేని సమాచారాన్ని నమ్మవద్దని, అధికారికంగా అందించే సమాచారాన్ని మాత్రమే పరిగణనలోకి తీసుకోవాలని సూచించారు. ఇరిగేషన్‌తో పాటు సమన్వయ శాఖల అధికారులు క్షేత్రస్థాయిలో అప్రమత్తంగా ఉండి పరిస్థితిని నిరంతరం సమీక్షిస్తున్నారని, పరిస్థితుల్లో ఏవైనా మార్పులు చోటుచేసుకున్నట్లయితే ప్రజలకు వెంటనే సమాచారం అందించేలా యంత్రాంగం సిద్ధంగా ఉందని, ప్రజలు ఎలాంటి ఆందోళనకు గురికావాల్సిన అవసరం లేదని ఆయన స్పష్టం చేశారు. గత వరదలు తర్వాత గండ్ల పూడ్చివేత, కట్ట బలోపేతం, వెలగలేరు రెగ్యులేటర్ ఆధునీకరణ వంటి పలు చర్యలు తీసుకున్నట్లు వెల్లడించారు. అందువల్ల ఎలాంటి ఇబ్బందీ లేదని స్పష్టం చేస్తూ ప్రజలు ఏదైనా అధికారిక సమాచారం, సహాయసహకారాలకు కలెక్టరేట్‌లోని కమాండ్ కంట్రోల్ కేంద్రం (9154970454)లో సంప్రదించాలని కలెక్టర్ లక్ష్మీశ సూచించారు.

## ఘనంగా 18 అడుగుల గణేష్ మహారాజ్ శోభాయాత్రలి






మచిలీపట్నం శ్రీవార్త న్యూస్ గత 35 సంవత్సరాలుగా చిమ్మనిగిరిపేట సంతోష్ హోటల్ వద్ద నిర్వహిస్తున్న గణపతి నవరాత్రి ఉత్సవాలు అత్యంత భక్తిశ్రద్ధలతో ఘనంగా ముగిశాయి. బుధవారం గణపతి నిమజ్జనం సందర్భంగా పట్టణంలో 18 అడుగుల గణేష్ మహారాజ్ శోభాయాత్రను అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ శోభాయాత్రలో ఉత్సవ సమితి అధ్యక్షులు వన్నెంరెడ్డి లక్ష్మణ్ కుమార్, బీజేపీ రాష్ట్ర నాయకులు పంతం వెంకట గజేంద్రరావు, కమిటీ సభ్యులు కొత్తపల్లి నాగేందర్ రావు, లాయర్ వరద, మద్దాల వెంకటేశ్వరరావు, బుర్రక బాలాజీ, ముద్దినేని జగదీష్, వన్యం రెడ్డి నాగరాజు, కొండేటి అనిల్ తదితరులు పాల్గొన్నారు. భక్తులు, నిర్వాహకులు, పట్టణ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని గణేష్ మహారాజ్ కు భక్తిశ్రద్ధలతో వీడ్కోలు పలికారు.

## గ్రామాభివృద్ధే అజెండాగా.. ఎంపీటీసీగా తాడికొండ చిన్నా ఐదేళ్ల ప్రస్థానం

-మండల పరిషత్ నిధులతో ప్రజా అవసరాలకు ప్రాధాన్యత..



ఘంటసాల, శ్రీవార్త న్యూస్: ఘంటసాల మండలం శ్రీకాకుళం గ్రామానికి చెందిన తాడికొండ వెంకటేశ్వరరావు (చిన్నా) ఎంపీటీసీగా తన ఐదేళ్ల పదవీకాలాన్ని పూర్తి చేసుకున్నారు. 2021లో టీడీపీ ప్రతిపక్షంలో ఉన్న సమయంలో శ్రీకాకుళం ఎంపీటీసీ స్థానానికి పోటీ చేసి 710 ఓట్ల మెజారిటీతో విజయం సాధించిన ఆయన.. సెప్టెంబర్ 24, 2021న పదవీ బాధ్యతలు స్వీకరించారు. ప్రజా ప్రతినిధిగా బాధ్యతలు చేపట్టిన అనంతరం గ్రామంలోని స్థానిక సమస్యలు, ప్రజల అవసరాలను గుర్తించి వాటిని మండల పరిషత్ దృష్టికి తీసుకెళ్లడంతో పాటు, అందుబాటులో ఉన్న నిధులతో అభివృద్ధి పనులు చేపట్టేందుకు కృషి చేశారు. తాగునీటి వసతులకు ప్రాధాన్యతగ్రామంలో ప్రజలకు అత్యవసరమైన తాగునీటి సదుపాయాల కల్పనకు తాడికొండ చిన్నా ప్రాధాన్యత ఇచ్చారు. వేసవి కాలంలో తాగునీటి అవసరాలు పెరగడం, కొన్ని ప్రాంతాల్లో నీటి వసతులు పరిమితంగా ఉండటాన్ని దృష్టిలో ఉంచుకుని పలు ప్రాంతాల్లో బోర్లు, హ్యాండ్‌పంపులు, మోటార్ పంప్‌సెట్ల ఏర్పాటుకు చర్యలు చేపట్టారు. కరకట్ట సమీపంలో తాగునీటి సరఫరా కోసం రూ.1 లక్షతో మోటార్ పంప్‌సెట్, శ్రీకాకుళం ప్రధాన గ్రామంలో రూ.1 లక్షతో రెండు బోర్ హ్యాండ్‌పంపులు ఏర్పాటు చేశారు. సూరపనేనివారిపాలెం, వీరమాచినేనిపాలెం ప్రాంతాల్లో మరో రూ.3 లక్షలతో బోర్ హ్యాండ్‌పంపుల ఏర్పాటుకు చర్యలు చేపట్టారు. అదే విధంగా శ్రీకాకుళం గ్రామపంచాయతీలో రూ.2 లక్షలతో బోరు, మోటార్ పంప్‌సెట్, రెండు సిలిండర్ హ్యాండ్‌పంపుల ఏర్పాటుకు పనులు చేపట్టారు. ఎస్టీ కాలనీలో రూ.50 వేలతో హ్యాండ్‌పంప్ ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకున్నారు. ఆయా ప్రాంతాల్లో ప్రజలకు ఎదురవుతున్న తాగునీటి ఇబ్బందులను గుర్తించి, స్థానిక అవసరాలకు అనుగుణంగా వసతులు కల్పించేందుకు ప్రాధాన్యత ఇచ్చారు. డ్రైనేజీ సమస్యల పరిష్కారానికి చర్యలుగ్రామంలో పారిశుద్ధ్య పరిస్థితులను మెరుగుపరిచేందుకు డ్రైనేజీ నిర్మాణాలపై కూడా దృష్టి పెట్టారు. వర్షాకాలంలో నీరు నిలిచే ప్రాంతాలు, మురుగునీటి పారుదల సమస్యలు ఉన్న ప్రాంతాలను గుర్తించి డ్రైనేజీ సదుపాయాల కల్పనకు చర్యలు చేపట్టారు. జెడ్పీ హైస్కూల్ నుంచి శ్రీకాకుళేశ్వరస్వామి ఆలయం వరకు రూ.2.50 లక్షలతో సీసీ డ్రెయిన్, శీలంవారిపాలెంలో రూ.3.50 లక్షలతో సీసీ డ్రెయిన్ నిర్మాణ పనులు చేపట్టారు. వీటి ద్వారా ఆయా ప్రాంతాల్లో మురుగునీటి పారుదలకు సదుపాయం కల్పించేలా చర్యలు తీసుకున్నారు. అదేవిధంగా ఎస్సీ బాలికల హాస్టల్‌కు డ్రైనేజీ సౌకర్యం కల్పించేందుకు రూ.1 లక్షతో పీవీసీ పైపులైన్ పనులు చేపట్టారు. హాస్టల్ పరిసరాల్లో పారిశుధ్య సమస్యలు తలెత్తకుండా అవసరమైన మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యత ఇచ్చారు. విద్యార్థుల వసతులపై ప్రత్యేక దృష్టివిద్యార్థులకు సంబంధించిన వసతుల మెరుగుదలపై కూడా ఎంపీటీసీగా తాడికొండ చిన్నా దృష్టి సారించారు. శ్రీకాకుళం గ్రామంలోని ఎస్సీ బాలికల హాస్టల్ మరమ్మతులు, భవన మెరుగుదలకు రూ.2.50 లక్షలతో పనులు చేపట్టారు. హాస్టల్‌లోని అవసరాలను గుర్తించి భవన సదుపాయాల మెరుగుదలకు నిధులు సమకూరేలా చర్యలు తీసుకున్నారు. అదేవిధంగా బీసీ కాలనీలో పీడబ్ల్యూఎస్ పథకానికి సంబంధించి రూ.1.30 లక్షలతో ఎంఎస్ స్టీల్ మెట్ల నిర్మాణం చేపట్టారు. ప్రజల రాకపోకలకు, సంబంధిత వసతులను వినియోగించుకునే వారికి అనుకూలంగా ఉండేలా ఈ పనులు చేపట్టేందుకు చర్యలు తీసుకున్నారు. గ్రామీణ వైద్య వసతుల బలోపేతానికి చర్యలుశ్రీకాకుళం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మరమ్మతులకు రూ.25 వేలతో పనులు చేపట్టేందుకు చర్యలు తీసుకున్నారు. గ్రామస్థులకు అందుబాటులో ఉండే ప్రాథమిక వైద్యసదుపాయాల భవన నిర్వహణకు అవసరమైన మరమ్మతు పనులకు కూడా ప్రాధాన్యత ఇచ్చారు. రహదారుల అభివృద్ధిగ్రామంలోని అంతర్గత రహదారుల పరిస్థితిని మెరుగుపరిచేందుకు జీఎస్‌బీ రోడ్ల నిర్మాణానికి నిధులు కేటాయించేలా చర్యలు తీసుకున్నారు. తాడికొండ వీరబాబు ఇంటి నుంచి కొప్పురాటి నాగ శ్రీనివాసరావు ఇంటి వరకు రూ.70 వేలతో జీఎస్‌బీ రోడ్డు, రాచమల్లు శ్రీనివాసరావు ఇంటి నుంచి బోడి సాంబశివరావు ఇంటి వరకు రూ.55 వేలతో మరో జీఎస్‌బీ రోడ్డు నిర్మించారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా నిధుల వినియోగం ఎంపీటీసీగా తన పరిధిలోని గ్రామ సమస్యలను గుర్తించి వాటిని మండల పరిషత్ దృష్టికి తీసుకెళ్లడం, అవసరమైన పనులకు నిధులు మంజూరు చేయించేందుకు కృషి చేయడం వంటి అంశాలకు తాడికొండ చిన్నా ప్రాధాన్యత ఇచ్చారు. ఒక్కో ప్రాంతంలోని అవసరాన్ని బట్టి తాగునీరు, డ్రైనేజీ, రహదారులు, విద్యార్థుల వసతులు, ఆరోగ్య కేంద్రం, కాలనీల మౌలిక సదుపాయాలకు సంబంధించిన పనులను చేపట్టేలా చర్యలు తీసుకున్నారు. మండల పరిషత్ నిధులతో చేపట్టిన అభివృద్ధి పనులతో పాటు, తన వ్యక్తిగత నిధులతోనూ పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ ప్రజలకు అందుబాటులో ఉండే ప్రయత్నం చేశారు. గ్రామంలోని వివిధ వర్గాల ప్రజలతో నిరంతరం సంబంధాలు కొనసాగిస్తూ, స్థానికంగా ఎదురయ్యే సమస్యలను తెలుసుకుని వాటి పరిష్కారానికి తనవంతు సహకారం అందించారు. ఎంపీటీసీగా తాడికొండ చిన్నా ఐదేళ్ల పదవీకాలం సెప్టెంబర్ 24తో పూర్తయింది. ప్రజా ప్రతినిధిగా ఉన్న కాలంలో గ్రామంలోని మౌలిక వసతుల కల్పన, ప్రజల అవసరాలకు సంబంధించిన పనులపై దృష్టి సారించి తన పరిధిలో అభివృద్ధి కార్యక్రమాలకు కృషి చేశారు. ఐదేళ్ల పదవీకాలంలో తనకు సహకరించిన గ్రామ ప్రజలు, అధికారులు, మండల పరిషత్ సిబ్బంది, ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, యువతకు కృతజ్ఞతలు తెలిపారు.

## పదవులు తాత్కాలికం.. ప్రజాసేవే శాశ్వతం వైఎస్సార్‌సీపీ కుటుంబానికి ఎల్లప్పుడూ అండగా ఉంటా-బిడిజన అప్పారావు



కొయ్యూరు సెప్టెంబర్ 24:పదవులు తాత్కాలికమని, ప్రజాసేవ మాత్రమే శాశ్వతమని డౌనూరు సెగ్మెంట్ మాజీ ఎంపీటీసీ బిడిజన అప్పారావు అన్నారు. ఎంపీటీసీల పదవీకాలం ముగుస్తున్న సందర్భంగా ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు.ఈ సందర్భంగా అప్పారావు మాట్లాడుతూ గత ఐదేళ్ల కాలంలో డౌనూరు, మూలపేట, గడబపాలెం, చిట్టెంపాడు పంచాయతీల పరిధిలో ఎంపీటీసీగా తనను ఆదరించి, అడుగడుగునా సహకరించిన ప్రజలందరికీ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. రాజకీయాలకు అతీతంగా, వర్గ విభేదాలకు తావులేకుండా ప్రజల సంక్షేమం కోసం పనిచేయడం తనకు ఎంతో సంతృప్తినిచ్చిందన్నారు.తన రాజకీయ జీవితానికి అవకాశం కల్పించిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులకు ఎల్లప్పుడూ రుణపడి ఉంటానని అప్పారావు తెలిపారు. పదవీకాలం ముగిసినప్పటికీ కొయ్యూరు మండలంలో ఎక్కడైనా, ఎవరికైనా సమస్య ఎదురైతే అండగా నిలుస్తానని స్పష్టం చేశారు."వైఎస్సార్‌సీపీ కుటుంబ సభ్యులకు ఎల్లప్పుడూ ఒక అడుగు ముందే ఉంటాను. మీ కష్టసుఖాల్లో భాగస్వామినై, పార్టీ బలోపేతానికి నిరంతరం కృషి చేస్తాను" అని ఆయన పేర్కొన్నారు.గత ఐదేళ్ల ప్రయాణంలో తనకు సహకరించిన వివిధ రాజకీయ పార్టీల నాయకులు, ప్రజాప్రతినిధులు, ప్రభుత్వ అధికారులకు ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. పార్టీలు, వర్గాలు వేరైనా గ్రామాల అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారం విషయంలో అందరూ కలిసి పనిచేశామని చెప్పారు. ఈ స్నేహపూర్వక వాతావరణం భవిష్యత్తులోనూ కొనసాగాలని ఆకాంక్షించారు.రాజకీయ పదవి ఉన్నా లేకపోయినా సామాన్య కార్యకర్తగా, డౌనూరు సెగ్మెంట్ ప్రజల ఇంటి బిడ్డగా ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని బిడిజన అప్పారావు తెలిపారు. ప్రాంత అభివృద్ధి, ప్రజల సంక్షేమం కోసం తనవంతు కృషిని నిరంతరం కొనసాగిస్తానని పునరుద్ఘాటించారు.

## 50 సంవత్సరాలు పైబడి ఉన్న ప్రతి గౌడ కులస్తులకుపెన్షన్ మంజూరు చేయాలి.






ములుగు ప్రతినిధి: ()ప్రజలు ఓటు వేసి ఎన్నుకున్న ఎమ్మెల్యేలకు పెన్షన్ విషయంలో లేని నిబంధనలు పేద ప్రజల వృద్యాప్య మరియు చేయూత పింఛన్ లకు ఎందుకు అని ప్రశ్నించారు?తక్షణమే పేద ప్రజలకు ఇచ్చే పెన్షన్ల విషయంలో నిబంధాలను పూర్తిగా సడలించాలిబీపీల్ కార్డు ఉండి దరఖాస్తు చేసుకున్న ప్రతి ఒక్కరికి పింఛన్ మంజూరు చేయాలిపెన్షన్ అనేది సామాజిక భద్రత దాన్ని పొందే హక్కు ప్రతి ఒక్కరికి ఉంది ఎమ్మెల్యేలకు పెన్షన్ లు పూర్తిగా రద్దు చేయాలి ముఖ్యమంత్రి కి విజ్ఞప్తి చేసిన కల్లు గీత కార్మిక సంఘం ములుగు జిల్లా కమిటీవృత్తిదారులకు వితంతువులకు ఒంటరి మహిళలకు చేనేత గీత కార్మికులకు ఇచ్చే పెన్షన్ల విషయంలో నిబంధనలు పూర్తిగా సడలించాలని కల్లు గీత కార్మిక సంఘం ములుగు జిల్లా కమిటీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తుంది.కల్లుగీత కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు కార్యదర్శులు గుండెబోయిన రవి గౌడ్ బుర్ర శ్రీనివాస్ గౌడ్ ఈ సందర్భంగా మాట్లాడుతూ నాలుగు ఎకరాల భూమి ఉన్న ఫోర్ వీలర్ వాహనం ఉన్న పెన్షన్ రద్దు చేస్తున్నారని వారు అన్నారు.ప్రజలు ఓట్లు వేసి గెలిపించిన ఎమ్మెల్యేలకు ఎన్నిసార్లు గెలిస్తే అన్నిసార్లు పెన్షన్ ఇస్తున్న పాలకులు వారికి పింఛన్ ల విషయంపైన నిబంధనలు పక్కనపెట్టి పేద ప్రజలకు సామాజిక భద్రత అయిన పింఛన్ల విషయంలో ఇన్ని నిబంధన పెట్టడం సరైనది కాదని వారు అన్నారు.ఈ విషయంలో తక్షణమే కేబినెట్ సమావేశం ఏర్పాటు చేసి పేద ప్రజలకు ఇచ్చే పెన్షన్ల విషయంలో నిబంధన లు సడలింపు పై తీర్మానం చేసి తెల్ల రేషన్ కార్డు కలిగిన ప్రతి ఒక్కరికి పెన్షన్స్ మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు.

## శ్రీనివాస సెలూన్ ఆధ్వర్యంలో నూతన బ్యూటీ పార్లర్ ను ప్రారంభించిన ఎమ్మెల్యే : ప్రత్తిపాటి



చిలకలూరిపేట : సెప్టెంబర్ 24(,జిల్లా ప్రతినిధి:-చిలకలూరిపేట పట్టణం చౌత్ర సెంటర్లో శ్రీనివాస సెలూన్ వాళ్ళ ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటు చేసిన బ్యూటీ పార్లర్ ను మాజీమంత్రి , శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభించి శుభాకాంక్షలు తెలియజేశారు. శ్రీనివాసరావు బ్యూటీ పార్లర్ మంచి అభివృధి చెందాలని ప్రత్తిపాటి పుల్లారావు వాళ్లకు అభినందనలు తెలిపారు.ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు తోట రాజరమేష్, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ తేళ్ల సుబ్బారావు, పట్టణ అధ్యక్షులు పఠాన్ సమద్ ఖాన్, రాష్ట్ర డైరెక్టర్ కందుల రమణ, టీడీపీ కొత్త కోటేశ్వరరావు, భైరా కోటేశ్వరరావు, ఎస్.ఎస్. సుభాని, పిల్లి కోటేశ్వరరావు, టీడీపీ నాయకులు కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## చింతపల్లి మండల అభివృద్ధికి జడ్పిటిసి పోతురాజు బాలయ్య, ఎంపీపీ కే. అనుషాదేవి కృషి మరువలేనిది: మాజీ సర్పంచ్ జి. లలిత సింహాచలం



చింతపల్లి, సెప్టెంబర్ 24 అల్లూరి సీతారామరాజు జిల్లా చింతపల్లి మండల అభివృద్ధికి జడ్పిటిసి పోతురాజు బాలయ్య, ఎంపీపీ కే. అనుషాదేవి విశిష్టమైన కృషి చేశారని చౌడుపల్లి పంచాయతీ తాజా మాజీ సర్పంచ్ జి. లలిత, జి. సింహాచలం దంపతులు కొనియాడారు.ఈ సందర్భంగా మాజీ సర్పంచ్ జి. లలిత మాట్లాడుతూ.. తమ పదవీకాలంలో మండలంలోని గ్రామాల అభివృద్ధికి, మౌలిక సదుపాయాల కల్పనకు జడ్పిటిసి, ఎంపీపీ ఎంతో సహకారం అందించారని తెలిపారు. రోడ్లు, తాగునీరు, విద్య, వైద్యం వంటి కీలక రంగాల్లో వారి చొరవతో అనేక అభివృద్ధి పనులు చేపట్టారని పేర్కొన్నారు.వారి సేవలు, సహకారం మరువలేనిదని, భవిష్యత్తులో కూడా మండల అభివృద్ధికి వారు ఇదే స్ఫూర్తితో పదవులతో సంబంధం లేకుండాపనిచేయాలని ఆకాంక్షించారు.ఈ రెండు మూడు రోజులుగా భారీగా వర్షాలు పడుతున్నాయి గనుక ప్రజలు అపరమతంగా ఉండి సురక్షితమైన ప్రదేశంలో ఉండాలని ఎంతో అవసరం అయితేనే గాని బయటికి రాకూడదని ప్రజలకు వారు విజ్ఞప్తి చేశారు పశు కాపర్లు తగు జాగ్రత్తలు తీసుకోవాలని భారీ వృక్షాల కింద విద్యుత్ నిలువ స్తంభాలు కింద ఉండరాదని విజ్ఞప్తి చేశారు.

# తల్లీ బిడ్డల ఆరోగ్య సంరక్షణపై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ : ప్రత్తిపాటి

నాదెండ్ల మండల కేంద్రంలో జాతీయ పోషణ మాసోత్సవం-2026లో పాల్గొన్న ఎమ్మెల్యే ప్రత్తిపాటి.

కలెక్టర్ శ్రీమతి కృతికా శుక్లాతో కలిసి స్వర్ణ గ్రామ ఆరోగ్యదర్శిని కార్యక్రమంలో పాల్గొన్న ప్రత్తిపాటి.

చిన్నారుల్ని ముద్దుచేసి ఊయలలో వేసి ఆడించిన ఎమ్మెల్యే, కలెక్టర్.

బాలింతలకు హెచ్.పీ.ఎన్ కిట్స్ అందించిన ప్రత్తిపాటి, కృతికా శుక్లా.








చిలకలూరిపేట : సెప్టెంబర్ 24జిల్లా ప్రతినిధి:-మహిళలు గర్భం దాల్చినప్పటినుంచి ప్రసవం వరకు వారి ఆరోగ్య సంరక్షణపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక శ్రద్ధ పెట్టాయని, అంగన్ వాడీ కేంద్రాల ద్వారా గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు సకాలంలో మంచి నాణ్యమైన పౌష్టికాహారం అందిస్తున్నాయని శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు పేర్కొన్నారు.గురువారం ఆయన పల్నాడు జిల్లా కలెక్టర్ శ్రీమతి కృతికాశుక్లాతో కలిసి నాదెండ్ల గ్రామంలోని స్థానిక కల్యాణ మండపంలో నిర్వహించిన జిల్లాస్థాయి జాతీయ పోషణ మాసోత్సవం-2026 కార్యక్రమంలో పాల్గొన్నారు. బాలింతలకు హెచ్.పీ.ఎన్ కిట్స్ అందించిన అనంతరం ఎమ్మెల్యే ప్రత్తిపాటి, కలెక్టర్ కృతికా శుక్లా చిన్నారులను ఎత్తుకొని ముద్దాడి ఊయలలో వేశారు. అనంతరం వారు కార్యక్రమానికి హాజరైన వారిని ఉద్దేశించి మాట్లాడారు.

### తల్లీ బిడ్డల ఆరోగ్యానికి అధికప్రాధాన్యత..

ఎన్డీయే ప్రభుత్వం తల్లీ బిడ్డల ఆరోగ్య సంరక్షణలో భాగంగా పలు చర్యలు తీసుకుంటోందని, చిన్నారుల వయసు, గర్భిణుల్లోని పిండ ఎదుగుదలను బట్టి వారికి అందించే ఆహారంలో ఎప్పటికప్పుడు మార్పులు చేస్తూ, సకాలంలో నాణ్యమైన సమతుల పౌష్టికాహారం అందిస్తోందన్నారు. అంగన్ వాడీకేంద్రాల్లో అందించే నాణ్యమైన పోషకాహారానికి తోడు, తల్లీబిడ్డలు తాము వ్యక్తిగతంగా తీసుకునే ఆహారం విషయంలోనూ తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఆశ, అంగన్ వాడీ సిబ్బంది, వైద్యారోగ్య శాఖ సిబ్బంది తల్లీబిడ్డల ఆరోగ్య రక్షణపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని, గర్భిణులు, శిశువుల్ని రక్షించడం వారి ప్రాథమిక బాధ్యతని ప్రత్తిపాటి స్పష్టం చేశారు.ప్రజా ప్రభుత్వం తల్లీబిడ్డల సంరక్షణకూ అధిక ప్రాధాన్యత ఇస్తోందని, గర్భం దాల్చినప్పటి నుంచి ప్రసవం వరకు ప్రతి దశలోనూ అన్నిజాగ్రత్తలు తీసుకుంటోందన్నారు. కూటమి ప్రభుత్వం గత ప్రభుత్వంలా ప్రజల్ని గాలికి వదిలేయదని, ముఖ్యంగా మహిళలు, చిన్నారుల సంరక్షణపై ప్రత్యేక శ్రద్ధ పెట్టిందని ప్రత్తిపాటి తెలిపారు. తల్లీ బిడ్డల ఆరోగ్య రక్షణలో పల్నాడు జిల్లా రాష్ట్రంలోనే మంచి ఫలితాలు సాధించిందని, ఇందుకు కారకులైన ప్రతి ఒక్కరినీ అభినందిస్తున్నట్టు ప్రత్తిపాటి చెప్పారు.అన్ని విభాగాల సిబ్బంది సమన్వయంతో పనిచేసి తల్లీబిడ్డల ఆరోగ్యాన్ని రక్షించాలి : కలెక్టర్ కృతికా శుక్లా.కేంద్ర ప్రభుత్వ నిబంధనల ప్రకారం జాతీయ పోషణ మాసం (09 సెప్టెంబర్ నుంచి 08 అక్టోబర్ వరకు) 2026 కార్యక్రమ ఆవశ్యకతను ప్రతి గ్రామంలో తెలియచేస్తున్నామని, చిన్నారులు, గర్భిణులు, బాలింతల ఆరోగ్య రక్షణ కోసం ప్రభుత్వాలు తీసుకుంటున్న చర్యలపై వారికి అవగాహన కల్పిస్తున్నామని జిల్లా కలెక్టర్ శ్రీమతి కృతికా శుక్లా పేర్కొన్నారు. కార్యక్రమంలో భాగంగా పోషకాహారం తీసుకోవడం కలిగే ప్రయోజనాల్ని ప్రతి ఒక్కరికీ వివరిస్తున్నామన్నారు. గ్రామాల్లో తల్లీబిడ్డల ఆరోగ్య రక్షణ కోసం ఆశ, అంగన్ వాడీ, ఏ.ఎన్.ఎమ్ సిబ్బంది, వైద్యారోగ్య శాఖ విభాగం సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ సూచించారు. చిన్నారుల ఎదుగుదలను వారికి అందించే ఆహారంలో మార్పులు చేయాలని, వారి మానసిక, శారీరక ఎదుగుదలకు మంచి పోషకాహారమే కీలకంగా మారుతుందని ఆమె వివరించారు. ఆకుకూరలు, తృణధాన్యాలు, పాలు, పండ్లు, గుడ్డు వంటి వాటిలో అధిక పోషకాలు ఉంటాయన్నారు. అంగన్ వాడీల్లో ఎలాంటి ఆహారం అందిస్తున్నారో, ఎందుకు అందిస్తున్నారో అనే దానిపై మహిళలు ఆలోచన చేయాలన్నారు. కార్యక్రమంలో డి.యం.హెచ్.వో మన్మోహన్, నియోజకవర్గ సమన్వయకర్త నెల్లూరి సదాశివరావు, రాష్ట్ర డైరెక్టర్ కందుల రమణ, టీడీపీ నాయకులు నల్లమోతు హరిబాబు, వేములపల్లి బసవయ్య, నల్లమోతు సుబ్బారావు, వేములపల్లి వెంకటేశ్వర్లు, నెల్లూరి పూర్ణయ్య, యనమదల సూర్యనారాయణ, తుబాటి శ్రీహరి, టీడీపీ నాయకులు, కూటమి నాయకులు, ఇంఛార్జి సీడీపీవో ప్రసన్న కుమారి, ఎంపీడీవో చినుకూరి శ్రీనివాసరావులు, డాక్టర్లు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## పల్నాడు జిల్లా నూతన ఎస్పీగా జగదీష్ ఆదహళ్లి బాధ్యతల స్వీకరణ

శాంతిభద్రతల పరిరక్షణ, నేర నియంత్రణే ప్రథమ ప్రాధాన్యం

నరసరావుపేట : సెప్టెంబర్ 24(,జిల్లా ప్రతినిధి:-పల్నాడు జిల్లా నూతన జిల్లా పోలీసు సూపరింటెండెంట్ (ఎస్పీ)గా జగదీష్ ఆదహళ్లి గురువారం జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో లాంఛనంగా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా పోలీసు అధికారులు,సిబ్బంది ఆయనకు పుష్పగుచ్ఛాలు అందజేసి ఘన స్వాగతం పలికారు. బాధ్యతల స్వీకరణ అనంతరం సిబ్బందితో పరిచయ కార్యక్రమం నిర్వహించిన ఎస్పీ, జిల్లాలో శాంతిభద్రతల పరిస్థితి, పోలీసు శాఖ పనితీరుపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణ, నేరాల నియంత్రణ, ప్రజలకు వేగవంతమైన, మెరుగైన పోలీసు సేవలు అందించడమే తమ ప్రథమ ప్రాధాన్యమని స్పష్టం చేశారు. పోలీసు అధికారులు, సిబ్బంది అంతా పరస్పర సమన్వయంతో, అంకితభావంతో విధులు నిర్వహించి పోలీసు వ్యవస్థపై ప్రజల్లో ఉన్న నమ్మకాన్ని మరింత పెంపొందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పలువురు పోలీసు అధికారులు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## ఈ నెల 27న కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి వేడుకలు రంగారెడ్డి జిల్లా కలెక్టర్ ప్రతిక్ జైన్

సంగారెడ్డి జిల్లా : ప్రతినిధి ( 2026 సెప్టెంబర్ 24 గురువారం సంగారెడ్డి జిల్లా కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ ప్రతీక్ జైన్ ఆయన విధంగా సూచించారు కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతిని పురస్కరించుకొని. ఈ నెల 27వ తేదీన ఫ్రూట్ రీసెర్చ్ స్టేషన్ ఎఫ్ఆర్ఎస్ వద్ద ఉన్న కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహం వద్ద జయంతి వేడుకలను నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ తెలిపారు. ఈ సందర్భంగా కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించనున్నట్లు పేర్కొన్నారు.జయంతి వేడుకల్లో ప్రజాప్రతినిధులు అధికారులు వివిధ వర్గాల ప్రజలు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ కోరారు.

## వైభవంగా శ్రీకాకుళేశ్వర స్వామి పవిత్రోత్సవాలు

శ్రీకాకుళేశ్వర స్వామికి ఎమ్మెల్యే బుద్ధప్రసాద్- విజయలక్ష్మి దంపతుల పూజలు

పూర్ణాహుతి సమర్పించిన ఎమ్మెల్యే దంపతులు



ఘంటసాల, శ్రీవార్త న్యూస్: ఆంధ్రుల తొలి రాజధాని నగరంగా గుర్తింపు కలిగిన ప్రాచీన గ్రామం ఘంటసాల మండలం శ్రీకాకుళంలో ఆంధ్ర మహా విష్ణువు దేవస్థానంగా భాసిల్లుతున్న శ్రీకాకుళేశ్వర స్వామి దేవస్థానంలో పవిత్రోత్సవాలు అత్యంత వైభవంగా నిర్వహించారు. గురువారం పవిత్రోత్సవాలకు ముఖ్య అతిధులుగా అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ - విజయలక్ష్మి దంపతులు విచ్చేయగా దేవాదాయ శాఖ డిప్యూటీ కమిషనర్, చల్లపల్లి ఎస్టేట్ దేవాలయాల ఈఓ దాసరి శ్రీరామ వరప్రసాదరావు, వేద పండితులు ఎమ్మెల్యే దంపతులకు ఘన స్వాగతం పలికారు. దేవస్థానంలో స్వామివారిని, అమ్మవారిని ఎమ్మెల్యే దంపతులు దర్శించుకుని ప్రధాన అర్చకులు అగ్నిహోత్రం



భాస్కరాచార్యులుచే ప్రత్యేక పూజలు జరిపించుకున్నారు. అనంతరం ఎమ్మెల్యే దంపతులు స్వామి వారికి హారతులు ఇచ్చారు. ముత్తేవి వెంకట సత్యనారాయణాచార్యులు ఆధ్వర్యంలో దేవస్థాన ప్రధాన అర్చకులు అగ్నిహోత్రం భాస్కరాచార్యులు హోమగుండం వద్ద ప్రత్యేక హోమాలను నిర్వహించగా ఎమ్మెల్యే బుద్ధప్రసాద్ దంపతులు పూర్ణాహుతి సమర్పించారు. ఈ సందర్భంగా వారికి వేద పండితులు వేద ఆశీర్వచనాలను అందజేశారు. టీడీపీ గ్రామ పార్టీ అధ్యక్షులు దాసం రామకృష్ణ, జనసేన పార్టీ మండల ఉపాధ్యక్షులు సుగ్గన పవన్ కుమార్, అధిక సంఖ్యలో భక్తులు, దేవస్థానం సిబ్బంది పాల్గొన్నారు.

## భార్యాభర్త వివాదంలో బావను చంపిన బావమరిది





బంటుమిల్లి శ్రీవార్త న్యూస్ :క్షణకావేశం ఒక నిండు ప్రాణాన్ని బలి తీసుకుంది. భార్య భర్తల వివాదంలో వ్యక్తి జోక్యం చేసుకొని ఘర్షణకు దిగడంతో ఒక వ్యక్తి మృతి చెందిన ఘటన బంటుమిల్లి మండలం ములపర్రు పంచాయతీలోని గొల్లగూడెం గ్రామంలో బుధవారం రాత్రి చోటుచేసుకుంది. పోలీసులు అందించిన వివరాల ప్రకారం బంటుమిల్లి మండలం, ముల్లపర్రు గొల్లగూడెం గ్రామానికి చెందిన బోయిన వెంకన్న( 60) మృతుడు వెంకన్న భార్య నాగరాజి బంటుమిల్లి స్వీట్ షాపులో పనిచేస్తూ ఇంటికి వచ్చినప్పుడు ఎందుకు ఆలస్యమైనదని ఆమెతో తరచూ గొడవపడుతూ ఆమెను కొడుతూ ఉండేవాడు. ఈనెల 23వ తేదీన రాత్రి 10 గంటల సమయంలో మృతుడి భార్య పనికి వెళ్లి తిరిగి ఇంటికి రాగా ఆమెతో మృతుడు వెంకన్న గొడవపడి కొట్టుచుండగా, మృతుడు భార్య తమ్ముడు బట్రాజు అప్పారావు వచ్చి తన అక్కను ఎందుకు కొట్టుతున్నావని ప్రశ్నించాడు. దీంతో మృతునితో గొడవపడి బట్రాజు అప్పారావు కత్తితో మృతుడు వెంకన్న తొడ పైన, కాలు దిగువన కత్తితో నరకడం వలన తీవ్రమైన రక్తస్రావం అవడంతో అక్కడికక్కడే చనిపోయినాడు. మృతుడు చిన్న కుమారుడు బోయిన సురేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు బంటుమిల్లి ఎస్సై ఎం. నాగరాజు కేసు నమోదు చేసినారు. పంచనామా నిర్వహించి మృతదేహన్ని పోస్టుమార్టం నిమిత్తం బందరు ప్రభుత్వ హాస్పటల్ కు తరలించారు. బందరు రూరల్ సర్కిల్ ఇన్స్పెక్టర్ కే. నాగేంద్ర ప్రసాద్ నేరసంఘటన ప్రదేశాన్ని పరిశీలించి కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

## నగరంలో కలెక్టర్ డా. జి.లక్ష్మీశ, కమిషనర్ ధ్యానచంద్ర పరిశీలన





విజయవాడ శ్రీ వార్త న్యూస్ వర్షాల నేపథ్యంలో జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ, విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర హెచ్ఎంతో కలిసి గురువారం రాత్రి విజయవాడ అర్బన్ పరిధిలోని మధ్యకట్టతో పాటు కస్తూరిబాయిపేటలో పర్యటించి పరిస్థితులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు.కస్తూరిబాయిపేటలో కొండచరియలు ఒక ఇంటిపై పడిన విషయం గుర్తించిన అధికారులు వెంటనే అక్కడికి చేరుకుని పరిస్థితిని పరిశీలించారు. ఇంట్లో ఉన్న కుటుంబ సభ్యులను తక్షణమే సురక్షిత పునరావాస కేంద్రానికి తరలించారు. నగరంలో కొండచరియలు విరిగిపడే అవకాశం ఉన్న ప్రాంతాల్లో ప్రమాదకర పరిస్థితుల్లో నివసిస్తున్న ప్రజలను ముందస్తుగా గుర్తించి వెంటనే పునరావాస కేంద్రాలకు తరలించాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ప్రజల భద్రతపై నిరంతరం అప్రమత్తంగా ఉండాలని, ప్రమాదకర ప్రాంతాల్లోని ప్రజలకు పునరావాస కేంద్రాలకు తరలివెళ్లాల్సిన ఆవశ్యకతపై మైక్ అనౌన్స్‌మెంట్ల ద్వారా తరచూ అవగాహన కల్పించాలని సూచించారు.పర్యటనలో భాగంగా ఓ హోటల్‌ను సందర్శించి ఆహార నాణ్యత, వంటశాల పరిశుభ్రత, ఆహార తయారీలో పాటిస్తున్న పారిశుద్ధ్య ప్రమాణాలు, తాగునీటి పరిశుభ్రత తదితర అంశాలను పరిశీలించారు. ఆహారం నాణ్యంగా, పరిశుభ్రంగా ఉండేలా నిర్వాహకులు తప్పనిసరిగా ప్రమాణాలను పాటించాలని స్పష్టం చేశారు.

# 26న గడ్డిపాడు రైల్వే ఓవర్ బ్రిడ్జి శంకుస్థాపన విజయవంతం చేద్దాం

భారీ బైక్ ర్యాలీలో అందరూ పాల్గొనాలి

సన్నాహక సమావేశంలో గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్



గుంటూరు సెప్టెంబర్ 24 కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గుంటూరు నగరాభివృద్ధిలో మరో కలిపి తురాయి వచ్చి చేరిందని, గుంటూరు ఇన్నర్ రింగ్ రోడ్ -- గడ్డిపాడు రైల్వే లెవల్ క్రాసింగ్ (రాజ-3) పై రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మించ బోతున్నారని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే అసెంబ్లీ మైనార్టీస్ కమిటీ చైర్మన్ నసీర్ తెలిపారు.ఈ కార్యక్రమానికి రైల్వే కేంద్ర సహాయ మంత్రి సోమన్న, కేందగర గ్రామీణ అభివృద్ధి శాఖ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ ముఖ్యఅతిథిగా హాజరై శంకుస్థాపన చేయనున్నారని వెల్లడించారు. దీనికి సంబంధించిన సన్నాహక సభను గురువారం రాత్రి స్థానిక తూర్పు కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నసీర్ మాట్లాడుతూ గట్టిపాడు వద్ద భూమి పూజ అనంతరం ఇన్నర్ రింగ్ రోడ్ జంక్షన్ నుంచి భారీ బైక్ ర్యాలీ ప్రారంభమై వెంకటేశ్వర విజ్ఞాన్ మందిరం వరకు కొనసాగుతుందని చెప్పారు. గుంటూరు నగర అభివృద్ధికి ఎంతో కీలకమైన ఈ రైల్వే ఓవర్ బ్రిడ్జి శంకుస్థాపన కార్యక్రమాన్ని కూటమి శ్రేణులు విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, సీఎం చంద్రబాబు నాయుడు, కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని ఆధ్వర్యంలో గుంటూరు నగరానికి మహర్దశ తీసుకొచ్చారని తెలిపారు. శంకర్ విలాస్ బ్రిడ్జి నిర్మాణం గుంటూరు నగరానికి మణికిరీటం అన్నారు. దీంతోపాటు తూర్పు నియోజకవర్గంలో వందల కోట్ల రూపాయలతో అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయని చెప్పారు. గుంటూరు నగరంలో శాశ్వత అభివృద్ధి పనులు చేపడుతున్న కూటమి ప్రభుత్వం చేస్తోన్న మంచి గురించి ప్రజలకు తెలిసేలా నాయకులు, కార్యకర్తలు ముందడుగు వేయాలని పిలుపునిచ్చారు.

# స్వచ్ఛ పలమనేరు కోసం ప్రజల భాగస్వామ్యం అవసరం

కమిషనర్ కె.లోకేశ్వర వర్మ



పలమనేరు సెప్టెంబర్ 24 పరిశుభ్రమైన పరిసరాలతోనే ఆరోగ్యకరమైన సమాజం సాధ్యమవుతుందని స్వచ్ఛ పలమనేరు నిర్మాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పలమనేరు మున్సిపల్ కమిషనర్ కె. లోకేశ్వర వర్మ పిలుపునిచ్చారు.సేవా సంకల్ప అభియాన్--స్వచ్ఛతా హి సేవ కార్యక్రమాల్లో భాగంగా గురువారం పలమనేరు పట్టణంలోని భజంత్రీ వీధి, ఎస్టీ కాలనీలో పారిశుద్ధ్యంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజలకు తడి, పొడి చెత్త విభజన, వ్యర్థాల నిర్వహణ, ప్లాస్టిక్ వినియోగం వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కల్పించారు.ఇళ్లలో ఉత్పత్తయ్యే తడి చెత్తను ఉపయోగించి సహజ ఎరువును తయారు చేసుకోవచ్చని కమిషనర్ తెలిపారు. ప్రతి ఇంటి వద్దనే తడి, పొడి చెత్తను వేరు చేసి పారిశుద్ధ్య సిబ్బందికి అందించాలని సూచించారు. రోడ్లు, ఖాళీ స్థలాల్లో చెత్త వేయకుండా పరిసరాల పరిశుభ్రతకు సహకరించాలని కోరారు.ఒక్కసారి వినియోగించి పారేసే ప్లాస్టిక్ కవర్లు, గ్లాసులు, ప్లేట్ల వినియోగాన్ని నివారించాలని సూచించారు. ప్లాస్టిక్‌కు ప్రత్యామ్నాయంగా వస్త్ర సంచులు, జనపనార సంచులు, స్టీల్, మట్టి పాత్రలను వినియోగించాలని ప్రజలకు అవగాహన కల్పించారు.వార్డుల వారీగా పారిశుద్ధ్యాన్ని మెరుగుపరిచేందుకు ప్రజాప్రతినిధులు, అధికారులు, స్థానికులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. మెప్మా సిబ్బంది, మహిళా సంఘాల ప్రతినిధులు ఇంటింటికీ వెళ్లి తడి--పొడి చెత్త విభజన, ప్లాస్టిక్ నిషేధంపై ప్రజలకు అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు.అనంతరం అధికారులు,స్వయం సహాయక సంఘాల మహిళలతో స్వచ్ఛతా ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం పట్టణంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో మున్సిపల్, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు బాబు రెడ్డి నాయక్ , మెప్మా సిబ్బంది, సీఎంఎం బాబా, ఆర్పీలు, వార్డు సచివాలయ సిబ్బంది, స్వచ్ఛతా అంబాసిడర్లు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఎన్‌ఎస్‌ఎస్ సేవా కార్యక్రమాల్లో విద్యార్థులు చురుకుగా పాల్గొనాలి




పలమనేరు సెప్టెంబర్ 24(: విద్యార్థులు ఎన్‌ఎస్‌ఎస్ సేవా కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొని సమాజంలో ఆరోగ్యంపై ప్రజలకు అవగాహన కల్పించాలని పలమనేరు ప్రముఖ హోమియో వైద్యురాలు డాక్టర్ ఉమారాణి సూచించారు. పలమనేరు మదర్ థెరెసా డిగ్రీ కళాశాలలో గురువారం ఎన్‌ఎస్‌ఎస్ దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రత్యేక సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా డాక్టర్ ఉమారాణి మాట్లాడుతూ... విద్యార్థులు తమ ఆరోగ్యంతో పాటు కుటుంబం సమాజ ఆరోగ్య పరిస్థితులపై అవగాహన పెంచుకోవాలన్నారు. ముఖ్యంగా విద్యార్థినీ విద్యార్థుల్లో సాధారణంగా కనిపించే ఆరోగ్య సమస్యలపై అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. సమాజంలోని మారుమూల ప్రాంతాల ప్రజలకు ఆరోగ్య పరిరక్షణపై చైతన్యం కల్పించడంలో ఎన్‌ఎస్‌ఎస్ వాలంటీర్లు కీలక పాత్ర పోషించాలని సూచించారు.కార్యక్రమంలో అకడమిక్ అడ్వైజర్ డాక్టర్ రాజేంద్రరెడ్డి, ఎన్‌ఎస్‌ఎస్ కోఆర్డినేటర్ దేవేంద్రరెడ్డి, కళాశాల ప్రిన్సిపాల్ మధుసూదనరావు, అధ్యాపక బృందం పాల్గొన్నారు.

# వైసీపీ పార్టీ వారికీ ఐడెంటి కార్డులు పంపిణీ




పలమనేరు సెప్టెంబరు 24(రూరల్ మండలంలోని వైసిపి పార్టీ వారికి ఐడెంటి కార్డులను పలమనేరు రూరల్ మండల కన్వీనర్ బాలాజీ నాయుడు, గురువారం కరిడిమడుగు గ్రామంలో పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... రాబోయే సర్పంచ్ జడ్పిటిసి ఎంపీటీసీ వార్డ్ అభ్యర్థుల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వైసిపి పార్టీ అభ్యర్థి గెలుపు కోసం కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో విశ్వనాథ రెడ్డి, వైసిపి నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# కళాశాల విద్యతో పాటు నైపుణ్యాలను పెంపొందించుకోవాలి- డి.ఎస్.పి దేగల ప్రభాకర్




పలమనేరు సెప్టెంబర్ 24:విద్యార్థులు కళాశాల విద్యతో పాటు క్రమశిక్షణ, నైపుణ్యాలు, క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలపై ఆసక్తి పెంచుకుని ఉజ్వల భవిష్యత్తును నిర్మించుకోవాలని పలమనేరు డీఎస్పీ డి. ప్రభాకర్ సూచించారు. పలమనేరు ఎస్వీసీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రథమ సంవత్సరం విద్యార్థులకు గురువారం నిర్వహించిన ఇండక్షన్ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు.ఈ సందర్భంగా డీఎస్పీ ప్రభాకర్ మాట్లాడుతూ....ప్రస్తుత పోటీ ప్రపంచంలో విద్యార్థులు చదువుతో పాటు ఉద్యోగ అవకాశాలకు ఉపయోగపడే నైపుణ్యాలను అభివృద్ధి చేసుకోవాలన్నారు. క్రీడల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు కూడా అనేక ఉద్యోగ అవకాశాలు ఉన్నాయని తెలిపారు.కళాశాల ప్రిన్సిపాల్ డా. ఎం. వెంకటేశులు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ... విద్యార్థులు క్రమశిక్షణతో మెలిగి, మంచి ఆలోచనా విధానాన్ని అలవర్చుకుని సమాజానికి ఉపయోగపడే పౌరులుగా ఎదగాలని ఆకాంక్షించారు.పలమనేరు పట్టణ సీఐ కె. మోహన్ రెడ్డి మాట్లాడుతూ... విద్యార్థులు విద్యతో పాటు క్రీడలు, సాంస్కృతిక, ఇతర సహపాఠ్య కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొనాలని సూచించారు. డ్రగ్స్, సెల్‌ఫోన్‌లకు బానిసలు కాకుండా లక్ష్యాన్ని నిర్దేశించుకుని ముందుకు సాగాలని హితవు పలికారు.కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డా. కె. సంధ్యారాణి మాట్లాడుతూ... విద్యార్థులు కళాశాల జీవితాన్ని సద్వినియోగం చేసుకుని ఉన్నత స్థాయికి ఎదగాలని కోరారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# కాణిపాకంలో ఘనంగా వార్షిక బ్రహ్మోత్సవాల వేద సభ



శ్రీ స్వామి వారి దేవస్థానం వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఈరోజు వేద సభ (వేద సదస్యము)ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర లోని వివిధ ప్రముఖ దేవాలయాల నుండి వచ్చిన వేద పండితులచ్చే ఉదయం నుంచి సాయంత్రం వరకు చతుర్వేద పారాయణం, చతుర్వేద స్వస్తి, మరియు వేద ప్రశస్తి, గురించి ప్రముఖ వేదభాష్య పండితులచే ఉపన్యాసం తరువాత వేద పండితులకు సత్కార కార్యక్రమము నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో



దేవస్థానం ఈ.వో శ్రీ పెంచల కిషోర్ . చైర్మన్ మణి నాయుడు, బోర్డు సభ్యులు, ఆలయ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఏపీలో మద్యం షాపులకు నోటిఫికేషన్ విడుదల.. తేదీ, పూర్తి వివరాలు ఇవే..




ఆంధ్రప్రదేశ్‌లో ఖాళీగా ఉన్న మద్యం షాపుల కేటాయింపునకు సంబంధించి ఎక్సైజ్ శాఖ నోటిఫికేషన్ విడుదల చేసింది. రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 3,650 ఏ4 మద్యం షాపులను రెన్యువల్ కోసం నోటిఫై చేయగా, నిన్న అర్ధరాత్రితో రెన్యువల్ గడువు ముగిసింది.ఈ ప్రక్రియలో రాష్ట్రవ్యాప్తంగా 3,236 మద్యం షాపులను ప్రస్తుతం ఉన్న యజమానులే తిరిగి రెన్యువల్ చేసుకున్నారు. అయితే, 414 మద్యం షాపుల యజమానులు రెన్యువల్‌కు ముందుకు రాలేదు. దీంతో రెన్యువల్ కాకుండా మిగిలిపోయిన ఈ 414 షాపులతో పాటు, గతంలో కేటాయించకుండా మిగిలిన షాపులను కూడా కలుపుకొని మొత్తం 807 మద్యం షాపులకు ఎక్సైజ్ శాఖ నూతన నోటిఫికేషన్ ఇచ్చింది. ఈ 807 షాపులకు అక్టోబర్ 1వ తేదీ అర్ధరాత్రి వరకు దరఖాస్తులను స్వీకరించనున్నారు. అనంతరం అక్టోబర్ 3న స్వీకరించిన దరఖాస్తుల పరిశీలన చేపడతారు. పరిశీలన పూర్తయిన తర్వాత పారదర్శకంగా లాటరీ పద్ధతి ద్వారా అర్హులైన అభ్యర్థులకు ఏపీ ఎక్సైజ్ శాఖ మద్యం షాపులను కేటాయించనుంది.

# మక్కా నగరానికి మరోసారిం ముప్పు అలర్ట్ జారీచేసిన సౌదీ.. నెల రోజుల్లో రెండోసారి




పవిత్ర నగరం మక్కా సహా దేశంలోని పలు ఇతర ప్రాంతాలకు సౌదీ సివిల్ డిఫెన్స్ గురువారం ముందస్తు హెచ్చరికలు జారీ చేసింది. సాధారణంగా క్షిపణి దాడుల ప్రమాదం పొంచి ఉన్న సందర్భాల్లోనే ఇటువంటి అలర్ట్‌లు జారీ చేస్తారు. ''ఎదురయ్యే ముప్పు గురించి అప్రమత్తం చేసేందుకు మక్కా నగరంలోని నేషనల్ ఎర్లీ వార్నింగ్ ప్లాట్‌ఫారమ్ ద్వారా హెచ్చరిక జారీ చేశాం" అని అధికారిక ఎక్స్ (ట్విట్టర్) ఖాతాలో సౌదీ సివిల్ డిఫెన్స్ పేర్కొంది. ముస్లింలకు అత్యంత పవిత్ర స్థలమైన మక్కాకు అధికారులు ఇలాంటి హెచ్చరిక జారీ చేయడం గత 10 రోజుల్లో ఇది రెండోసారి.ఎర్ర సముద్ర తీరంలోని యాంబు గవర్నరేట్‌తో పాటు తైఫ్, జెడ్డా, తబుక్ సహా సౌదీ అరేబియా పశ్చిమ తీరంలోని ఇతర ప్రాంతాలకు కూడా వేర్వేరుగా హెచ్చరికలు జారీ చేశారు. అనంతరం హౌతీలతో పోరాడుతున్న 57 దేశాల సౌదీ కూటమి స్పందిస్తూ.. సాయుధ గ్రూప్ ప్రయోగించిన ఆరు బాలిస్టిక్ క్షిపణులను తాము అడ్డుకున్నట్లు తెలిపింది. తైఫ్, యాంబులను లక్ష్యంగా చేసుకున్న ప్రయత్నాన్ని సౌదీ వైమానిక రక్షణ దళాలు తిప్పికొట్టాయని పేర్కొంది. "ఉగ్రవాద హౌతీ రెబల్స్ పదే పదే ఉల్లంఘనలను గట్టిగా ఎదుర్కొంటాం" అని కూటమి అధికార ప్రతినిధి తుర్కీ అల్-మాలికి ఎక్స్‌లో పేర్కొన్నారు.ఏఎఫ్‌పీ న్యూస్ ఏజెన్సీ ప్రకారం.. కొన్ని నిమిషాల తర్వాత హెచ్చరికలను ఉపసంహరించుకున్నారు. ఇటీవల వారాల్లో హౌతీలు జరిపిన దాడులకు ముందే ఈ విధమైన అలర్ట్‌లు జారీ అయ్యాయి. గతవారం మక్కాను లక్ష్యంగా చేసుకుని హౌతీలు ప్రయోగించిన డ్రోన్‌ను కూల్చివేసినట్లు సౌదీ అరేబియా ఆరోపించింది. 2017 తర్వాత ఇలాంటి ప్రయత్నం జరగడం ఇదే తొలిసారని తెలిపింది. అయితే ఈ ఆరోపణలను హౌతీ గ్రూప్ ఖండించింది.చివరిసారిగా సెప్టెంబరు 15న అలర్ట్ వచ్చింది. మక్కాకు దక్షిణాన హౌతీ డ్రోన్‌ను వైమానిక రక్షణ వ్యవస్థలు అడ్డుకున్న తర్వాత జారీచేశారు. కొన్నేళ్ల తర్వాత తొలిసారిగా సౌదీ రాజధాని రియాద్‌ను హౌతీలు లక్ష్యంగా చేసుకున్నారు. అమెరికా, ఇరాన్ మధ్య యుద్ధం జరుగుతున్న వేళ హౌతీలు, సౌదీ మద్దతు ఉన్న యెమెన్ ప్రభుత్వం మధ్య మళ్లీ పోరాటం మొదలైంది. హౌతీ బృందం సౌదీపై సముద్ర దిగ్బంధనాన్ని ప్రకటించి, ఎర్ర సముద్రంలో దాని నౌకలను లక్ష్యంగా చేసుకోవడంతో ఈ ఘర్షణ ప్రారంభమైంది.ఈ నెల మొదట్లో సౌదీ చమురు ఎగుమతులకు ఎంతో కీలకమైన బాబ్ అల్-మండేబ్ జలసంధిని హౌతీలు స్వాధీనం చేసుకున్నారు. 2015 నుంచి అంతర్జాతీయంగా గుర్తించిన యెమెన్ ప్రభుత్వానికి అండగా ఉన్న సౌదీ నేతృత్వంలోని కూటమితో యుద్ధం చేస్తున్న హౌతీలు, సౌదీ అరేబియాపై దాడులను తీవ్రతరం చేశారు. దాంతో యెమెన్ కూడా పశ్చిమాసియా యుద్ధంలో చేరింది.

# ఇద్దరు ఆచార్యులు.. రెండు విభిన్న పుస్తకాలు.. ఒకే వేదిక!

**ఒకటి అర్థశాస్త్రం... మరొకటి భాషా, సాహిత్య శాస్త్రం. ఈ విభిన్నమైన శాస్త్రాలకు చెందిన రెండు వేర్వేరు పుస్తకాలు బుధవారం (సెప్టెంబర్ 23) హైదరాబాద్‌లో ఒకే వేదికపై, ఏకకాలంలో ఆవిష్కరణ జరుపుకొన్నాయి.**



ఆ పుస్తకాలు రాసిన రచయితలిద్దరూ ఆయా శాస్త్రాలలో విశ్వవిద్యాలయ ఆచార్యులు కావడం ఒక విశేషమైతే, నిజ జీవితంలో భార్యాభర్తలు కావడం మరో విశేషం. రెండు పుస్తకాలూ లాభాపేక్ష రహితంగా ప్రముఖ ప్రచురణ సంస్థ 'ఎమెస్కో బుక్స్' ప్రచురించినవే.ఒకటి - హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయం (హెచ్.సి.యు)లో అర్థశాస్త్ర ఆచార్యులుగా పనిచేసి, 'సాక్షి' దినపత్రికలో అనేక వ్యాసాలు రాసిన జంగా మనోహర్ రావు రాసిన 'ప్రపంచీకరణ వీచికలు' పుస్తకం. మరొకటి - తెలుగు విశ్వవిద్యాలయంలో నిఘంటు నిర్మాణ శాఖలో ఆచార్యులుగా పనిచేసిన అయినవోలు ఉషాదేవి 'భాష - సాహిత్యం (వివేచన... విశ్లేషణ)' వ్యాసాల సంపుటి.సీనియర్ సంపాదకులు, 'సాక్షి' మీడియా గ్రూప్ మాజీ ఎడిటోరియల్ డైరెక్టర్ కె. రామచంద్రమూర్తి 'ప్రపంచీకరణ వీచికలు' పుస్తకాన్ని ఆవిష్కరించారు. అలీగఢ్ ముస్లిమ్ యూనివర్సిటీలో పీజీ చదివి, ఢిల్లీ జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్సిటీ (జె.ఎన్.యు)లో ఔషధ పరిశ్రమపై పీహెచ్‌డీ చేసి, బడ్జెట్ వ్యవహారాల నిపుణుడిగా పత్రికకు వ్యాసాలు రాస్తూ, వివిధ తెలుగు, ఉర్దూ టీవీ ఛానళ్ళలో విషయ నిపుణుడిగా చర్చల్లో పాల్గొంటూ వస్తున్న సుదీర్ఘ అనుభవం రచయిత ఆచార్య జంగా మనోహర్‌రావుది. జంగా మనోహర్‌రావు, మరో సీనియర్ సంపాదకులు టంకశాల అశోక్, చరిత్ర శాఖ ఆచార్యులు వకుళాభరణం రామకృష్ణ... ముగ్గురూ దాదాపు ఒకే సమయంలో ఢిల్లీలోని జె.ఎన్.యు.లో పరిశోధన సాగించినవారే! ఆ సంగతులను వక్తలు తమ మాటల్లో ప్రస్తావించారు.ఢిల్లీలో సైతం పత్రికా రచనలో విశేష అనుభవం ఉన్న జర్నలిస్ట్ కె. రామచంద్రమూర్తి మాట్లాడుతూ, జె.ఎన్.యు.కు సంబంధించి అప్పటి తన జ్ఞాపకాలను పంచుకున్నారు. మరో ప్రముఖ అర్థశాస్త్రవేత్త, హెచ్.సి.యు.లో రిటైర్డ్ ఆచార్యులు, 'సాక్షి' పత్రిక సంపాదకీయ పేజీ వ్యాసరచయిత డి. నరసింహారెడ్డి 'ప్రపంచీకరణ వీచికలు' పుస్తకాన్ని సభకు పరిచయం చేశారు. భారతదేశంలో ఆర్థిక సరళీకరణ, ఆర్థిక విషయ పరిణామాలు, దాండేకర్ వంటి ఆర్థిక శాస్త్రవేత్తల స్మృతి వ్యాసాలు ఈ పుస్తకంలో ఉన్నాయని చెప్పారు. ఆ యా వ్యాసాల గురించి నరసింహారెడ్డి తన ప్రసంగంలో సవివరంగా తెలిపారు.ఇక, 'పిల్లలు భాష ఎలా నేర్చుకుంటార'నే సైకో - లింగ్విస్టిక్స్ అంశంపై ఉస్మానియా విశ్వవిద్యాలయంలో పీహెచ్డీ చేసి, బరోడా యూనివర్సిటీ, తెలుగు యూనివర్సిటీ లాంటి పేరున్న విశ్వవిద్యాలయాల్లో పనిచేసిన అయినవోలు ఉషాదేవి వ్యాసాల సంపుటి 'భాష - సాహిత్యం (వివేచన - విశ్లేషణ)'ను ఆచార్య వకుళాభరణం రామకృష్ణ ఆవిష్కరించారు. రచయిత్రి అధ్యాపక వృత్తి జీవితాన్ని చాలా కాలం దగ్గర నుంచి చూసిన ఆయన మాట్లాడుతూ, ఆమె రచనా వైశిష్ట్యాన్ని ప్రస్తావించారు. ఢిల్లీ జె.ఎన్.యు.కు సంబంధించిన తన అనుభవాలు, జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. కేతన 'ఆంధ్రభాషా భూషణం', జాషువా 'గబ్బిలం', మొల్ల రామాయణం లాంటి రచనలకు వ్యాఖ్యానం రాసి, 'ధ్వన్యనుకరణ పద నిఘంటువు'ను కూర్చిన అనుభవజ్ఞురాలు ఉషాదేవి.'ఎమెస్కో' ప్రధాన సంపాదకులు డాక్టర్ డి. చంద్రశేఖరరెడ్డి తన ప్రసంగంలో 'భాష - సాహిత్యం (వివేచన - విశ్లేషణ)' పుస్తకాన్ని పరిచయం చేశారు. ఉషాదేవి గత రచనలు, ప్రస్తుత రచన గురించి వివరంగా తెలియజేశారు. తాజా పుస్తకంలో భాషపై 16, సాహిత్యంపై 12 వ్యాసాలు, మరో 12 విశిష్ట పుస్తక సమీక్షలు ఉన్నట్టు తెలిపారు. ప్రత్యేకించి, నేటి తెలుగు స్థితిగతుల పైన, నిఘంటువుల ద్వారా తెలియవచ్చే సామాజిక విషయాలపైన వ్యాసాలు ఈ పుస్తకంలో పొందుపరచడం విశేషమన్నారు. హైదరాబాద్‌లోని 'ఇఫ్లూ'లో భాషాశాస్త్ర ఆచార్యులుగా పనిచేసిన ఆచార్య వెన్నెలకంటి ప్రకాశం రచయితలను అభినందించారు. రచయితలు జంగా మనోహర్ రావు, అయినవోలు ఉషాదేవి దంపతులు చివరగా తమ స్పందన తెలియజేశారు. అతిథులకూ, ప్రచురణకర్తకూ తమ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. వివిధ విద్యాలయాల్లో ఉన్నత పదవులు నిర్వహించిన ఆచార్య బి. శివారెడ్డి, కె. ప్రతాపరెడ్డి, పగడాల చంద్రశేఖర్, డాక్టర్ చంద్రయ్య, ఎ. పుల్లయ్య, సీనియర్ సంపాదకుడు టంకశాల అశోక్ తదితరులు ఈ పుస్తకావిష్కరణ సభకు ప్రత్యేకంగా హాజరవడం, రచయితలతో తమ ఆత్మీయతను పంచుకోవడం విశేషం.

# రోజూ ఏడు గుడ్లు.. 20 కిలోలు తగ్గాడు.. వైరల్ డైట్‌పై నిపుణుల క్లారిటీ

ఏడు నెలల్లో 20 కిలోలు తగ్గిన వివేక్ రాజ్‌పుత్

రోజూ ఏడు పూర్తి గుడ్లు తిన్నట్లు వెల్లడి

ట్రైగ్లిజరైడ్స్ 280 నుంచి 94కి తగ్గినట్లు వెల్లడి

కొలెస్ట్రాల్ 200 నుంచి 180కి పడిపోయినట్లు చెప్పిన వివేక్ రాజ్‌పుత్

గుడ్లు తినడం వల్లే కొలెస్ట్రాల్ తగ్గలేదన్న వైద్యులు



రోజూ ఏడు ఉడికించిన గుడ్లు తింటే కొలెస్ట్రాల్ పెరుగుతుందా? సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న ఓ వ్యక్తి డైట్ ఇప్పుడు ఈ చర్చకు కారణమైంది. వివేక్ రాజ్‌పుత్ అనే వ్యక్తి ఏడు నెలల్లో 20 కిలోల బరువు తగ్గినట్లు చెబుతున్నారు. ఈ క్రమంలో ప్రతిరోజూ ఏడు పూర్తి గుడ్లు తింటున్నానని సోషల్ మీడియాలో వెల్లడించారు. అయితే ఇన్ని గుడ్లు తింటే కొలెస్ట్రాల్ పెరుగుతుందంటూ పలువురు ఆందోళన వ్యక్తం చేశారు.

దీనిపై వివేక్ మరో వీడియోలో తన ఆరోగ్య పరీక్షల వివరాలను పంచుకున్నారు. ఏడు పూర్తి గుడ్లు తింటున్నప్పటికీ తన ట్రైగ్లిజరైడ్స్ 280 నుంచి 94కి తగ్గాయని తెలిపారు. మొత్తం కొలెస్ట్రాల్ 200 నుంచి 180కి పడిపోయిందని చెప్పారు. గోధుమలు, మైదా, రొట్టెలను ఆహారం నుంచి తొలగించి.. రాత్రి భోజనంగా ఏడు గుడ్లు తీసుకుంటున్నట్లు వివరించారు.

అయితే ఈ ఫలితాలను చూసి అందరూ రోజూ ఏడు గుడ్లు తినడం మొదలుపెట్టకూడదని వైద్యులు స్పష్టం చేస్తున్నారు. ఏడు పూర్తి గుడ్లలో దాదాపు 1,300 మిల్లీగ్రాముల కొలెస్ట్రాల్ ఉంటుందని ఆంకాలజిస్ట్ డాక్టర్ వర్తికా విష్వాణి తెలిపారు. వివేక్ బరువు తగ్గడం, కార్బోహైడ్రేట్లను తగ్గించడం వల్ల ఆయన లిపిడ్ ప్రొఫైల్ మెరుగుపడి ఉండొచ్చని చెప్పారు. ఏడు గుడ్లు కొలెస్ట్రాల్‌ను తగ్గించాయని చెప్పడానికి ఆధారం లేదన్నారు.

మ్యాక్స్ హాస్పిటల్ గురుగ్రామ్ డైటెటిక్స్ విభాగం అధిపతి సురభి శర్మ కూడా ఇదే విషయాన్ని చెప్పారు. గుడ్లలో ప్రొటీన్, విటమిన్ బీ12, కోలిన్, సెలీనియం వంటి పోషకాలు ఉన్నాయని తెలిపారు. అయితే ఒక్క ఆహారంపైనే ఎక్కువగా ఆధారపడటం మంచిది కాదన్నారు. కూరగాయలు, పండ్లు, తృణధాన్యాలు, పప్పులు, గింజలు కూడా ఆహారంలో ఉండాలని సూచించారు. గుడ్లు తినడం వల్లే గుండె జబ్బులు వస్తాయన్న అభిప్రాయాన్ని తాజా పరిశోధనలు పూర్తిగా సమర్థించవు. అయితే ఎక్కువ గుడ్లు తినడం కొందరిలో మొత్తం కొలెస్ట్రాల్, ఎల్‌డీఎల్ స్థాయిలను స్వల్పంగా పెంచవచ్చని నిపుణులు చెబుతున్నారు. అధిక కొలెస్ట్రాల్ లేదా గుండె జబ్బుల ముప్పు ఉన్నవారు వైద్యుల సూచనతో గుడ్ల పరిమాణాన్ని నిర్ణయించుకోవాలని సూచిస్తున్నారు.

# ఉదయాన్నే వెన్న తింటే బరువు తగ్గుతారా? నిపుణులు చెబుతోంది ఇదే..!

వైట్ బటర్‌తో నేరుగా బరువు తగ్గరని నిపుణుల సూచన

కొంతసేపు ఆకలి తగ్గించొచ్చని వివరణ

వెన్నలో క్యాలరీలు ఎక్కువగా ఉంటాయని వెల్లడి

అధికంగా తింటే ఎల్‌డీఎల్ పెరగొచ్చని హెచ్చరిక

కొలెస్ట్రాల్ ఉన్నవారు జాగ్రత్తగా ఉండాలని సూచన



ఉదయం లేవగానే ఖాళీ కడుపుతో ఓ చెంచా ఉప్పు లేని తాజా వెన్న (వైట్ బటర్).. ఈ మధ్య సోషల్ మీడియాలో కనిపిస్తున్న ఆరోగ్య చిట్కాల్లో ఒకటి. బరువు తగ్గాలనుకునేవారికి ఇది మేలు చేస్తుందని కొందరు చెబుతున్నారు. ఎక్కువసేపు ఆకలి వేయకుండా చేస్తుందని ప్రచారం జరుగుతోంది. మరికొందరు మాత్రం వెన్నలో కొవ్వు ఎక్కువగా ఉంటుంది కాబట్టి కొలెస్ట్రాల్ పెరుగుతుందని హెచ్చరిస్తున్నారు. ఇంతకీ ఈ రెండింటిలో నిజం ఏది?

ఆకలి తగ్గొచ్చా?

వైట్ బటర్‌లో కొవ్వు అధికంగా ఉంటుంది. దీన్ని తినడం వల్ల జీర్ణక్రియ కొంత నెమ్మదిగా సాగవచ్చు. దీంతో కడుపు నిండిన భావన ఎక్కువసేపు ఉండొచ్చు. ఫలితంగా మధ్యలో ఎక్కువగా తినాలనే కోరిక తగ్గే అవకాశం ఉంది. ఈ కారణంగా బరువు నియంత్రణకు పరోక్షంగా ఉపయోగపడొచ్చు. అయితే వెన్న తినడం వల్ల శరీరంలోని కొవ్వు నేరుగా కరిగిపోతుందని మాత్రం చెప్పలేం.



వెయిట్ లాస్‌కు అసలు లెక్క ఇదే

బరువు తగ్గాలంటే రోజులో తీసుకునే క్యాలరీల కంటే ఖర్చయ్యే కేలరీలు ఎక్కువగా ఉండాలి. వైట్ బటర్‌లో క్యాలరీలు ఎక్కువగా ఉంటాయి. అందుకే మోతాదుకు మించి తీసుకుంటే బరువు తగ్గడం కష్టమవుతుంది. పైగా ఇతర కొవ్వు పదార్థాలతో కలిపి ఎక్కువగా తీసుకుంటే క్యాలరీల మోతాదు మరింత పెరుగుతుంది. కాబట్టి వైట్ బటర్‌ను బరువు తగ్గించే ఆహారంగా చూడటం సరైంది కాదని నిపుణులు వివరిస్తున్నారు.

కొలెస్ట్రాల్ సంగతేంటి?

వైట్ బటర్‌లో సంతృప్త కొవ్వులు (శాచురేటెడ్ ఫ్యాట్స్) ఉంటాయి. ఎక్కువగా తీసుకుంటే చెడు కొలెస్ట్రాల్ (ఎల్‌డీఎల్) పెరిగే అవకాశం ఉంది. ముఖ్యంగా ఇప్పటికే కొలెస్ట్రాల్ ఎక్కువగా ఉన్నవారు జాగ్రత్తగా ఉండాలి. ఊబకాయం ఉన్నవారు, గుండె జబ్బుల ముప్పు ఉన్నవారు కూడా మోతాదును నియంత్రించాలి.



ఎవరైనా తినొచ్చా?

వైట్ బటర్‌లో కొవ్వులో కరిగే కొన్ని విటమిన్లు ఉంటాయి. శరీరానికి శక్తిని అందించడంలోనూ ఇది ఉపయోగపడుతుంది. అయితే ప్రతి ఒక్కరికీ ఒకే మోతాదు సరిపోదు. కొలెస్ట్రాల్ లేదా గుండె సంబంధిత సమస్యలు ఉన్నవారు వైద్యులు లేదా డైటీషియన్ సలహా తీసుకోవడం మంచిది.

ఎలా తీసుకుంటే మంచిది?

వైట్ బటర్‌ను తక్కువ మోతాదులో తీసుకోవచ్చని ఆరోగ్య నిపుణులు సూచిస్తున్నారు. సంపూర్ణ ధాన్యాలతో చేసిన రొట్టె, ప్రొటీన్ ఉన్న అల్పాహారం లేదా చిరుధాన్యాల ఆహారంతో కలిపి తీసుకోవడం మంచిది. ప్రాసెస్ చేసిన ఆహారాలతో పాటు ఎక్కువ మొత్తంలో తినకపోవడం అవసరం. మొత్తంగా చూస్తే.. ఖాళీ కడుపుతో వైట్ బటర్ తినడం వల్లే బరువు తగ్గుతామని చెప్పడానికి బలమైన ఆధారాలు లేవు. మితంగా తీసుకుంటే ఆహారంలో భాగంగా ఉండొచ్చు. మోతాదు పెరిగితే మాత్రం క్యాలరీలు, కొలెస్ట్రాల్ రెండూ సమస్యగా మారొచ్చు.

# 5 స్టార్ హోటల్లో దోశ ఇలా తినాలట.. వైరల్ వీడియోపై నెటిజన్ల సెటైర్లు!



5 స్టార్ హోటల్‌లో దోశ తినే వీడియో వైరల్

దోశ తినే పద్ధతిని చూపించిన ఎటికెట్ కోచ్

స్పూన్, ఫోర్క్‌తో దోశ తినడం చూపించిన వైనం

'ఎక్స్'లో వీడియోను షేర్ చేసిన మనస్ ముదులి

వీడియోపై నెటిజన్లు సెటైర్లు

దోశ.. దక్షిణాది వారికి ఎంతో ఇష్టమైన అల్పాహారం. వేడి వేడి దోశను చేతితో ముక్కలు చేసి చట్నీ, సాంబార్‌తో తినడం చాలామందికి అలవాటు. కానీ 5 స్టార్ హోటల్‌లో దోశ తినాలంటే మాత్రం చేతులు ఉపయోగించకూడదా? స్పూన్, ఫోర్క్‌తోనే తినాలా? ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న ఓ వీడియో ఈ ప్రశ్నలను లేవనెత్తింది.

వైరల్ వీడియోలో ఓ ఎటికెట్ కోచ్ దోశను ఎలా తినాలో చూపించారు. ముందుగా దోశ రెండు చివర్లను మధ్యకు మడిచారు. ఆ తర్వాత స్పూన్‌తో దోశ నుంచి ఓ ముక్కను విడదీశారు. దాన్ని ఫోర్క్‌తో తీసుకుని తిన్నారు. 5 స్టార్ హోటల్‌లో దోశను ఇలా తినాలంటూ వీడియోలో చూపించడం నెటిజన్లను ఆశ్చర్యానికి గురిచేసింది. ఈ వీడియోను 'ఎక్స్'లో మనస్ ముదులి అనే యూజర్ షేర్ చేశారు. 5 స్టార్ హోటల్‌లో రూ.1,500 చెల్లించి దోశ తింటే చేతులతో తినడానికి అనుమతి ఉండదన్నట్టుగా ఆయన వ్యంగ్యంగా క్యాప్షన్ పెట్టారు. ఫోర్క్, స్పూన్ తప్పనిసరి అంటూ వీడియోను పంచుకున్నారు. వీడియోపై నెటిజన్లు పెద్ద ఎత్తున స్పందించారు. దోశను భారతీయ పద్ధతిలోనే తినాలని కొందరు సూచించారు. మరికొందరు ఈ విధానం చాలా విచిత్రంగా ఉందని కామెంట్ చేశారు. ఓ యూజర్ అయితే దోశ, ఇడ్లీ లాంటి వంటకాలకు ఫోర్క్, స్పూన్ పక్కన పెట్టి చేతులతో తినడమే సరైన పద్ధతి అని వ్యాఖ్యానించారు. మరోవైపు 5 స్టార్ హోటళ్లలో ఇలాంటి నిబంధన ఏదీ లేదని కొందరు స్పష్టం చేశారు.

# ఈ 6 అలవాట్లు కిడ్నీలను నెమ్మదిగా దెబ్బతీస్తాయి!




కిడ్నీ వ్యాధుల్లో లక్షణాలు వెంటనే బయటపడని వైనం

పెయిన్‌కిల్లర్లను తరచూ వాడటం ప్రమాదకరం

ప్యాకెట్ ఫుడ్‌లో దాగిన ఉప్పుతో ముప్పు

ప్రాసెస్డ్ ఫుడ్ ఎక్కువగా తినడం మంచిది కాదు

స్మోకింగ్‌తో కిడ్నీలకూ ముప్పు

కిడ్నీల్లో సమస్య మొదలైన వెంటనే లక్షణాలు కనిపించవు. నొప్పి లేకపోవడంతో అంతా బాగానే ఉందని చాలామంది అనుకుంటారు. కానీ రోజువారీ జీవితంలోని కొన్ని అలవాట్లు కిడ్నీలపై క్రమంగా ఒత్తిడి పెంచొచ్చు. ముఖ్యంగా నొప్పి మందులను తరచుగా వాడటం, ఎక్కువ ఉప్పు తినడం, పొగతాగడం వంటి అలవాట్లపై జాగ్రత్త అవసరం. నిపుణుల సూచనల ప్రకారం కిడ్నీలను దెబ్బతీసే అవకాశం ఉన్న ఆరు అలవాట్లు ఏంటో చూద్దాం..

నొప్పి వస్తే వెంటనే మందులు

తలనొప్పి, నడుము నొప్పి, కీళ్ల నొప్పి వచ్చిన ప్రతిసారీ పెయిన్‌కిల్లర్ వేసుకోవడం మంచిది కాదు. వైద్యుల సూచన లేకుండా వాడితే కిడ్నీలకు రక్తప్రసరణ తగ్గొచ్చు. తీవ్రమైన సందర్భాల్లో కిడ్నీ పనితీరు ఒక్కసారిగా దెబ్బతినే ప్రమాదం ఉంటుంది. ముఖ్యంగా డీహైడ్రేషన్, వాంతులు, విరేచనాలు ఉన్నప్పుడు మరింత జాగ్రత్త అవసరం.



ఉప్పుతో ముప్పు

ఉప్పు అంటే వంటలో వేసేదే అనుకోవద్దు. ప్యాకెట్ స్నాక్స్, పచ్చళ్లు, సాస్‌లు, ఇన్‌స్టంట్ నూడుల్స్, ప్రాసెస్డ్ ఫుడ్, హోటల్ వంటకాల్లోనూ సోడియం ఎక్కువగా ఉండొచ్చు. అధిక సోడియం శరీరంలో నీటిని నిల్వ చేయొచ్చు. రక్తపోటును పెంచొచ్చు. దీర్ఘకాలంలో కిడ్నీలపై ప్రభావం పడొచ్చు.

ప్యాకెట్ ఫుడ్ తినడం

అప్పుడప్పుడు రెడీమేడ్ ఫుడ్ తినడం పెద్ద సమస్య కాదు. కానీ ప్యాకేజ్డ్ స్నాక్స్, చక్కెర పానీయాలు, ప్రాసెస్డ్ ఫుడ్ రోజువారీ ఆహారంలో ప్రధానంగా మారితే ఇబ్బంది. వీటిలో ఉప్పు, క్యాలరీలు, శుద్ధి చేసిన కార్బోహైడ్రేట్లు ఎక్కువగా ఉండొచ్చు. దీర్ఘకాలంలో అధిక బరువు, ఇన్సులిన్ నిరోధకత, అధిక రక్తపోటు వంటి సమస్యలకు దారితీయొచ్చు.

నీళ్లు ఎక్కువ తాగితే

కిడ్నీలకు తగినంత నీరు అవసరం. ముఖ్యంగా ఎండ, వ్యాయామం, జ్వరం, వాంతులు, విరేచనాల సమయంలో డీహైడ్రేషన్‌కు దూరంగా ఉండాలి. అయితే అవసరానికి మించి రోజూ లీటర్ల కొద్దీ నీరు తాగడం కూడా సరైన పద్ధతి కాదు. శరీర పరిమాణం, వాతావరణం, శారీరక శ్రమ, ఆరోగ్య పరిస్థితిని బట్టి నీటి అవసరం మారుతుంది.

పొగతాగడం కేవలం ఊపిరితిత్తులకే కాదు

స్మోకింగ్ ప్రభావం ఊపిరితిత్తులకే పరిమితం కాదు. ఇది రక్తనాళాల ఆరోగ్యాన్ని దెబ్బతీయొచ్చు. గుండె సంబంధిత సమస్యల ముప్పును పెంచొచ్చు. కిడ్నీలు కూడా ఆరోగ్యకరమైన రక్తప్రసరణపై ఆధారపడతాయి. అందుకే పొగతాగడం కిడ్నీ ఆరోగ్యానికీ అదనపు భారంగా మారొచ్చు.

బీపీ, షుగర్ చెక్ చేయకపోవడం

కిడ్నీ సమస్యలు చాలాసార్లు లక్షణాలు లేకుండానే తీవ్రమవుతాయి. మధుమేహం, అధిక రక్తపోటు దీర్ఘకాలిక కిడ్నీ వ్యాధికి ప్రధాన కారణాల్లో ఉన్నాయి. అందుకే మధుమేహం, హైబీపీ, గుండె జబ్బులు లేదా కుటుంబంలో కిడ్నీ వైఫల్యం చరిత్ర ఉన్నవారు వైద్యుల సలహాతో కిడ్నీ పరీక్షలు చేయించుకోవాలి. రక్తంలో క్రియాటినిన్, ఈజీఎఫ్ఆర్, మూత్రంలో యూఏసీఆర్ వంటి పరీక్షలు కిడ్నీ పనితీరుపై కీలక సమాచారం అందిస్తాయి.

## ఎలక్ట్రిక్, సీఎన్‌జీ వాహనాలపై కేంద్రం కీలక ప్రతిపాదన..

# ఇక 20 ఏళ్ల వరకు నడపొచ్చా?

ఈవీ, హైడ్రోజన్, సీఎన్‌జీ వాహనాల వయసు పెంచే ప్రతిపాదన

గరిష్ఠ వయోపరిమితి 17, 20 ఏళ్లకు పెంపు

అదనంగా ఐదేళ్ల జాతీయ పర్మిట్ ఆథరైజేషన్‌కు అవకాశం

ఐదేళ్ల రుసుము రూ.82,500గా ప్రతిపాదన

వాహన్ డేటాబేస్‌తో పేపర్‌వర్క్ తగ్గింపు



కమర్షియల్ ఎలక్ట్రిక్, హైడ్రోజన్, సీఎన్‌జీ వాహనాలకు కేంద్ర ప్రభుత్వం కీలక ప్రతిపాదన చేసింది. జాతీయ పర్మిట్ పరిధిలో ఉన్న ఈ వాహనాల గరిష్ఠ వయసును మరో ఐదేళ్లు పెంచాలని ప్రతిపాదించింది. దీనికి సంబంధించి కేంద్ర రహదారి రవాణా, రహదారుల మంత్రిత్వ శాఖ ముసాయిదా నోటిఫికేషన్ విడుదల చేసింది. ప్రస్తుతం జాతీయ పర్మిట్ పరిధిలోని కొన్ని వాణిజ్య వాహనాలకు 12 ఏళ్లు, మరికొన్ని వాహనాలకు 15 ఏళ్ల వయోపరిమితి ఉంది. ప్రతిపాదన అమల్లోకి వస్తే ఎలక్ట్రిక్, హైడ్రోజన్, సీఎన్‌జీ వాహనాలకు ఈ పరిమితి వరుసగా 17 ఏళ్లు, 20 ఏళ్లకు పెరగనుంది. అయితే ఈ సడలింపు అన్ని కమర్షియల్ వాహనాలకు వర్తించదు. బ్యాటరీ, హైడ్రోజన్, సహజ వాయువుతో నడిచే వాటికే పరిమితం కానుంది. కాలుష్యాన్ని తగ్గించే వాణిజ్య రవాణాను ప్రోత్సహించడంలో భాగంగానే ఈ ప్రతిపాదన చేసినట్లు తెలుస్తోంది. జాతీయ పర్మిట్ ఉన్న వాహన యజమానులకు మరో వెసులుబాటును కూడా కేంద్రం ప్రతిపాదించింది. ప్రస్తుతం ప్రతి ఏడాది పర్మిట్ ఆథరైజేషన్ పునరుద్ధరించుకోవాల్సి ఉండగా.. ఇకపై ఒకేసారి ఐదేళ్లకు తీసుకునే అవకాశం కల్పించనుంది. వార్షిక రుసుము రూ.16,500గానే ఉంటుంది. ఐదేళ్లకు మొత్తం రూ.82,500 చెల్లించాల్సి ఉంటుంది. వాహనాలకు సంబంధించిన పత్రాల ప్రక్రియను కూడా సులభతరం చేయాలని కేంద్రం భావిస్తోంది. వాహన్ డేటాబేస్‌ను ఉపయోగించడం ద్వారా కాగితపు పనిని తగ్గించనుంది. తాత్కాలిక రిజిస్ట్రేషన్ నిబంధనల్లోనూ మార్పులు ప్రతిపాదించింది. బాడీ అమర్చని చాసిస్‌కు ఆరు నెలల తాత్కాలిక రిజిస్ట్రేషన్ ఇవ్వనున్నారు. ప్రత్యేక పరిస్థితుల్లో దాన్ని ఒక్కోసారి 30 రోజులు చొప్పున పొడిగించే అవకాశం ఉంటుంది. ఈ ముసాయిదా నిబంధనలపై ప్రజలు, సంబంధిత వర్గాల నుంచి అభ్యంతరాలు, సూచనలు కోరారు. నోటిఫికేషన్ ప్రజలకు అందుబాటులోకి వచ్చిన తేదీ నుంచి 30 రోజుల్లోగా అభిప్రాయాలు తెలియజేయాల్సి ఉంటుంది.

## గంగైఇక్తిస్ ఇండోనేపాలికస్'గా నామకరణం

భారత్-నేపాల్ సరిహద్దు ప్రాంతంలో ఓ బోరుబావి నుంచి బయటపడ్డ జీవి

శాస్త్రవేత్తల దృష్టిని ఆకర్షించిన సోషల్ మీడియాలో వైరల్ అయిన వీడియో

గంగానది పేరుతో దీనికి 'గంగైఇక్తిస్' అనే పేరు

'చౌధురిడే' కుటుంబానికి చెందిన కొత్త జాతిగా గుర్తింపు

జూకీస్ జర్నల్‌లో ప్రచురితమైన పరిశోధన వివరాలు



సోషల్ మీడియాలో వైరల్ అయిన ఓ వీడియో శాస్త్రవేత్తలను ఓ అరుదైన చేప జాతి ఆచూకీ వైపు నడిపించింది. సాధారణంగా చేపలకు ఉండే లక్షణాలకు పూర్తిగా భిన్నంగా, అచ్చం వానపాములా కనిపించిన ఓ చిన్న జీవి భారత్-నేపాల్ సరిహద్దు ప్రాంతంలో ఓ బోరుబావి నుంచి బయటకు వచ్చింది. 2024లో సోషల్ మీడియాలో ఈ వీడియో వైరల్ కావడంతో శాస్త్రవేత్తల దృష్టి దానిపై పడింది. పూర్తిగా చీకటిగా ఉండే భూగర్భ జలాల్లో ఈ జీవి బయటపడటంతో ఇది ఇంతవరకు గుర్తించని కొత్త జాతి కావచ్చని పరిశోధకులు అనుమానించారు. ఈ వింత చేపకు శాస్త్రవేత్తలు 'గంగైఇక్తిస్ ఇండోనేపాలికస్' అనే పేరు పెట్టారు. గంగానది పేరుతో దీనికి 'గంగైఇక్తిస్' అనే పేరు పెట్టినట్లు పరిశోధకులు తెలిపారు. దాదాపు నాలుగు సెంటీమీటర్ల పొడవు ఉండే ఈ చేపకు కళ్లు చాలా చిన్నగా ఉంటాయి. భూగర్భంలో ఎలాంటి వెలుతురు లేకపోవడంతో చూపు అవసరం లేకపోవడమే ఇందుకు కారణమని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. ఈ చేపకు పెద్ద రెక్కలు లేవు. నీటితో నిండిన మట్టి పొరలు, భూగర్భంలోని తడి ప్రాంతాల్లో వానపాములా శరీరాన్ని మెలితిప్పుకుంటూ కదులుతుంది. బయటకు చూస్తే వానపాములా కనిపించినప్పటికీ, మైక్రో-సీటీ స్కానింగ్, జన్యు విశ్లేషణల ద్వారా ఇది పూర్తిగా భిన్నమైన చేప జాతి అని పరిశోధకులు నిర్ధారించారు. ఇది 'చౌధురిడే' కుటుంబానికి చెందిన కొత్త జాతిగా గుర్తించారు. ఈ అరుదైన చేపను పట్టుకోవడం మాత్రం పరిశోధకులు చాలా శ్రమించారు. బోరుబావులను గుర్తించి వాటి యజమానుల అనుమతి తీసుకొని పరిశోధకులు నీటిని చేతులతో బయటకు తోడారు. సుమారు 2,000 లీటర్ల నీటిని బయటకు తీసిన తర్వాత మొదటి చేప కనిపించింది. అయితే అది గాయపడి వెంటనే చనిపోయింది. మరో 500 లీటర్ల నీటిని తోడిన తర్వాత రెండో చేప లభించింది. అదే పూర్తి స్థితిలో లభించిన నమూనా కావడంతో దానిని ఈ కొత్త జాతికి 'హోలోటైప్'గా శాస్త్రవేత్తలు గుర్తించారు. ముంబైకి చెందిన ఠాక్రే వైల్డ్‌లైఫ్ ఫౌండేషన్, కొల్హాపూర్‌లోని శివాజీ యూనివర్సిటీ, చైనీస్ అకాడమీ ఆఫ్ సైన్సెస్‌కు చెందిన షాంఘై సింక్రోట్రాన్ రేడియేషన్ ఫెసిలిటీ, జూలాజికల్ సర్వే ఆఫ్ ఇండియాకు చెందిన పరిశోధకులు కలిసి ఈ అధ్యయనం నిర్వహించారు. ఈ పరిశోధన వివరాలు 'జూకీస్' జర్నల్‌లో ప్రచురితమయ్యాయి. ఇండో-గంగా మైదానాల్లో, గంగానది పరివాహక ప్రాంతంలో గుర్తించిన తొలి భూగర్భ జల చేపగా దీన్ని పరిశోధకులు పేర్కొన్నారు. సోషల్ మీడియాలో సాధారణంగా కనిపించిన ఓ వీడియో చివరకు శాస్త్రవేత్తలను భూమి లోపల దాగి ఉన్న అరుదైన జీవ వైవిధ్యాన్ని కనుగొనేలా చేసింది. కోట్లాది మంది జీవనానికి నీరు, ఆహారం, ఉపాధిని అందించే గంగానది పరివాహక ప్రాంతంలో ఇలాంటి వింత జీవి బయటపడటం శాస్త్రవేత్తలకు ఆసక్తికరమైన పరిణామంగా మారింది. సోషల్ మీడియా ద్వారా వెలుగులోకి వచ్చిన ఈ ఆవిష్కరణ ఇప్పుడు ప్రపంచ శాస్త్రీయ వర్గాల దృష్టిని ఆకర్షిస్తోంది.

## టెస్టుల్లో రిషభ్ పంత్ చరిత్ర..

## 100 సిక్సర్లు కొట్టిన తొలి భారత క్రికెటర్‌గా రికార్డు!

టెస్టుల్లో పంత్ 100 సిక్సర్లు పూర్తి చేసిన పంత్

ఈ ఘనత సాధించిన తొలి భారత బ్యాటర్‌గా రికార్డు

శ్రీలంకతో గాలె టెస్టులో రికార్డు నమోదు

లహిరు కుమార బౌలింగ్‌లో సిక్సర్

ప్రపంచంలో 100 సిక్సర్లు కొట్టిన నాలుగో బ్యాటర్



టీమిండియా స్టార్ వికెట్ కీపర్ బ్యాటర్ రిషభ్ పంత్ టెస్టు క్రికెట్‌లో సరికొత్త చరిత్ర సృష్టించాడు. టెస్టుల్లో 100 సిక్సర్లు బాదిన తొలి భారత బ్యాటర్‌గా నిలిచాడు. శ్రీలంకతో గాలెలో జరుగుతున్న తొలి టెస్టులో ఈ ఘనత సాధించాడు. లహిరు కుమార బౌలింగ్‌లో భారీ సిక్సర్ కొట్టి పంత్ ఈ మైలురాయిని అందుకున్నాడు. పంత్ తనదైన ఆటతో ఈ రికార్డును సాధించాడు. కుమార వేసిన బంతిని ముందుకు వచ్చి లెగ్ సైడ్ వైపు భారీ షాట్ ఆడాడు. బంతి నేరుగా బౌండరీ దాటి సిక్సర్‌గా వెళ్లింది. దీంతో పంత్ టెస్టు కెరీర్‌లో 100 సిక్సర్లు పూర్తి చేసుకున్నాడు. అదే సమయంలో టెస్టుల్లో తన 20వ అర్ధశతకాన్ని నమోదు చేశాడు. ఈ ఘనతతో పంత్ ప్రపంచ టెస్టు క్రికెట్‌లో అరుదైన జాబితాలో చేరాడు. టెస్టుల్లో 100 సిక్సర్లు కొట్టిన నాలుగో బ్యాటర్‌గా నిలిచాడు. ఇంగ్లండ్ మాజీ కెప్టెన్ బెన్ స్టోక్స్ 138 సిక్సర్లతో అగ్రస్థానంలో ఉన్నాడు. న్యూజిలాండ్ మాజీ కెప్టెన్ బ్రెండన్ మెకల్లమ్ 107 సిక్సర్లతో రెండో స్థానంలో ఉన్నాడు. పంత్ 100 సిక్సర్లతో మూడో స్థానంలో ఉండగా.. ఆస్ట్రేలియా దిగ్గజ వికెట్ కీపర్ ఆడమ్ గిల్‌క్రిస్ట్ కూడా 100 సిక్సర్లు బాదాడు. టెస్టుల్లో పంత్ సిక్సర్ల వేగం కూడా ప్రత్యేకంగా నిలిచింది. అతడు 100 సిక్సర్లను 49.2 బంతులకు ఒకటి చొప్పున సాధించాడు. ఈ విషయంలోనూ పంత్ దూకుడు స్పష్టంగా కనిపిస్తోంది. ఇప్పటివరకు ఏ భారత బ్యాటర్ కూడా టెస్టుల్లో 100 సిక్సర్ల మార్క్‌ను అందుకోలేదు. దీంతో పంత్ పేరు భారత క్రికెట్ చరిత్రలో ప్రత్యేకంగా నిలిచింది.

## అమెరికా కలలకు గండి.. భారీగా పడిపోయిన

# భారతీయుల గ్రీన్ కార్డ్ ఆమోదాలు

భారతీయుల కోసం ఉద్దేశించిన ఈబీ-1ఏ గ్రీన్ కార్డ్ ఆమోదం రేటు భారీగా పతనం

2025లో 49.1శాతంగా ఉన్న రేటు 2026 ప్రథమార్ధంలో 35 శాతానికి క్షీణత

అధికారుల కఠిన వైఖరి వల్లే తిరస్కరణలు పెరిగాయంటున్న ఇమ్మిగ్రేషన్ నిపుణులు

భారత టెక్ ప్రొఫెషనల్స్‌పై ఈ ప్రభావం అత్యధికంగా ఉన్నట్టు వెల్లడి

ప్రత్యామ్నాయంగా కెనడా, యూకే వైపు చూస్తున్న వృత్తి నిపుణులు




అసాధారణ ప్రతిభ కలిగిన వృత్తి నిపుణులకు అమెరికాలో శాశ్వత నివాసం కల్పించే ఈబీ-1ఏ గ్రీన్ కార్డ్ ఆమోదాల విషయంలో భారతీయులకు గట్టి ఎదురుదెబ్బ తగిలింది. 2026 ఆర్థిక సంవత్సరం ప్రథమార్ధంలో భారతీయుల ఆమోదం రేటు కేవలం 35 శాతానికి పడిపోయింది. గత ఏడాదితో పోలిస్తే ఇది చాలా తక్కువ కావడం ఆందోళన కలిగిస్తోంది. ముఖ్యంగా భారత టెక్నాలజీ నిపుణులపై ఈ ప్రభావం ఎక్కువగా కనిపిస్తోంది.

గణాంకాలు ఏం చెబుతున్నాయి?

యూఎస్ సిటిజన్‌షిప్ అండ్ ఇమ్మిగ్రేషన్ సర్వీసెస్ (యూఎస్‌సీఐఎస్) డేటాను విశ్లేషించిన బౌండ్‌లెస్ ఇమ్మిగ్రేషన్ సంస్థ ఈ గణాంకాలను వెల్లడించింది. దీని ప్రకారం, 2025 ఆర్థిక సంవత్సరంలో ఈబీ-1ఏ కేటగిరీ కింద భారతీయులు 14,250 పిటిషన్లు దాఖలు చేయగా, వాటిలో 6,993 ఆమోదం పొందాయి. అప్పుడు ఆమోదం రేటు 49.1 శాతంగా ఉంది. కానీ, 2026 ఆర్థిక సంవత్సరం తొలి ఆరు నెలల్లో (రెండు త్రైమాసికాలు) దాఖలైన 7,316 పిటిషన్లలో కేవలం 2,571 మాత్రమే ఆమోదం పొందాయి. దీంతో ఆమోదం రేటు 35 శాతానికి పడిపోయింది. ఇదే సమయంలో తిరస్కరణల సంఖ్య కూడా పెరిగింది.

ఎందుకు ఈ పరిస్థితి?

అసాధారణ ప్రతిభ, నైపుణ్యాలు ఉన్న వ్యక్తులు ఈబీ-1ఏ గ్రీన్ కార్డ్ కోసం దరఖాస్తు చేసుకుంటారు. దీనికోసం యూఎస్‌సీఐఎస్ నిర్దేశించిన పది ప్రమాణాలలో కనీసం మూడింటిని దరఖాస్తుదారులు తప్పనిసరిగా అందుకోవాలి. అయితే, గత కొంతకాలంగా అమెరికా ఇమ్మిగ్రేషన్ అధికారులు నైపుణ్యం కలిగిన వృత్తి నిపుణుల దరఖాస్తుల విషయంలో చాలా కఠినంగా వ్యవహరిస్తున్నారని నిపుణులు చెబుతున్నారు.

బౌండ్‌లెస్ ఇమ్మిగ్రేషన్ సహ వ్యవస్థాపకుడు జియావో వాంగ్ మాట్లాడుతూ.. "ఈబీ-1ఏ ఆమోదాల తగ్గుదల ప్రభావం భారత టెక్ నిపుణులపై ఎక్కువగా ఉంది. వారి తర్వాత చైనా దరఖాస్తుదారులపై కూడా ఈ ప్రభావం కనిపిస్తోంది" అని తెలిపారు. ఇమ్మిగ్రేషన్ అటార్నీ జోయెల్ యానోవిచ్ కూడా ఇదే అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. దరఖాస్తుదారుల నాణ్యత తగ్గలేదని, చట్టంలో మార్పులు రాలేదని, కానీ దరఖాస్తులను పరిశీలించే అధికారులు కఠినమైన ప్రమాణాలను వర్తింపజేస్తున్నారని ఆయన వివరించారు.

### ప్రత్యామ్నాయ మార్గాల అన్వేషణ

ఈబీ-1ఏ విభాగంలో తిరస్కరణలు పెరగడం, ఇతర ఉపాధి ఆధారిత గ్రీన్ కార్డ్ విభాగాలలో సుదీర్ఘ నిరీక్షణ ఉండటంతో చాలా మంది భారతీయులు ప్రత్యామ్నాయ మార్గాల వైపు చూస్తున్నారు. కొందరు ఈబీ-1సీ (మల్టీనేషనల్ మేనేజర్), ఈబీ-5 (పెట్టుబడిదారుల కార్యక్రమం) వంటి ఇతర మార్గాలను పరిశీలిస్తున్నారు. మరికొందరు అమెరికాను వీడి కెనడా, యూకే వంటి దేశాలకు వలస వెళ్లేందుకు ఆసక్తి చూపుతున్నారు. మొత్తం మీద అమెరికాలో నైపుణ్యం కలిగిన వలసదారుల పట్ల పెరుగుతున్న కఠిన వైఖరి, ప్రపంచవ్యాప్తంగా ప్రతిభావంతుల వలస సరళిని మార్చేలా కనిపిస్తోంది.

# భారత్‌లో పిల్లల అశ్లీల కంటెంట్‌పై మెటా ఉక్కుపాదం..

ప్రభుత్వంతో చర్చల వేళ కీలక నిర్ణయం

పిల్లల అశ్లీల కంటెంట్‌పై చర్యలను ముమ్మరం చేసిన టెక్ దిగ్గజం మెటా

కేంద్ర ఐటీ శాఖతో చర్చల నేపథ్యంలో ఈ కీలక పరిణామం

నిబంధనలు పాటించకపోతే 'సేఫ్ హార్బర్' రక్షణ ఉండదని ప్రభుత్వం స్పష్టీకరణ

ఒకసారి తీసేసిన కంటెంట్ మళ్లీ రాకుండా నిరోధించేందుకు ప్రత్యేక చర్యలు

కంటెంట్ విధానాల్లో భారతీయ సంస్కృతిని పరిగణనలోకి తీసుకోవాలని సూచన




భారత్‌లోని తమ ప్లాట్‌ఫామ్‌లలో పిల్లలపై లైంగిక వేధింపులకు సంబంధించిన కంటెంట్ (సీఎస్ఏఎం) వ్యాప్తిని అడ్డుకోవడంతో పాటు, అది మళ్లీ ప్రత్యక్షం కాకుండా అరికట్టేందుకు అమెరికా టెక్ దిగ్గజం మెటా తన ప్రయత్నాలను ముమ్మరం చేసింది. ఈ అంశంపై కేంద్ర ప్రభుత్వంతో జరుపుతున్న చర్చల నేపథ్యంలో ఈ పరిణామం చోటుచేసుకుంది.

'ఎన్డీటీవీ' ప్రాఫిట్ కథనం ప్రకారం.. కేంద్ర ఎలక్ట్రానిక్స్, ఐటీ మంత్రిత్వ శాఖ, మెటా మధ్య ఈ విషయంపై కీలక చర్చలు జరిగాయి. చట్టవిరుద్ధమైన కంటెంట్‌ను మెటా ఎలా నిర్వహిస్తోంది, ఒకసారి గుర్తించి తొలగించిన హానికరమైన కంటెంట్ మళ్లీ ప్రత్యక్షం కాకుండా నిరోధించడంలో డిజిటల్ ప్లాట్‌ఫామ్‌ల బాధ్యతపై ఈ చర్చలు ప్రధానంగా దృష్టి సారించాయి. పిల్లలపై లైంగిక వేధింపుల కంటెంట్ భారతీయ చట్టాలను స్పష్టంగా ఉల్లంఘించడమే కాబట్టి, ఈ విషయంలో మెటా చాలా అప్రమత్తంగా వ్యవహరిస్తోంది. ఒకసారి ఫ్లాగ్ చేసి తొలగించిన కంటెంట్ మళ్లీ సర్క్యులేట్ కాకుండా చూసేందుకు ప్రత్యేక చర్యలు చేపడుతోంది.

'సేఫ్ హార్బర్' రక్షణపై ప్రభుత్వం స్పష్టత

ఈ నివేదికలోని వర్గాల సమాచారం ప్రకారం.. చట్టపరమైన నిబంధనలను పాటించడంలో విఫలమైతే, ప్లాట్‌ఫామ్‌లకు 'సేఫ్ హార్బర్' (చట్టపరమైన రక్షణ) లభించదని ప్రభుత్వం పునరుద్ఘాటించింది. అయితే, సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌లపై సెన్సార్‌షిప్ విధించడం ప్రభుత్వ ఉద్దేశం కాదని, భారతీయ చట్టాలకు కట్టుబడి ఉండేలా చూడటమే తమ లక్ష్యమని అధికారులు స్పష్టం చేశారు. సామాజిక ప్రయోజనాలకు, హానికరమైన అంశాలకు మధ్య ప్లాట్‌ఫామ్‌లు సరైన సమతుల్యతను పాటించాల్సిన అవసరం ఉందని కూడా నివేదిక పేర్కొంది.

సోషల్ మీడియా వ్యసనం, దోపిడీకి సంబంధించిన కంటెంట్ వ్యాప్తి వంటివి కూడా ఆందోళన కలిగించే అంశాలుగా ఉన్నాయి. ఈ నేపథ్యంలో భారత్‌లో కంటెంట్ మోడరేషన్ విధానాల రూపకల్పన, అమలులో స్థానిక సాంస్కృతిక సందర్భాన్ని పరిగణనలోకి తీసుకోవడం చాలా ముఖ్యమని ప్రభుత్వం నొక్కి చెప్పినట్లు సమాచారం. నిబంధనలు ఉల్లంఘిస్తే ఇంటర్మీడియరీలు సేఫ్ హార్బర్ రక్షణను కోల్పోయే అవకాశం ఉన్నప్పటికీ, ఏదైనా నిర్దిష్ట సందర్భంలో ఆ రక్షణ వర్తిస్తుందా లేదా అనేది చట్టపరమైన నిబంధనల పాటింపు ఆధారంగా కోర్టులు నిర్ణయిస్తాయి. ప్రపంచవ్యాప్తంగా ఆన్‌లైన్ ప్లాట్‌ఫామ్‌ల కంటెంట్ విధానాలు, వినియోగదారుల భద్రతపై నియంత్రణ సంస్థల నిఘా పెరుగుతున్న తరుణంలో ఈ చర్చలు ప్రాధాన్యత సంతరించుకున్నాయి.

## 5జీతో వేగం.. 6జీ పైనా భారత్ దృష్టి..

# నివేదికలో ఆసక్తికర విషయాలు!

2030 నాటికి భారత్‌లో 62 శాతానికి చేరనున్న 5జీ వినియోగం

ఆసియా పసిఫిక్ సగటును అధిగమించనున్న ఇండియా

కవరేజీ కంటే వినియోగం పెంచడమే అసలు సవాల్ అని వెల్లడి

భారత్ డిజిటల్ ప్రగతిపై జీఎస్ఎంఏ నివేదికలో ప్రశంసలు




5జీ టెక్నాలజీ వినియోగంలో భారత్ ప్రపంచంలోనే అగ్రగామిగా నిలవనుందని, 2030 నాటికి దేశంలో 5జీ స్వీకరణ 62 శాతానికి చేరుకుంటుందని 'గ్లోబల్ మొబైల్ కమ్యూనికేషన్స్ సిస్టమ్'(జీఎస్ఎంఏ) తన తాజా నివేదికలో వెల్లడించింది. ఇది ఆసియా పసిఫిక్ ప్రాంత సగటు 50 శాతం కంటే గణనీయంగా ఎక్కువ కావడం విశేషం. ఈ ప్రాంతంలో బంగ్లాదేశ్, ఇండోనేషియా, పాకిస్థాన్‌లతో పాటు భారత్‌ను కూడా 'ప్రముఖ దేశం'గా జీఎస్ఎంఏ గుర్తించింది.

ఒకప్పుడు నెట్‌వర్క్ కవరేజీ పెద్ద సవాల్‌గా ఉండగా, ఇప్పుడు దేశంలో ఆ సమస్య దాదాపు పరిష్కారమైందని నివేదిక పేర్కొంది. ప్రస్తుతం కవరేజీ గ్యాప్ 5 శాతానికి పడిపోవడంతో అసలు సవాల్ కవరేజీ నుంచి వినియోగం, స్వీకరణ వైపు మారిందని తెలిపింది. స్మార్ట్‌ఫోన్ల ధరలు, డిజిటల్ నైపుణ్యాల కొరత, ఆన్‌లైన్ భద్రతపై నమ్మకం వంటివి మొబైల్ ఇంటర్నెట్ వాడకానికి ప్రధాన అవరోధాలుగా ఉన్నాయని వివరించింది.

ఈ సవాళ్లను అధిగమించేందుకు భారత్ చేస్తున్న ప్రయత్నాలను నివేదిక ప్రశంసించింది. 'భారత్‌నెట్', 'ప్రధానమంత్రి గ్రామీణ డిజిటల్ సాక్షరత అభియాన్ (పీఎంజీదిశ)' వంటి పథకాలను ఉదాహరణగా పేర్కొంది. పీఎంజీదిశ ద్వారా ఇప్పటికే 6.4 కోట్ల మంది గ్రామీణ పౌరులకు డిజిటల్ నైపుణ్యాల్లో శిక్షణ ఇచ్చినట్లు గుర్తు చేసింది. అదే సమయంలో డిజిటల్ నమ్మకాన్ని పెంపొందించడం కూడా భారత్‌కు ఆర్థిక ప్రాధాన్యతగా మారుతోందని, 2026 నాటికి ఇన్ఫర్మేషన్ సెక్యూరిటీపై చేసే ఖర్చు 11.7 శాతం పెరుగుతుందని అంచనా వేసింది. ఇందుకు దేశంలో అమలవుతున్న డిజిటల్ పర్సనల్ డేటా ప్రొటెక్షన్ చట్టం దోహదపడుతోందని తెలిపింది.

టెక్నాలజీలో స్వావలంబనపై భారత్ దృష్టి సారించిందని, 'ఆత్మనిర్భర్ భారత్' విధానం ఇందుకు నిదర్శనమని నివేదిక పేర్కొంది. బీఎస్ఎన్ఎల్ దేశీయంగా అభివృద్ధి చేసిన 4జీ టెక్నాలజీని వాడటం, దానిని 5జీకి అప్‌గ్రేడ్ చేసుకునే వీలుండటం గొప్ప విషయమని తెలిపింది. అంతేకాకుండా భవిష్యత్ అవసరాలను దృష్టిలో పెట్టుకుని భారత్ ఇప్పటికే 6జీ స్పెక్ట్రమ్ రోడ్‌మ్యాప్‌ను కూడా ప్రకటించడం దాని దీర్ఘకాలిక ప్రణాళికకు అద్దం పడుతోందని వివరించింది. 5జీ, కృత్రిమ మేధ (ఏఐ), ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ (×శీ) వంటివి తయారీ, సేవల రంగాల్లో ఉత్పాదకతను గణనీయంగా పెంచుతాయని నివేదిక అంచనా వేసింది.

# దప్పు కళాకారుల సమస్యలపై విక్కుర్తికి వినతి

### కళాకారుల సమస్యలు పరిష్కరించాలి



అవనిగడ్డ సెప్టెంబర్ 24 శ్రీవార్త అవనిగడ్డ నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో గురువారం ఘంటసాల, చల్లపల్లి మండలాలకు చెందిన దప్పు కళాకారులు తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ నియోజకవర్గ టీడీపీ ఇంచార్జ్ విక్కుర్తి శ్రీనివాసరావును కలిసిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నాటక అకాడమీ డైరెక్టర్ పైడిపాముల స్వప్న, టీడీపీ రాష్ట్ర సాంస్కృతిక విభాగం ప్రధాన కార్యదర్శి దిరిశం బాలకోటయ్య ఆధ్వర్యంలో కళాకారులు వినతిపత్రాన్ని సమర్పించారు.ఈ సందర్భంగా దప్పు కళాకారులు ఎదుర్కొంటున్న సమస్యలను విక్కుర్తి శ్రీనివాసరావు అడిగి తెలుసుకున్నారు. వారి సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని ఆయన తెలిపారు. కళాకారులకు అవసరమైన సహకారం అందించేందుకు తన వంతు ప్రయత్నం చేస్తానని విక్కుతి శ్రీనివాస్ చెప్పారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ కొల్లూరు వెంకటేశ్వరరావు. యాసం చిట్టిబాబు దప్పు కళాకారులు సాంస్కృతిక కళాకారులు పాల్గొన్నారు,

# మీడియాతో మాట్లాడుతున్న యువ నేత గౌతమ్

### కేంద్ర ప్రభుత్వ టెలికమ్యూనికేషన్స్ శాఖ నిర్వహించిన పరీక్షలో గౌతమ్‌కు ఉత్తీర్ణత



అవనిగడ్డ సెప్టెంబర్ 24 శ్రీవార్తరేడియో కమ్యూనికేషన్‌పై శిక్షణ పొంది, కేంద్ర ప్రభుత్వ టెలికమ్యూనికేషన్స్ శాఖ నిర్వహించిన అమేచ్యూర్ స్టేషన్ పరీక్షలో జనరల్ గ్రేడ్‌లో ఉత్తీర్ణత సాధించి, సెప్టెంబర్ 21, 2026న న్యూఢిల్లీలోని కేంద్ర ప్రభుత్వ కమ్యూనికేషన్స్ మంత్రిత్వ శాఖ, టెలికమ్యూనికేషన్స్ శాఖకు చెందిన వైర్‌లెస్ ప్లానింగ్ అండ్ కోఆర్డినేషన్ విభాగం నుంచి తనకు సర్టిఫికెట్, జీవిత కాలం లైసెన్స్ మంజూరు కాబడిందని గౌతమ్ చెప్పారు.విపత్తులు, అత్యవసర పరిస్థితుల్లో కీలకమైన ప్రత్యామ్నాయ కమ్యూనికేషన్ చేసే అవకాశంతుపానులు, వరదలు, భూకంపాలు లేదా ఇతర విపత్తుల సమయంలో సాధారణ టెలిఫోన్, మొబైల్, ఇంటర్నెట్ వ్యవస్థలు పనిచేయని పరిస్థితులు ఏర్పడవచ్చు. అలాంటి సమయంలో సమాచారాన్ని మార్పిడి చేసుకునే అవకాశం ఉంటుందని,అత్యవసర సమాచారాన్ని ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి ఉచితంగా చేరవేయడంలో లైసెన్స్ పొందిన వారు డిజాస్టర్ మేనేజ్మెంట్ ద్వారా ప్రభుత్వానికి కూడా సహాయక పాత్ర పోషించగలరని యువ నేత యువ న్యాయవాది గురువారం గౌతమ్ చెప్పారు.అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రంలో ఉన్న వ్యోమగాములతో సంభాషించే అవకాశంఈ సర్టిఫికెట్ /లైసెన్స్ పొందిన వారు భూమిపై నుండి అంతరిక్ష కేంద్రంలోని వ్యోమగాములతో సంభాషించే అవకాశాన్ని పొందుతారని గౌతమ్ తెలిపారు. దీంతో పాటు ఉపగ్రహాల ద్వారా కమ్యూనికేషన్, సుదూర ప్రాంతాలతో సమాచార మార్పిడి, వివిధ డిజిటల్ విధానాల ద్వారా ప్రసారాలు, సాంకేతిక ప్రయోగాలు, అత్యవసర సమాచార సేవలు వంటి అనేక వాటిలో సాంకేతిక పరిజ్ఞానం కలిగి ఉండి, ఈ లైసెన్స్ పొందిన వారు ఉపయోగించుకోవచ్చని గౌతమ్ అన్నారు.ఈ లైసెన్స్ రాజీవ్ గాంధీ, సోనియా గాంధీ, అమితాబ్ బచ్చన్, కమల్ హాసన్, మమ్ముట్టి లాకు కూడా ఉందని గౌతమ్ తెలిపారు.కేంద్ర ప్రభుత్వ టెలికమ్యూనికేషన్స్ శాఖ నుంచి అమేచ్యూర్ జనరల్ గ్రేడ్ లైసెన్స్ పొందడం తనకు ఎంతో ఆనందంగా ఉందని గౌతమ్ చెప్పారు. రాబోయే రోజుల్లో కమ్యూనికేషన్, ఉపగ్రహ కమ్యూనికేషన్, అంతరిక్ష కమ్యూనికేషన్ మరియు సాంకేతిక ప్రయోగాలపై యువత అవగాహన పెంచుకోవాలని గౌతమ్ అన్నారు.

## మీడియాతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మండలి

# నూతన రహదారుల నిర్మాణానికి రూ.2.56కోట్లు మంజూరు

### వీబీజీ-రాంజీ నిధులు మంజూరు చేసిన డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్

### కృతజ్ఞతలు తెలిపిన అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్



అవనిగడ్డ సెప్టెంబర్ 24 శ్రీ వార్త పల్లె పండుగ 3.0 కార్యక్రమంలో భాగంగా రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ సహకారంతో నూతన రహదారుల నిర్మాణానికి రూ.2.56కోట్లు నిధులు మంజూరు అయినట్లు ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ గురువారం తెలిపారు. పంచాయతీరాజ్ గ్రామీణ అభివృద్ధి శాఖ ద్వారా వీబీజీ-రాంజీ పథకం నిధుల నుంచి పలు రహదారులను ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ మంజూరు చేసినట్లు ఎమ్మెల్యే తెలిపారు. రూ.45.50 లక్షలతో చల్లపల్లి మండలం పాగోలు సెంటర్ నుంచి చల్లపల్లి- నడకుదురు ఆర్.అండ్.బీ రోడ్డు వరకు 970 మీటర్లు నూతన తారు రోడ్డు మంజూరైనట్లు తెలిపారు. రూ.42 లక్షలతో పాత మాజేరు- కొత్త మాజేరు మధ్య 600మీటర్లు నూతన తారు రోడ్డు మంజూరైనట్లు తెలిపారు. రూ.42 లక్షలతో అవనిగడ్డలో కొత్త వంతెన నుంచి డీఎస్పీ కార్యాలయం వరకు నూతన సీసీ రోడ్డు మంజూరైనట్లు తెలిపారు. రూ.126.50 లక్షలతో కోడూరు మండలం నారేపాలెం టూ పిట్టల్లంక వయా బడేవారిపాలెం ప్రధాన రహదారి 2.700 కిలోమీటర్లు నూతన తారు రోడ్డు మంజూరైనట్లు వివరించారు.

# వైభవంగా గణేశుని శోభయాత్ర







నిజాంపేట్ శ్రీ వార్త ప్రత్యేక ప్రతినిధి నిజాంపేట్ డబుల్ బెడ్ రూమ్స్ మూడవ బ్లాక్ వద్ద గణేష నవరాత్రులు ఎంతో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భారీగా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. శోభయాత్ర కన్నుల విందుగా జరిగింది. మహిళలు డి. జె. డాన్సులు చేశారు. బాణాసంచా కాలుస్తూ, డప్పులు, డాన్సులతో మరింత ఉత్సాహము కలిగించారు. నిజాంపేట్ ప్రాంతంలో వినాయక స్వామి వారి శోభా యాత్ర జరిగింది. ప్రగతి నగర్ చెరువు వద్ద వినాయక నిమజ్జనం కార్యక్రమం జరిగింది.

# మచిలీపట్నానికి పూర్వ వైభవం తీసుకురానున్న గోవా షిప్‌యార్డ్

### రూ.8 వేల కోట్ల పెట్టుబడితో 400 ఎకరాల్లో భారీ నౌకా నిర్మాణ పరిశ్రమలి

### సుమారు 10 వేల మందికి ప్రత్యక్ష ఉపాధి అవకాశాలులి

### పరిశ్రమల ఏర్పాటుకు అవసరమైన అనుమతులు, మౌలిక వసతుల కల్పనను వేగవంతం చేస్తాం...మంత్రి కొల్లు రవీంద్ర



మచిలీపట్నం శ్రీవార్త న్యూస్ మచిలీపట్నంలో గోవా షిప్‌యార్డ్ సంస్థ ఆధ్వర్యంలో రూ. 8వేల కోట్ల పెట్టుబడితో 400 ఎకరాల్లో భారీ నౌకా నిర్మాణ పరిశ్రమ ఏర్పాటు చేయడానికి రాష్ట్ర మంత్రివర్గం ఆమోదం తెలపడం చారిత్రాత్మక నిర్ణయమని రాష్ట్ర గనులు, భూగర్భ వనరులు, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. ఈ పరిశ్రమ ఏర్పాటుతో మచిలీపట్నానికి తిరిగి పూర్వ వైభవం రానుందని, స్థానిక యువతకు పెద్దఎత్తున ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభించనున్నాయని తెలిపారు.గురువారం మధ్యాహ్నం మచిలీపట్నంలోని రహదారులు, భవనాల శాఖ అతిథి గృహంలో ఏపీఎస్ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ళ నారాయణరావుతో కలిసి నిర్వహించిన పాత్రికేయుల సమావేశంలో మంత్రి కొల్లు రవీంద్ర మచిలీపట్నం పోర్టుకు అనుబంధంగా గోవా షిప్‌యార్డ్ ఏర్పాటుకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. మచిలీపట్నంలో వందల సంవత్సరాలుగా నౌకల నిర్మాణం జరిగిన చారిత్రక నేపథ్యం ఉందని, కొంతకాలంగా నిలిచిపోయిన నౌకా నిర్మాణ కార్యకలాపాలు తిరిగి ప్రారంభం కావడం సంతోషకరమని అన్నారు.గోవా షిప్‌యార్డ్ సంస్థ 400 ఎకరాల్లో యుద్ధ నౌకలు, కోస్ట్‌గార్డ్ పడవలు, ఇతర నౌకల నిర్మాణానికి భారీ పరిశ్రమను ఏర్పాటు చేయనుందని మంత్రి తెలిపారు. ఈ ప్రాజెక్టు ద్వారా సుమారు 10 వేల మందికి ప్రత్యక్షంగా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభించే అవకాశం ఉందన్నారు. షిప్‌యార్డ్‌కు అనుబంధంగా యాన్సిలరీ యూనిట్ల ఏర్పాటుతో మరో రూ.3 వేల నుంచి రూ. 4 వేల కోట్ల వరకు పెట్టుబడులు వచ్చే అవకాశం ఉందని చెప్పారు.సంస్థ ప్రతిపాదించిన ప్రకారం అవసరమైన ప్రభుత్వ అనుమతులు, మౌలిక వసతుల కల్పనను వేగవంతం చేసి రెండు సంవత్సరాల్లో ఉత్పత్తి ప్రారంభించేలా ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుందని మంత్రి స్పష్టం చేశారు. ఇందుకు సంబంధించి అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు.గతంలో కొన్ని కారణాలతో ప్రాజెక్టు విషయంలో అనిశ్చితి ఏర్పడినప్పటికీ యువనేత మంత్రి నారా లోకేష్ చొరవతో గోవా షిప్‌యార్డ్ మళ్లీ మచిలీపట్నానికి రావడం సాధ్యమైందని మంత్రి పేర్కొన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి ఆయన కృతజ్ఞతలు తెలిపారు.స్వాతంత్ర్యం అనంతరం మచిలీపట్నంలో ఇంత భారీ పెట్టుబడితో పరిశ్రమ ఏర్పాటు కావడం జిల్లాకు కీలక పరిణామమని మంత్రి అన్నారు. గతంలో భారత్ సాల్ట్ రిఫైనరీ వంటి పరిశ్రమలు మచిలీపట్నంలో ఏర్పడి వేలాది మందికి ఉపాధి కల్పిస్తున్నాయని, ఇప్పుడు గోవా షిప్‌యార్డ్ ఏర్పాటు మరిన్ని పరిశ్రమల రాకకు నాంది కానుందని తెలిపారు.మచిలీపట్నం పోర్టు అభివృద్ధి పనులను కూడా ప్రభుత్వం వేగవంతం చేసిందని మంత్రి తెలిపారు. బెర్తుల నిర్మాణ పనులు పూర్తయ్యాయని, డ్రెడ్జింగ్ పనులు కొనసాగుతున్నాయని చెప్పారు. పోర్టు, షిప్‌యార్డ్, అనుబంధ పరిశ్రమల అభివృద్ధితో మచిలీపట్నం భవిష్యత్తులో కీలక పారిశ్రామిక కేంద్రంగా ఎదిగే అవకాశం ఉందన్నారు.రానున్న పరిశ్రమల్లో స్థానిక యువత, మహిళలను భాగస్వాములను చేసేందుకు అవసరమైన నైపుణ్య శిక్షణ అందిస్తామని మంత్రి తెలిపారు. ఉద్యోగ అవకాశాలతో పాటు స్థానికులు స్వయం ఉపాధి, పారిశ్రామికవేత్తలుగా ఎదిగేందుకు ప్రోత్సహిస్తామని చెప్పారు. పెద్ద పరిశ్రమలకు అనుబంధంగా స్థానికులు పెట్టుబడులు పెట్టేందుకు ఎంఎస్ఎంఈ పార్కులను ఏర్పాటు చేసి, ఉత్పత్తుల తయారీకి అవసరమైన శిక్షణ, సదుపాయాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు.పర్యావరణానికి ఇబ్బంది కలగకుండా, రైతులకు ఎలాంటి నష్టం వాటిల్లకుండా పారిశ్రామిక ప్రాంతాల ఏర్పాటుకు కార్యాచరణ రూపొందిస్తామని మంత్రి పేర్కొన్నారు. పర్యావరణహిత పరిశ్రమలను ప్రోత్సహిస్తూ భవిష్యత్తులో మరిన్ని పెట్టుబడులు జిల్లాకు వచ్చేలా ప్రభుత్వం చర్యలు చేపడుతుందని అన్నారు.గోవా షిప్‌యార్డ్ ఏర్పాటు కేవలం ఒక పరిశ్రమ రాక మాత్రమే కాదని, మచిలీపట్నంలో భవిష్యత్తులో మరిన్ని పరిశ్రమలు, పెట్టుబడులు, ఉపాధి అవకాశాలకు నాంది అని మంత్రి పేర్కొన్నారు.మచిలీపట్నానికి కొత్త పారిశ్రామిక శకం.. ---- ఏపీఎస్ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ళ నారాయణరావుఏపీఎస్ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణరావు మాట్లాడుతూ.. మచిలీపట్నం అభివృద్ధికి గోవా షిప్‌యార్డ్ ఏర్పాటు తొలి అడుగుగా నిలుస్తుందని, పోర్టు నిర్మాణంతో పాటు అనుబంధ పరిశ్రమలు రావడం ప్రారంభమైందని తెలిపారు.షిప్‌యార్డ్ ద్వారా ఏర్పడే ఉద్యోగాల్లో స్థానిక యువతకు అధిక ప్రాధాన్యత కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. పోర్టు పూర్తిస్థాయిలో అందుబాటులోకి వస్తే



ఆయిల్ రిఫైనరీలు, ఎడిబుల్ ఆయిల్ ప్రాసెసింగ్, ప్యాకేజింగ్, కంటైనర్ ఆధారిత పరిశ్రమలు తదితర అనుబంధ రంగాలు అభివృద్ధి చెందే అవకాశాలున్నాయని చెప్పారు. పోర్టు నిర్మాణం వేగవంతం కావడంతో మచిలీపట్నంపై పెట్టుబడిదారుల్లో నమ్మకం పెరిగిందన్నారు.మచిలీపట్నం నుంచి అవనిగడ్డ వరకు పారిశ్రామిక అభివృద్ధికి అనుకూలమైన ప్రాంతాలను వినియోగించుకునే అవకాశం ఉందని కొనకళ్ల నారాయణరావు తెలిపారు. పోర్టు, షిప్‌యార్డ్ ఆధారంగా మరిన్ని పరిశ్రమలు ఆకర్షించేలా సమష్టిగా కృషి చేస్తామని, రానున్న కాలంలో మచిలీపట్నం ప్రముఖ పారిశ్రామిక నగరంగా ఎదిగే అవకాశం ఉందని పేర్కొన్నారు.సమావేశంలోజిల్లా ప్రధాన కార్యదర్శి గోపు సత్యనారాయణ,మచిలీపట్నం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కుంచె దుర్గాప్రసాద్ నాని, కూటమి నాయకులు పంతం గజేంద్రరావు, పినిశెట్టి వేణు తదితర నాయకులు పాల్గొన్నారు.

## విజయవాడ అంతర్జాతీయ విమానాశ్రయ నూతన టెర్మినల్ పనులను వేగవంతం చేయాలి....జిల్లా కలెక్టర్ డీకే బాలాజి



గన్నవరం శ్రీ వార్త న్యూస్ విజయవాడ అంతర్జాతీయ విమానాశ్రయ నూతన టెర్మినల్ పనులను వేగవంతం చేసి నిర్ణీత సమయానికి పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ అధికారులను ఆదేశించారు.విజయవాడ అంతర్జాతీయ విమానాశ్రయం విస్తరణలో భాగంగా నిర్మాణంలో ఉన్న న్యూ ఇంటిగ్రేటెడ్ టెర్మినల్ పనులను జిల్లా కలెక్టర్ గురువారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు.ఈ సందర్భంగా



టెర్మినల్ భవన నిర్మాణంతో పాటు వివిధ విభాగాల్లో జరుగుతున్న పనుల పురోగతిని అధికారులను అడిగి తెలుసుకున్నారు. నిర్మాణ పనులు, మౌలిక వసతుల కల్పన తదితర అంశాలపై సంబంధిత అధికారులతో మాట్లాడారు. నిర్ణీత లక్ష్యాలకు అనుగుణంగా పనులను వేగవంతం చేసి, నాణ్యతా ప్రమాణాలను పాటిస్తూ త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు.విమానాశ్రయ విస్తరణతో ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు అందుబాటులోకి రానున్న నేపథ్యంలో పనుల పురోగతిని నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. నిర్మాణ పనుల్లో ఎదురయ్యే సమస్యలను సంబంధిత శాఖల సమన్వయంతో వెంటనే పరిష్కరించి పనులకు ఎలాంటి అంతరాయం కలగకుండా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు.కలెక్టర్ వెంట గన్నవరం విమానాశ్రయ జనరల్ మేనేజర్ రామాచారి, డైరెక్టర్ లక్ష్మీ కాంత్ రెడ్డి, గుడివాడ ఆర్డీవో జి బాలసుబ్రమణ్యం, గన్నవరం మండలం తహసీల్దార్ శివయ్య, ఇంజనీరింగ్ తదితర అధికారులు ఉన్నారు.

## పేర్ని, ఉప్పాల రాము పై టిడిపి నాయకులు ఆగ్రహం



బంటుమిల్లి శ్రీ వార్త న్యూస్:పెదన ఎమ్మెల్యే కాగిత కృష్ణ ప్రసాద్ పై పేర్ని నాని, ఉప్పాల రాము చేసిన అనుచిత వ్యాఖ్యలపై స్థానిక టిడిపి నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలుగుదేశం పార్టీ నాయకులు గురువారం బంటుమిల్లి జానకిరామపురం తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో మీడియా సమావేశంలో అనుచిత వ్యాఖ్యలు చేసిన వైఎస్ఆర్సిపి నాయకులు పై మండిపడ్డారు. ఈనెల 21వ తారీకు పెదన ఫంక్షన్ హాల్ లో వైసిపి ఇన్చార్జ్ ఉప్పాల రామఆధ్వర్యంలో జరిగిన విస్తృతస్థాయిసమావేశంలో స్థానిక శాసనసభ్యులు కాగిత కృష్ణ ప్రసాద్ పై చేసిన వ్యాఖ్యలకు టిడిపి నాయకులు ఘాటుగా బదులిచ్చారు. పెదననియోజకవర్గ నీటి సంఘం నాయకులు బొర్రా కాశి విశ్వేశ్వరరావు, నియోజకవర్గ ఎస్సీ సెల్ నాయకుడు ఆకునూరి రత్నకుమార్ మాట్లాడుతూ తమ నాయకుడు కృష్ణ ప్రసాద్ మచ్చలేని నాయకుడని 38వేల ఓట్ల మెజారిటీతో పెదన నియోజకవర్గ ప్రజలు భారీ మెజారిటీతో గెలిపించడం జరిగిందని నియోజకవర్గ అభివృద్ధికి అనేక రకాలుగా కృషి చేస్తున్నారనిఅన్నారు. అవినీతి రహితంగా నిత్యం ప్రజలతో మమేకమై ఎవరికి ఏం కావాలో తెలుసుకుని ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రజా సమస్యల పరిష్కారానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నారన్నారు. నియోజకవర్గంలో కోట్ల రూపాయల నిధులు మంజూరు చేయించి నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తున్నారని అన్నారు. నియోజకవర్గ వైసిపి నాయకులు, కార్యకర్తలు చాలావరకు కృష్ణ ప్రసాద్ వద్దకు వచ్చి వారికి కావాల్సిన పని చేయించుకుంటున్నారని ఎద్దేవా చేశారు. మచ్చలేని నాయకుడైన కృష్ణ ప్రసాద్ పై అనుచిత వ్యాఖ్యలు చేయడం హాస్యాస్పదంగా ఉందని అన్నారు. ఈ సమావేశంలో టిడిపి నాయకులు ఎండి నజీర్, ఎండి నూర్, కాగిత బాలాజీ, నాయకులు కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

## ఆత్మవిశ్వాసంతో ముందడుగువేసి విజయవంతంగా ఒత్తిడి నివారణ అవగాహన కార్యక్రమం



విజయవాడ శ్రీ వార్త న్యూస్ జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ ఆధ్వర్యంలో కలెక్టర్ క్యాంపు కార్యాలయ సమావేశ మందిరంలో మానసిక ఆరోగ్యంపై అవగాహన కల్పించేందుకు నిర్వహిస్తున్న కార్యక్రమాల్లో భాగంగా గురువారం మానసిక ఒత్తిడి నివారణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో సైకాలజిస్టులు సిబ్బందికి మానసిక ఒత్తిడిని గుర్తించడం, నియంత్రించడం, దాన్ని అధిగమించే విధానాలపై అవగాహన కల్పించారు. సైకాలజిస్ట్ జ్యోతి మాట్లాడుతూ మానసిక ఒత్తిడి రావడం సహజమేనని, అయితే దాన్ని ప్రారంభ దశలోనే గుర్తించి నియంత్రించుకోవడం ఎంతో ముఖ్యమని తెలిపారు. ఒత్తిడిని తగ్గించుకునేందుకు నిత్యం వ్యాయామం, నడక, తగినంత నిద్ర, ఆరోగ్యకరమైన ఆహారం, సమయపాలన, ముందస్తు ప్రణాళిక వంటి అలవాట్లను పాటించాలని సూచించారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన సైకాలజిస్ట్ డాక్టర్ టి.ఎస్. రావు మాట్లాడుతూ అధిక మానసిక ఒత్తిడి ఆలోచనా విధానం, విశ్లేషణాత్మక సామర్థ్యం, పనిపట్ల ఆసక్తిపై ప్రభావం చూపుతుందని తెలిపారు. కార్యాలయంలో ఎదురయ్యే ఒత్తిడిని ఇంటికి తీసుకెళ్లకుండా జాగ్రత్త వహించాలని సూచించారు. ఆఫీసు ఒత్తిడి కుటుంబ సభ్యులు, పిల్లలపై ప్రభావం చూపకుండా చూసుకోవాలని, కుటుంబ సభ్యులతో సంతోషంగా, సానుకూలంగా సమయం గడపడం ద్వారా మానసిక ఒత్తిడిని తగ్గించుకోవచ్చని తెలిపారు. సైకాలజిస్ట్ జగదీశ్ మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో గత 18 వారాలుగా ఈ అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాల ద్వారా ప్రయోజనం పొందుతున్నారన్నారు. కార్యక్రమంలో కార్యక్రమ సమన్వయ అధికారి జి.జ్యోతి, ఆకర్ష ఫౌండేషన్ అధ్యక్షుడు డా. గర్రె శంకరరావు తదితరులు పాల్గొన్నారు.

# హంసలదీవి బీచ్ గేట్లు మూసివేత



శ్రీవార్త న్యూస్ కోడూరు భారీ వర్షాల నేపథ్యంలో ప్రముఖ పర్యాటక తీరమైన కోడూరు మండలంలోని హంసలదీవి బీచ్ గేట్లను అధికారులు గురువారం మూసివేశారు బంగాళాఖాతంలో నెలకొన్న తీవ్ర వాయుగుండం ప్రభావంతో సముద్ర తీరం అల్లకల్లోలంగా మారింది ఇక్కడ పరిస్థితి తెలియకుండా దూర ప్రాంతాల నుంచి సాగర తీరానికి వచ్చే పర్యాటకులు భక్తులు ఎలాంటి ప్రమాదాల బారిన పడకుండా ముందు జాగ్రత్తగా గేట్లు మూసివేశారు ఎవరు తీరం వైపు వెళ్లకుండా బస్తి ఏర్పాటు చేశారు

## పామర్రులో వర్షానికి జలమయమైన కోటిరెడ్డిపేట

## ఈవో, శానిటరీ అధికారి హుటాహుటిన చర్యలతో ఉపశమనం



పామర్రు శ్రీ వార్త న్యూస్ తుఫాను ప్రభావంతో గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు పామర్రు పట్టణంలోని కోటిరెడ్డిపేట జలమయమైంది. పంచాయతీ డ్రైనేజీ కాలువలు పూడిపోవడంతో వర్షపు నీరు రోడ్లపైకి, ఇళ్లలోకి చేరి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.సమాచారం అందుకున్న వెంటనే మండల, డివిజన్, జిల్లా స్థాయి అధికారుల ఆదేశాల మేరకు పంచాయతీ ఈవో బి.వెంకటేశ్వరరావు, శానిటరీ అధికారి కె.సుధాకర్ ప్రత్యేక సిబ్బందితో కలిసి ముంపు ప్రాంతాన్ని పరిశీలించారు.ఇరువురి స్వీయ పర్యవేక్షణలో కాలువల పూడికతీత పనులను యుద్ధప్రాతిపదికన చేపట్టారు. నీటి ప్రవాహానికి అడ్డుగా ఉన్న చెత్త, వ్యర్థాలను తొలగించడంతో బురద నీరు క్రమంగా తగ్గుముఖం పట్టింది. దీంతో స్థానికులకు తాత్కాలిక ఉపశమనం లభించింది.స్థానికుల ఆవేదన: ముందస్తు చర్యలు తీసుకుంటే ఈ సమస్య వచ్చేది కాదని స్థానికులు అభిప్రాయం వ్యక్తం చేశారు. వర్షాలు తగ్గిన అనంతరం ప్రత్యేక పారిశుద్ధ్య చర్యలు అమలు చేస్తామని ఈవో వారికి హామీ ఇచ్చారు.అలాగే ఎంఆర్వో కార్యాలయం, పోలీస్ స్టేషన్ పరిసరాల్లోని డ్రైనేజీలను కూడా శుభ్రం చేశారు.

Pulisher,Owner and Editor kureti satish, printed by Teja cards and stationery ground floor 26-25-2durgi vari veedhi,opp Inox theater Gandhi nagar Vijayawada ,Andra Pradesh 520003.PRGS Nembar: APTEL/26/A4813, Editor: kureti satish,cell number:9866640784,H. No:21-651a,near Suvarna Kalyana mandapam,parasupeta machilipatnam Krishna Distric, Andra Pradesh.521001